ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్ : fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 105 పేజీలు: 10+4 వెల: 6.50

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 82 మంది మృతి 5లో

రక్షణ రంగానికి మరో రూ. 50వేల కోట్లు

# హైదరాబాద్‌లో డేటాసిటీ

## ఫ్యూచర్‌సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్‌లైన్లు

### ఓఆర్ఆర్ పొడవునా సోలార్ విద్యుత్ కాంతులు

### సెక్రటేరియట్, నెక్లెస్‌రోడ్‌లో స్మార్ట్‌పోల్స్

### విద్యుత్ శాఖపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్, డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే16:** గతంలో ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ పెరిగిందని, రాబోయే భవిష్యత్తు అంచనాలు, అవసరాలకు తగినట్లుగా విద్యుత్తు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్రానికి వెల్లువెత్తిన పెట్టుబడులు, రాబోయే రోజుల్లో తెలంగాణలో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు ప్రణాళిక తయారు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తననివాసంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కలిసి విద్యుత్ శాఖపై ఆయన సమీక్ష చేశారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. మెట్రోవిస్తరణ, రైల్వే లైన్లు, ఇతర మాస్‌ట్రాన్స్‌పోర్ట్‌ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామికవాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ దేశంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. భవిష్యత్తులో డేటా



సెంటర్ల హబ్‌గా మారబోతుందని, హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్‌లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండిఎతో సమన్వయం చేసుకోవాలని విద్యుత్తు శాఖఅధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలి. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైన దృష్టి సారించాలని, ఫ్యూచర్ సీటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.
ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు,పోల్స్,లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీల్లేదని, హై టెన్షన్ లైన్ల ను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం సూచించారు. సెక్రెటేరియట్, నక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ముందుగా ప్రయత్నించాలన్నారు. 160 కిలో మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ పొడవునా సోలార్ విద్యుత్ వినియోగించుకునే ప్రణాళికఉండాలని, జిహెచ్ఎంసి పరిధిలోని ఫుట్ పాత్ లు, నాలాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.
పరిశ్రమలతో పాటు గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ (మెట్రో, ఎలక్ట్రికల్ వెహికిల్స్) దృష్టిలో ఉంచుకొని పునరుత్పాదక విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సిఎం సూచించారు. భవిష్యత్తు విద్యుత్ అవసరాలను ముందస్తుగా అంచనా వేసి రోడ్ మ్యాప్ సిద్ధంచేసుకోవాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల వచ్చే >>2



శుక్రవారం మహబూబ్‌నగర్‌జిల్లా పిల్లలమర్రి మహావృక్షం వద్ద ప్రపంచ సుందరీమణులు

## 'పిల్లలమర్రి'చెంత వరల్డ్ 'మిస్'లు

### తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటండి: మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 16 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ సుందరి పోటీలకు వివిధ దేశాల నుండి వచ్చిన సుందరీమణులు శుక్రవారం సాయంత్రం మహబూబ్ నగర్ జిల్లాలోని చారిత్రాత్మక పిల్లలమర్రి పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. సుందరీమణులుకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్‌పి.డి.జానకిలు ఘనంగా స్వాగతం పలికారు. 16వ శతాబ్దానికి చెందిన శ్రీ రాజరాజేశ్వర దేవాలయం సంద >>2

## వానాకాలం నుంచే ఉచిత పంటల బీమా

### 1.34 కోట్ల ఎకరాలకు అమలు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం సీజను నుండే తెలంగాణలో ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనుంది. రాష్ట్రంలో దాదాపు 1.34 కోట్ల ఎకరాలకు ఉచిత పంటల బీమా అమలు చేయాల్సి ఉంటుందని అంచనా. ఇందుకు గాను పశ్చిమబెంగాల్ తరహాలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియంను రాష్ట్ర సర్కారే భరించాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక, వ్యవసాయ శాఖ అధికారులు విధివిధానలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరడం, ప్రీమియం చెల్లింపు, పంటలు లేదా, గ్రామాన్ని యూనిట్‌గా చేసుకోవడం వంటివాటిపై లోతైన పరిశీలన చేస్తున్నాయి. ఈ పథకం అమలకు సంబంధించి జిల్లాల వారీగా వ్యవసాయ అధికారుల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు తెలియవచ్చింది. కాగా క్రాప్ బుకింగ్ పోర్టల్‌ను ఇప్పటికే నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అందులో పేర్కొన్న వివరాల ఆధారంగా పంటల బీమాను వర్తింప చేయనుంది.

# చివరి గింజదాకా కొంటాం

### మద్దతు ధర ఇచ్చి ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామన్న మంత్రి ఉత్తమ్

### అవసరమైతే మాధ్యమిక గిడ్డంగుల్లో భద్రపరుస్తాం

### తడిసిన ధాన్యం సైతం కొంటాం: సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 16,ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణ వేగవంతం చేయడానికి మిల్లర్లు సహకరించకపోతే మాధ్యమిక గిడ్డంగుల్లో తాత్కాలికంగా భద్రపరిచేందుకు కలెక్టర్లు శ్రద్ధ తీసుకోవాలని వెనువెంటనే కొనుగోలు చేసిన ధాన్యం తరలించాలని పౌరసఫరాలశాఖ, నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. యాసంగి సీజన్‌లో తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని ధాన్యం రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.రామ కృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్‌లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్‌లతో విడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షనిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రికార్డ్ స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 17 వేల కోట్ల ఖర్చు చేస్తూ 70 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేస్తుందని తెలిపారు.సన్న రకం ధాన్యానికి క్వింటాల్ 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసిన 48 గంటల్లో రైతులకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు.
భారీ స్థాయిలో కొనుగోలు జరుగుతున్న విషయం ప్రజలకు చెప్పాలని అన్నారు.రాబోయే 15 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరతరాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్ని బ్యాగ్‌లు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టాలని అన్నారు. అకాలవర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

కొనుగోలుచేయాలని మంత్రిసూచించారు. తడిచిన ధాన్యాన్ని కూడా రైతు సంక్షేమం దృష్టిలో ఉంచుకొని కొనుగోలు చేయాలని మంత్రి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. రైతుల దగ్గర నుంచి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేయడం ప్రాధాన్యతగా అత్యవసర పరిస్థితుల్లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు చేయడానికి అనుమతులు కూడా కలెక్టర్లకు జారీ చేస్తున్నామని తెలిపారు. 26 జనవరి 2025 తరువాత మన రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, >>2



శుక్రవారం న్యూఢిల్లీలో శ్రీరామభద్రాచార్యకు జ్ఞానపీఠ్ అవార్డును ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము 2లో

## ఫలించని శాంతి చర్చలు

### రష్యా డిమాండ్లు ఆమోదయోగ్యం కాదన్న ఉక్రెయిన్

**ఇస్తాంబుల్, మే 16:** రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపుపలికే చర్యల్లో భాగంగా రెండుదేశాలమధ్య శాంతిచర్చలు ప్రారంభించారు. ఆమోదించలేని డిమాండ్లను రష్యా ప్రతిపాదించిందని ఉక్రెయిన్ ఆరోపించింది. ఏ విధమైన పురోగతి లేకుండానే నేటి చర్చలనుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశ్యంతోనే రష్యా బృందం ఇలా వ్యవహరిస్తోందని స్పష్టం అవుతున్నట్లు ఉక్రెయిన్‌బృందం తెలిపింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రతిపాదించినట్లుగా కాల్పులవిరమణ తక్షణం అమలులోకి రావడం, దౌత్యా >>2

# నేడే తిరంగా యాత్ర

## కొత్త చరిత్ర లిఖించిన మన సైనికులు

### సమగ్రతను సవాల్ చేసే వారిని వదిలిపెట్టం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మే 16 ప్రభాతవార్త:** మానవ సమాజానికి సవాలుగా నిలిచిన, సెక్యులరిజానికి భంగం కలిగించిన, దేశ సమగ్రతకు సవాలుగా నిలిచిన వారిని భారతదేశం వదిలిపెట్టేది లేదని, ఉగ్రవాదంపై కఠినచర్యలు తీసుకుంటామని భారత ప్రధాని గట్టిగా హెచ్చరికలు చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలోమాట్లాడారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం టాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు.
అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత,



శుక్రవారం మీడియాతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలి అని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని భారత సైనికులకు సంఘీభావం ప్రకటించాలన్నారు. ప్రధానిమోడీ నాయకత్వంలో భారతదేశం సమగ్ర విధానంతో, భారత >>2

## కెటిఆర్, హరీష్ రావు రెండు గంటలు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే16:** బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుతో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) సమావేశం అయ్యారు. హరీశ్ నివాసానికి వెళ్లి కెటిఆర్ అనారోగ్యంతో ఉన్న హరీశ్ తండ్రి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత తాజా



రాజకీయ పరిణామాలు, పరిస్థితులపై ఇద్దరు సుమారు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. ఇటీవలే సామాజిక మాధ్యమాల్లో తనపై వస్తున్న వార్తలను హరీశ్‌రావు ఖండించిన విషయం తెలిసిందే.
అధినేత కెసిఆర్ ఏదీ చెప్తే ఓ కార్యకర్తగా దాన్ని పాటిస్తానని ఆయన అన్నారు. ఒకవేళ కెటిఆర్‌కు పార్టీ అధ్యక్షుడి పదవి ఇచ్చినా స్వాగతిస్తానని పేర్కొన్నారు. తనపై కుట్రలు చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు బయటపెడతానని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో కెటిఆర్ హరీశ్‌ల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.



## పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు కేంద్రం 'నో' 2లో

## రక్షణ ఉపగ్రహం రెడీ

- రేపు ఉదయం 5.59 గం.కు షార్ నుంచి పిఎస్ఎల్‌వి-సి61 ద్వారా నింగిలోకి
- శత్రు రహస్యాలు ఛేదించేందుకే ప్రయోగం
- తిరుమలేశుని దర్శించిన చైర్మన్ నారాయణన్



శ్రీహరికోటలో ప్రయోగానికి సిద్ధంగా పిఎస్ఎల్‌వి-సి61

**శ్రీహరికోట (తడ), మే 16 ప్రభాతవార్త:** పహల్గామ్‌లో ముష్కరుల దాడి తర్వాత పొరుగు దేశంతో యుద్ధం చేసి తమదే పైచేయి అనిపించుకున్న భారత్ దుర్భేద్యమైన తన రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోనుంది. బ్రహ్మోస్, భార్గవాస్త్ర లాంటి సుదర్శన చక్రాలు అందుబాటులోఉన్న మన వీర సైనికుల అమ్ముల పొదిలో మరో దివ్యాస్త్రం చేరనుంది. ఇఓఎస్09 పేరుతో సరిహద్దుల రక్షణ ప్రధానలక్ష్యంగా ఈఉపగ్రహాన్ని రూపొందించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఆదివారం ఉదయం 5.59 గంటలకు పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగికి చేర్చనున్నారు. మన తెలుగు నేల శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ కీలక ప్రయోగం జరగనుంది. 1696.24 కిలోల బరువు ఉన్న ఇఓఎస్ 09ను అంతరిక్షంలోని 534 కిలోమీటర్ల దూరంలో ప్రవేశపెట్టేందుకు ఇస్రో ప్రణాళికలు రచించింది. 18 నిమిషాల్లోపే ఇఓఎస్09 నిర్ణీత కక్ష్యకు చేరనుంది. ఆ తర్వాత రాకెట్‌లోని నాలుగవ దశ మరో కక్ష్య వైపు పయనించి క్రమేణా కిందికి దిగుతూ భూమికి 351 కిలోమీటర్ల >>2

## రేపు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష

### ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2

### రాష్ట్రంలో 13 పరీక్షా కేంద్రాలు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటిల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష రేపు(ఆదివారం) జరగనుంది. పరీక్షను ఐఐటి కాన్పూర్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జెఇఇ అడ్వాన్స్‌డ్-2025కి దేశ వ్యాప్తంగా జెఇఇ మెయిన్ రాసిన వారిలో 2.50 లక్షల మందికి అర్హత కల్పించారు. పరీక్ష నిర్వహణకుసంబంధించిన ఏర్పాట్లను >>2



## కాళేశ్వరంపై ప్రజా ప్రతినిధుల విచారణ లేదా?

- అధికారుల వాంగ్మూలంతోనే నివేదిక సిద్ధం!
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు ఇంజినీర్లు, అధికారులను విచారణ జరిపిన జస్టిస్ ఘోష్
- ఈ నెలాఖరుతో ముగుస్తున్న కమిషన్ గడువు

**హైదరాబాద్,మే16,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ వైఫల్యంపై విచారణ జరుపుతోన్న జస్టిస్ పినాకిని చంద్రఘోష్ నిర్మాణంలో కీలక పాత్రపోషించిన గత పాలకులను విచారణకు పిలవకుండానే అధికారుల వాగ్మూలంతోనే ప్రభుత్వాని పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలిసింది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణం, ఆపరేషన్ మెంటనెన్స్,క్వాలిటీకంట్రోల్ ఇంజనీర్లు, ఐఎఎస్‌లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించి అఫిడవిట్లు, వాగ్మూలం తీసుకొని విచారణ ప్రక్రియను పూర్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ లోక్‌సభ ఎన్నికల తరువాత నుంచి విచారణ చేస్తోంది. పిసి ఘోష్ కమిషన్ 2024 మార్చి14తేదిన నియమించారు.
జూన్ 30లోగా నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. ఎన్నికల జరుగుతుండటంతో విచారణ ఆలస్యంగానే మొదలు పెట్టాల్సి వచ్చింది. దీనితో ఆగస్టు 31వరకు పొడించారు. ఇతర రాష్ట్రాల ఎన్నికలకు కూడా మన రాష్ట్రానికి సంబంధించిన అధికారులు ఎన్నికల పరిశీలకులుగా వెళ్లడం, అసెంబ్లీ సమావేశాలు వంటివి అడ్డుపడడంతో దశలవారిగా కాలపరిమితి పొడిగించారు. మే 31తో పిసిఘోష్ కమిషన్ గడువు ముగిసి పోతుండటంతో ఈ దఫా ఎలాగైనా పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నీటిపారుదల మంత్రులుగా >>2


శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఐజి ఆసుపత్రిని సందర్శించి పిల్లలను పరామర్శిస్తున్న ప్రపంచ సుందరీమణులు

# ‘పిల్లలమర్రి’చెంత వరల్డ్ ‘మిస్’లు

>> ర్శించి ఫోటోలు దిగారు. పురావస్తు ప్రదర్శనశాలను సందర్శించారు. అక్కడ చారిత్రాత్మక శిల్పాలు, ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సేకరించిన పురాతన కళాఖండాలు, వాటి విశిష్టతలు తెలుసుకున్నారు. మ్యూజియం వద్ద రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, ఎస్.పిలతో ఫోటోలు దిగారు. అనంతరం పిల్లలమర్రి మహా వృక్షం సందర్శించారు. దాదాపు మూడున్నర ఎకరాల్లో విస్తరించి ఎన్నో మానులు కానీ మొదటి మాను ఎక్కడో ఇప్పటికీ తెలుసుకోలేక పోయిన 700 సంవత్సరాల వయస్సు కలిగిన మహా మర్రివృక్ష ప్రకృతి అందాలను చూసి సుందరీమణులు తన్మయంతో మైమరచిపోయారు. అడుగడుగున తెలంగాణ సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు బోనాలు, లంబాడ నృత్యం, రంగు రంగుల రంగవల్లి, భారతీయ సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించిన సుందరీమణులు తన్మయంతో పులకించిపోయారు. తెలంగాణ బతుకమ్మ పాటలకు అందాల బొమ్మలు ఆడి పాడి ఆనందించారు. పిల్లల మర్రి చెట్టు చరిత్రను జిల్లా అటవీ శాఖ అధికారి సుందరీమణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ సుందరీమణుల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుండి విచ్చేసిన పోటీదారులకు స్వాగతం పలికారు. శతాబ్దాలుగా, లెక్కలేనన్ని మంది సాధువులు, ఆధ్యాత్మిక నాయకులు ఈ వృక్షశాస్త్ర అద్భుతాన్ని సందర్శించారు. మీరందరూ మీమీ దేశాలను గెలుపొందాలనే ఆశలు, కలలను నిజం చేస్తూ, మీ సంబంధిత దేశాలను గర్వపడేలా చేసే ఆదర్శనీయమైన లక్ష్యంతో తెలంగాణలో ఉన్నారు. మీ రాక మమ్మల్ని చాలా సంతోషపరిచింది ఈ పట్టణ ప్రాంతానికి ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున విచ్చేసిన సుందరీమణులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల మర్రి అనేది కేవలం పాలమూరు జిల్లాకు మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్రం, భారత దేశానికి గర్వకారణమని అన్నారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆసియా ఖండం సుందరీమణులు పాలమూరు జిల్లాలోని పిల్లల మర్రి విశిష్టతలను వీక్షించేందుకు విచ్చేసినందుకు గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రపంచ సుందరీమణులు ఎన్నో తీపి జ్ఞాపకాలతో తిరిగి వెళతారని పేర్కొన్నారు. పిల్లల మర్రి మహావృక్షం 700 సంవత్సరాల క్రితం జన్మించిందని, మరో 700 సంవత్సరాలు జీవించి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, గద్వాల శాసన సభ్యులు కృష్ణ మోహన్ రెడ్డి, నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా ఎస్పీ డి. జానకి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ శివేంద్ర ప్రతాప్, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గింజదాకా కొంటాం

>> వీటి ద్వారా 16 లక్షల 67 వేల 936 మంది ప్రజలకు అదనంగా రేషన్ అందుతుందని మంత్రి తెలిపారు. మీసేవ కేంద్రాలు, ప్రజా పాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల విచారణ పూర్తి చేసి అర్హులకు రేషన్ కార్డులను జారీ చేయాలని మంత్రి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ప్రభుత్వా నిబంధనల ప్రకారం కలెక్టర్లు ప్రణాళిక బద్ధంగా యాసంగి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సిఎస్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్‌గా కలెక్టర్లు తనిఖీ చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కెఆర్‌కెరావు అన్నారు.. ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఆర్.టి.ఓ, పోలీస్ అధికారులు సమన్వయంతో ఖాళీగా ఉన్న లారీలను పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుకు కేటాయించాలని అన్నారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 328 కొనుగోలు కేంద్రాల ద్వారా 2 లక్షల 39వేల 996 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే కొనుగోలు చేశామని తెలిపారు. 29,630 మంది రైతులకు రూ.445.23 కోట్లు జమ చేశామని వివరించారు. 80 శాతం మంది రైతులకు చెల్లింపులు పూర్తయ్యాయని అన్నారు. 70 కొనుగోలు కేంద్రాల్లో 100 కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. రోజుకు సుమారుగా 8300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటున్నామని తెలిపారు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పౌర సరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహాన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల 70 వేల 477 మంది రైతుల నుంచి 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 వేల 42 కోట్లు మద్దతు ధర కింద చెల్లించామని అన్నారు.


రైస్ మిల్లుల వద్ద ధాన్యంబస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాళ్లు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యం నింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. గత ఆరు నెలల కాలంలో రేషన్ తీసుకోకపోవడం, ఇతర రాష్ట్రాలకు చెందిన డూప్లికేట్ బెనిఫిషరీ, చనిపోయిన వారి పేర్లు ఉండటం వంటి వివిధ కారణాల వల్ల భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 96 వేల 240 రేషన్‌కార్డుల పరిధిలోని లక్షా 62 వేల 777 మంది లబ్ధిదారులు అనుమానాస్పదంగా ఉన్నారని, జిల్లాల వారీగా సంబంధిత జాబితా అందించామని, వీటిపై విచారణ చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్‌లకు సూచించారు.

# విచారణ లేదా?

>> బాధ్యత వహించిన కెసిఆర్, హరీష్‌రావు, ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్, హరీష్‌రావులను కూడా విచారణచేస్తేనే ఈ నివేదికకు చట్టబద్ధత వస్తుందని అంతా భావించారు. పిసిఘోష్ కూడా విచారణకు పిలుస్తారని ప్రచారం కూడా జరిగింది కానీ అందరు వూహించిన దానికి భిన్నంగా ఆయన కాళేశ్వరం ప్రయోగంకు కీలకమైన వ్యక్తిగా అందరి చూపుడు వేలు ఒకే వైపు చూపిస్తున్న కీలకమైన వ్యక్తులను పిలవకుండానే విచారణ ముగించే ప్రక్రియలో ఉన్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ విదేశాలకు వెళుతున్నారని ప్రచారం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయనను ఆయన పరివారంను విచారణకు పిలవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్టు సమాచారం.బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై కమిషన్ విచారణ జరిపింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను విచారించింది. వారి నుంచి అపిడ విట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఎ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. అన్ని అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొంది. బ్యారేజీల నిర్మాణంలో భాగస్వాములైన ఇఎన్సీలు, చీఫ్ ఇంజినీర్లు, అధికారులను కమిషన్ విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తూనే కీలక సాక్ష్యాధారాలను సైతం సేకరించింది. ఈ దఫా మిగిలి ఉన్న అధికారులు, ఇతరులతోపాటు గత ప్రభుత్వ పెద్దలు, కీలక వ్యక్తులను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు నివేదిక సిద్ధం చేస్తూనే మరోవైపు మిగిలిన విచారణ అంశాలను కూడా చేపట్టే అవకాశం ఉందని అంటున్నారు. బ్యారేజీలవిషయంలో ఇప్పటికే ఎన్డీఎస్ఎ రిపోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. అందులో గత ప్రభుత్వ పాలకుల వైఫల్యాలను ప్రధానంగా ఎత్తిచూపింది. ఇప్పుడు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఎలా ఉండబోతున్నది అనేది ఉత్కంఠగా మారింది. రాష్ట్ర ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికను జస్టిస్ పిసిఘోష్ ఇప్పటికే ఎన్‌డిఎస్ఎ, విజిలెన్స్ రిపోర్టుల ఆధారంగా తన పరిశీలనలో తెలిసిన విషయాలను క్రోడికరించి సిద్ధం చేస్తున్నాని తెలిసింది. నివేదికకు తుది మెరుగులుదిద్ది మే నెలలోనే రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించనుందని ప్రచారంజరుగుతోంది.

# రక్షణ ఉపగ్రహాం రెడీ

>> దూరంలో చేరి తన పరిశోధనలు ప్రారంభించనుంది. ఇందుకు మొత్తం 101 నిమిషాల సమయం పడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అయితే ఇఓఎస్09 ఉపగ్రహ ప్రయోగమే ఇందులో కీలకం. శ్రీహరికోట నుంచి ఇది 101వ రాకెట్ ప్రయోగం. భారత్‌కు ఎంతో పేరు తెచ్చిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస ఎల్‌వి) సిరీస్‌లో ఇది 63వ ప్రయోగం. నాలుగు దశలతో నిర్మాణం జరిగిన పిఎస్ఎల్‌విలో మొదటి దశను నాలుగు స్ట్రాపాన్లు అంటిపెట్టుకుని ఉంటాయి. ఈ తరహా రాకెట్లను పిఎస్ఎల్‌వి ఎక్స్ఎల్ అంటారు. ఈ విధంగా రాకెట్‌ను రూపొందించడం ఇది 27వసారి. ప్రయోగ సమయంలో 44.5 మీటర్ల ఎత్తు, 321 టన్నుల బరువుతో పిఎస్ఎల్‌వి-సి61ని రూపొందించారు. ఈ ప్రయోగానికి సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి శుక్రవారం ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ శ్రీహరి కోటలో శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నారాయణన్ మళ్లీ శ్రీహరికోటను చేరుకుని రాకెట్ ప్రయోగ సన్నాహాల్లో బిజీ అయ్యారు.


శాస్త్రవేత్తలు రూపొందించిన ఇఓఎస్09 ఉపగ్రహం

**అన్ని వేళల్లోను పనిచేసే అద్భుతం**

ఇఓఎస్09 ఉపగ్రహం అన్ని వేళల్లోను అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ అద్భుతంగా పనిచేస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పేర్కొన్నారు. ఈ ప్రయోగ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ కూడా ఉన్నారు. ఈ ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ దేశానికి ఎన్నో సేవలందిస్తుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు అంతరిక్షం నుంచి సేవలు అందించే ఈ ఉపగ్రహంలోని అత్యాధునిక సి బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్ఎఆర్) అమర్చి ఉన్నారు. ఇది భారీ వర్షం, పొగమంచు, ఆకాశంలో మేఘాలు ఉన్నప్పటికీ పనిచేస్తుంది.

క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, రాత్రి పగలు కూడా భూ ఉపరితలానికి సంబంధించిన రిజల్యూషన్ ఫోటోలను తీసి భూకేంద్రాలకు సమాచారం అందించే సామర్థ్యం కలిగి ఉంది. ఇంతకుముందు ఉపయోగించిన కొన్ని కెమెరాలకు భిన్నంగా ఇందులో మరింత శక్తివంతమైన కెమెరాలు అమర్చారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత జరుగుతున్న ఈ ఉపగ్రహ ప్రయోగం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది పాకిస్తాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని భారతదేశ సున్నిత ప్రదేశాలను పర్యవేక్షించడం, మన దేశంలోని విస్తారమైన తీరప్రాంతాన్ని కాపాడటంలో రక్షణ రంగానికి సేవలు అందిస్తుందని చెప్తున్నారు. రీశాట్ సిరీస్‌లో ఇఓఎస్9కు ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో రీశాట్ 1ఏ పేరుతో ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించి ఉన్నారు. ఇప్పుడు ఇఓఎస్ 09ను రీశాట్ 1బిగా కూడా పేర్కొంటున్నారు. రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహాలు నిర్మించడం ఇస్రోకు కొత్త కాదు గాని ఇటువంటి కీలక పరిస్థితుల్లో అతి త్వరగా ఒక ఉపగ్రహ ప్రయోగం చేపట్టడం విశేషం. కేవలం దేశ సరిహద్దుల పరిరక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భ శాస్త్రం, ప్రకృతి వైపరీత్యాలు వంటివాటిని కూడా ముందుగా పసిగట్టడం ఈ రీశాట్ ఉపగ్రహ శక్తి ఉంది. ఇదిలా వుంటే కీలక రాకెట్ ప్రయోగం కావడంతో శ్రీహరి కోటలో మరింత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం ఒక్క మెయిన్ గేటు ద్వారా మాత్రమే అంతరిక్ష కేంద్రానికి ఉద్యోగులను, అధికారులను అనుమతిస్తున్నారు. స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని గేటు, సందర్శకుల గ్యాలరీకి వెళ్లేగేటు వంటివి మూసేశారు. సిఐఎస్ఎఫ్‌దళాలు, స్థానిక పోలీసులు, తీరప్రాంత రక్షణ దళాలు వంటివి 24 గంటల పాటు నిఘా ఉంచాయి. షార్ అడవుల్లో కూంబింగ్ పూర్తి చేశారు.

## ఎఐజి ఆసుపత్రిలోని చిన్నారులతో ప్రపంచ బ్యూటీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే16:** మిస్ వరల్డ్ పోటీదారులు తెలంగాణలోని వివిధ ప్రముఖ, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఎఐజీ) ఆసుపత్రిని మిస్ వరల్డ్ సుందరీమణులు సందర్శించారు. మెడికల్ టూరిజంలో భాగంగా గ్రూప్-1 మిస్‌వరల్డ్ కాంటెస్టెంట్లు ఈఆసుపత్రిని సందర్శించేందుకు ప్రభుత్వంఏర్పాటు చేసింది. ఎఐజి ఆసుపత్రుల ఛైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి వారికి ఆసుపత్రి ప్రత్యేకతలను వివరించారు. తమ వద్ద జరుగుతున్న చికిత్స విధానాలను, పరిశోధనల తీరును వివరించారు. ఆరోగ్య రంగంలో సాధించినపురోగతిని, బ్రెస్ట్ వెల్‌నెస్, గట్ (జీర్ణ వ్యవస్థ), వంటి అంశాలను ప్రచారం చేయాలని అందగత్తెలకు ఆయన సూచించారు. వైద్య రంగంలో వస్తున్న అధునాత మార్పులు, మహిళల్లో వస్తున్న వ్యాధులను ఆయన వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహారం, ఆరోగ్యంపై దృష్టిపెడితే సమాజం ఎంతోఉన్నతంగా ఉంటుందన్నారు. ఆసుపత్రిని సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు కూడా తమ అభిప్రాయాలను నాగేశ్వరరెడ్డితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఐసియూలోని చిన్నారులను మోడల్స్ పరామర్శించారు.మిస్ వరల్డ్ పోటీదారుల సందర్శన ఆసుపత్రిలోని రోగులకు, సిబ్బందికి కొంత ఉత్సాహాన్ని, మానసిక సాంత్వనను కలిగించింది.సాగింది.

## అడ్వాన్స్‌డ్ పరీక్ష

>> దేశంలోని అన్నిరాష్ట్రాల్లోనూపూర్తి చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష జరగనుంది. జెఇఇ అడ్వాన్స్‌డ్‌కి తెలంగాణ రాష్ట్రంలోని 13 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి సుమారు 40వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరు.ఉదయం 7గంటలనుంచి 8.30 గంటల వరకు పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారు. పరీక్షకి హాజరయ్యే విద్యార్థులు అనలాగ్ వాచీలు ధరించడం, హ్యాండ్‌బ్యాగులు, పర్సులు కేంద్రాల్లోకి తీసుకెళ్లడం నిషేధించారు. అభ్యర్థులు చెప్పులనుమాత్రమే ధరించాలి. చార్మ్/టాబిజ్, ఉంగరాలు, బ్రాస్‌లెట్‌లు, చెవిపోగులు, ముక్కు పిన్, చైన్/నెక్లెస్, పెండెంట్, బ్యాడ్జ్, బ్రూచ్, హెయిర్‌పిన్, హెయిర్ బ్యాండ్, పెద్ద బటన్లు ఉన్నదుస్తులు ధరించవద్దని సూచించారు. విద్యార్థులు అడ్మిట్ కార్డ్, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు (ఆధార్, స్కూల్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడి, పాస్‌పోర్ట్ లేదా పాన్ కార్డ్), పెన్, పెన్సిల్, ఎరేజర్‌తోపాటు పారదర్శక వాటర్ బాటిల్‌ను తీసుకెళ్లడానికి అనుమతి ఉంది.

## వారం - వర్జ్యం

తేది : 17-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
పంచమి పూర్తి
పూర్వాషాడ సా.5.40
వర్జ్యం రా.2.03-3.44
దు.ఆ.5.37-7.17
శుభసమయం :ఉ.7.30-8.30, సా.6.00-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. పాత మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**వృషభం :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**మిథునం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు.

**సింహం:** భూ వివాదాలు తీరి లబ్ది పొందుతారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి.వీటిని సద్వినియోగం చేసుకుంటారు.

**కన్య :** అంచనాలు తప్పుతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ధనవ్యయం.

**తుల :** దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త, కొంత ఊరట చెందుతారు. శ్రమాధికం, దైవదర్శనాలు.

**వృశ్చికం:** భూవివాదాలలో తొందరపాటు వద్దు. కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**ధనుస్సు:** పనులలో తొందరపాటు వద్దు. జీవితభాగస్వామి నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**మకరం:** నూతన ఉద్యోగయోగం పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**కుంభం:** దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. గృహ యోగం. పనులలో విజయం సాధిస్తారు.

**మీనం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


భారత్ సైనికులకు సంఘీభావసూచకంగా జమ్ములోని స్కూలు విద్యార్థులు శుక్రవారం జరిపిన ప్రదర్శన దృశ్యం

# పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు కేంద్రం ‘నో’

**న్యూఢిల్లీ, మే 16:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడి.. ఆ దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ సర్జికల్ స్ట్రైక్స్ ఫలితంగా రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు.. తదితర అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేస్తున్నాయి. అయితే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు కేంద్రం తన విముఖతను వ్యక్తంచేస్తోంది. దాంతో ఈ ఏడాది జూలైలో జరిగే వర్షాకాల సమావేశాల్లోనే ఇప్పటి పరిస్థితులపై ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పనుందనే విషయం స్పష్టమవుతోంది. కాగా ఐక్యత, సంఘీభావం అవసరమైన ఈ తరుణంలో వీలైనంత త్వరగా ఉభయసభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడం ముఖ్యమని విపక్షం భావిస్తోందని పేర్కొంటూ ఇటీవల రాహుల్‌గాంధీ కేంద్రానికి లేఖ రాశారు. పలువురు విపక్ష ఎంపీలు సైతం ఇదే డిమాండ్ వినిపించారు. విపక్షాల డిమాండ్‌లను అధికారపక్షం తోసిపుచ్చింది. ఆపరేషన్ సింధూర్ ఇంకా ముగియలేదని, తాత్కాలికంగానే నిలిచిందని, ఈ సమయంలో అనవసర చర్చలకు తావివ్వొద్దనిపేర్కొంది. ఆపరేషన్ సింధూర్ ముగిసినతర్వాత పార్లమెంట్ ప్రత్యేకసమావేశం డిమాండ్‌ను లేవనెత్తాలని సూచించింది. ఈ క్రమంలో కేంద్రం పార్లమెంట్ స్పెషల్ సెషన్ నిర్వహణకు నో చెప్పింది.

# హైదరాబాద్‌లో డేటాసిటీ

>> మూడేండ్లలో విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మూడేండ్ల విద్యుత్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8శాతం పెరిగింది.గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఈ సంవత్సరం విద్యుత్ డిమాండ్ పెరిగింది.ఇది ఒక గొప్ప విజయం. అయినప్పటికీ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందని అన్నారు.ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంది. 2025-26 లో 18,138 మెగావాట్లు, 2034.35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని భవిష్యత్తు అవసరాలు, అంచనాలను అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. పెరుగుతున్న విద్యుత్తు అంచనాలకు సరిపడేలా విద్యుత్తు ఉత్పత్తిని పెంచుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రధానంగా క్లీన్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజ్ పైన దృష్టి సారించాలని అన్నారు. ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కొత్తగా అమల్లోకి తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీపైన దృష్టి సారించాలని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలో ప్రఖ్యాతిగాంచిన ప్రపంచ దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలని అన్నారు. సిఎం వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సిఎంవో ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, టిజి రెడ్కో ఎండి అనిల పాల్గొన్నారు.

# నేడే తిరంగా యాత్ర

>> సైనికులు తమ శక్తి, సామర్థ్యాలతో కొత్త చరిత్రను సృష్టించారు. సమగ్రమైన భారతదేశ విధానంలో, ప్రధాని మోడీ నాయకత్వంలో భారత సైనికులు తమ శక్తి, సామర్థ్యాలతో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. గతంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ల కోసం ఎదురైన ఇబ్బందుల నుంచి బయటపడి, భారత సైన్యానికి రఫేల్ ఫైటర్ జెట్లు, బ్రహ్మోస్ క్షిపణులు సమకూర్చారమన్నారు. రఫేల్ ఎయిర్ ఫైటర్, ఎస్400 మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలు సమయంలో కొందరు వ్యతిరేకంగా ఆరోపణలు చేశారు, కానీ ఇప్పుడు వాటి ప్రాధాన్యత, ఫలితాలను ప్రపంచం చూసిందన్నారు. భారత సైన్యానికి కావలసిన ఆయుధాలు, ఇతర మౌలిక సదుపాయాల దాదాపు 35 శాతం స్థాయిలో స్థానికంగానే తయారీ అవుతుందని, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం కూడా పెరిగింది. రక్షణ రంగ పరిశోధనలకు కావాల్సిన వసతుల కల్పన జరగుతుందన్నారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని స్పేస్ రంగంలో అగ్రభాగానికి తీసుకెళ్లేలా కృషి చేస్తున్నామని, పాకిస్థాన్ అంటే ఉగ్రవాద ఫ్యాక్టరీ. ఉగ్రవాదాన్ని తయారుచేసే డెమొక్రసీ ఫ్యాక్టరీగా ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేయడం జరిగింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైనికులు చూపించిన అద్భుత వ్యూహాన్ని ప్రపంచం అభినందిస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సైనికులను అభినందించడంతోపాటు, వారిలో మానసిక ధైర్యాన్ని పెంచి అండగా నిలబడేందుకు దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో తిరంగా యాత్రలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

## శ్రీరామభద్రాచార్యకు జ్ఞానపీఠ్ ప్రదానం

**న్యూఢిల్లీ, మే 16:** భారతీయ సాహిత్యానికి చేసిన విశేష కృషికిగాను 58వ జ్ఞానపీఠ్ అవార్డును ప్రఖ్యాత సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్యకు ప్రధానంచేసారు. విజ్ఞాన్‌భవన్‌లోశుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాన్ని జగద్గురుకు అందించారు. భారత సాహిత్యానికి ఆయన చేసిన విశేషకృషి శ్లాఘనీయమని రాష్ట్రపతి ముర్ము అభినందించారు. ఆరోగ్యకారణాలతో ఈ కార్యక్రమానికి రాలేకపోయిన ప్రముఖ కవి గేయరచయిత గుల్జార్‌ను కూడా రాష్ట్రపతి అభినందించారు. సాహిత్య కళలు, సమాజానికి వీరుచేసిన కృషిఇలాగే మరింతగా కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. సామాజిక మేలుకొలుపు, స్వాతంత్ర్య ఉద్యమంలో రచయితలు, కవుల పాత్రనుప్రస్తావిస్తూ వారి రచనలు దేశ ప్రజలను ప్రేరేపించడంలో కీలకపాత్రపోషించాయని అన్నారు. బకించంద్రఛటోపాధ్యాయ, వందేమాతరం, వాల్మీకి,వ్యాసుడు, కాళిదాస్ రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్య వారసత్వం వంటి వాటిని ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రస్తావించారు. 1965నుంచి భారతీయ భాషల్లో సాహిత్య నైపుణ్యాన్ని గుర్తించడంలో దాని ప్రయత్నాలను రాష్ట్రపతి ప్రశంసించారు. దశాబ్దాలుగా అర్హులైన అత్యుత్తమ సాహితీవేత్తలను సత్కరించడంద్వారా ఈ సంస్థ అవార్డు ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసిందన్నారు.

## ఇప్పటివరకూ చూసింది ట్రైలర్ మాత్రమే!: రాజ్‌నాథ్ సింగ్

**భుజ్, మే 16:** ఉగ్రవాదులకు పాకిస్థాన్ నిధులు అందిస్తుండడంపై భారత్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విరుచుకుపడ్డారు. హాఫీజ్ సయీద్ కు పరిహారం రూపంలో పాకిస్థాన్ రూ.14 కోట్ల మొత్తం అప్పగిస్తోందని ఆయన మండిపడ్డారు. పాక్ తన గడ్డపై ఉగ్రవాద సంస్థలకు నిధులివ్వడానికి చరమగీతం పాడాలంటే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఆ దేశానికి ఆర్థిక సాయం ఆపేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లోని భుజ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో వాయిసేన సిబ్బందిని ఉద్దేశించి రాజ్‌నాథ్ శుక్రవారం నాడు మాట్లాడారు. గ్లోబల్ సాయాన్ని పాక్ దుర్వినియోగం చేస్తూ క్రాస్ బోర్డర్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్రమంత్రి ఆరోపించారు. మ్మూకశ్మీర్‌లో గురువారం నాడు పర్యటన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ భుజ్ చేరుకున్నారు. ఎల్ఓసీ, అంతర్జాతీయ సరిహద్దుల్లో భద్రతను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు.

# ఫలించని శాంతి చర్చలు

>>నికి ఒక మార్గం సుగమమంచేయడంపై తాము దృష్టిపెట్టామని ఉక్రెయిన్ వర్గం పేర్కొంది కాల్పుల విరమణను పూరినతస్థాయిలో అమలుకావాలంటే తమ నియంత్రణలో ఉన్న భూభాగంనుంచి బలగాలను ఉపసంహరించాలని రష్యా కోరుతోందని తెలిపింది. అయితే ఇవన్నీ గతంలో చర్చకురాలేదని, అజెండాలో లేవని ఉక్రెయిన్ చెపుతోంది. రష్యా ఉక్రెయిన్‌మధ్య తొలిసారిగా ముఖాముఖి శాంతిచర్చలు ప్రారంభం అయ్యాయి. ఇస్తాంబుల్ వేదికగా జరిగే ఈ చర్చలు తుర్కియే మధ్యవర్తిత్వంతో జరుగుతు న్నాయి. ఉక్రెయిన్ తరపున రక్షణమంత్రి రుస్తెమ్ ఉమోరోవ్ నేతృత్వంలోని బృందం పాల్గొంటే రష్యానుంచి అధ్యక్షుడి ప్రతినిధి వ్లాదిమిర్ మెడిన్‌స్కీలు పాల్గొన్నారు. అయితే ఈచర్చలకు పుతిన్ దిగువస్థాయి అధికార బృందాన్ని పంపించి పెద్ద తప్పుచేసారని నాటోచీఫ్ మార్క్ రుట్టే విమర్శలుచేసారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ చర్చలకు హాజరుకాలేదు. దీనితోమూడేళ్లకుపైబడి జరుగుతున్న ఈ యుద్ధంలో తక్షణ పురోగతి పెద్దగా ఉండకపోవచ్చని అధికారులు అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఒక ప్రకటనచేస్తూ త్వరలోనే తాను పుతిన్‌తోనేరుగా భేటీ అయి యుద్ధవిరమణకు ఒప్పిస్తానని ప్రకటించడం సంచలనం కలిగించింది.

# మహానాడులో పాల్గొని విజయవంతం చేయాలి

### ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి తెలంగాణ నేతల సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 16:** క్రమశిక్షణతో ప్రతి ఒక్కరు మహానాడు వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని సమావేశం ద్వారా పార్టీ నాయకులను, శ్రేణులను టిడిపి తెలంగాణ రాష్ట్ర పార్టీ ముఖ్యనాయకులు కోరారు. శుక్రవారం ఎన్టీఆర్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మే 27, 28, 29 వ తేదీలలో కడపలోజరిగే మహానాడు వేడుకను విజయవంతంగా నిర్వహించుకోవడంపై చర్చించారు. ఆహ్వానితులు, తీర్మానాలు, వసతి సౌకర్యాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించి నాయకుల నుంచి సలహాలను, సూచనలు తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ తెలంగాణ నుండి 6 తీర్మానాలను కేంద్ర పార్టీ ఆమోదం కొరకు పంపాలని నిర్ణయించారు. పార్టీ పొలిట్‌బ్యూరో స్థాయి నుంచి గ్రామ పార్టీ కమిటీ వరకు మహానాడు కు ఆహ్వానితులుగా సమాచారం పంపాలని నిర్ణయించారు. వసతి ఏర్పాట్లపై కూడా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న పొలిట్‌బ్యూరో సభ్యులు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కు అభినందనలు తెలుపుతూ సమావేశం తీర్మానం చేసింది. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్‌గౌడ్, జాతీయపార్టీ ఉపాధ్యక్షులు చిలువేరు కాశీనాథ్, జాతీయపార్టీ క్రమశిక్షణ కమిటి సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, జాతీయపార్టీ అధికార ప్రతినిధి, టిటిడి బోర్డు మెంబర్ నన్నూరి నర్సిరెడ్డి, పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ కన్వీనర్లు పిన్నమనేని సాయిబాబా, కందికంటి అశోక్ కుమార్‌గౌడ్, ఇల్లెందు రమేష్, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, కట్టా వెంకటేష్‌గౌడ్, రాష్ట్ర పార్టీ నాయకులు బండి పుల్లయ్య, నందమూరి సుహాసిని, అజ్మీరా రాజునాయక్, నెల్లూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 25న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష

### హైదరాబాద్‌లో 95 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

### హాజరుకానున్న 43,676 మంది అభ్యర్థులు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత ఉద్యోగాల భర్తీ కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్-2025 పరీక్షను ఈ నెల 25న నిర్వహించనున్నారు. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్‌తోపాటు గ్రూప్-ఏ, బి పోస్టుల భర్తీ కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యుపిఎస్‌సి) సివిల్స్ పరీక్షను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఈ నెల 25న సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించనున్నారు. సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ కోసం హైదరాబాద్‌లో 95 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 43,676 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి పరీక్షను నిర్వహించడం కోసం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఇప్పటికే సమీక్షను నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల కోసం ఈ నెల 22న పరీక్ష కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించనున్నారు.

# గోల్కొండలో పసికందు దారుణహత్య

### కన్నతండ్రే నిందితుడు.. భార్య ఫిర్యాదుతో వెలుగులోకి

**హైదరాబాద్(మెహదీపట్నం), మే 16, ప్రభాతవార్త:** సభ్యసమాజం తలదించుకునే అత్యంత దారుణ సంఘటన గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కన్నతండ్రే 14 రోజుల పసికందును అత్యంత కిరాతకంగా హతమార్చి మృతదేహాన్ని చెత్తకుప్పలో పడేశాడు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన జగత్, గౌరీ దంపతులు గోల్కొండకు వలస వచ్చి క్రిస్టల్ అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉండగా 14 రోజుల క్రితం ఆడశిశువు పుట్టింది. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో జగత్ తన కుమార్తెను కత్తితో గొంతుకోసి హత మార్చాడు.తర్వాత పసికందు మృతదేహాన్ని టోలిచౌకిలోని చెత్తకుప్పలో పడేశాడు. ఈ దారుణాన్ని గమనించిన నిందితుడి భార్య గౌరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు జగత్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఘాతుకానికి గల కారణాలను నిందితుడు జగత్ వెల్లడించలేదు. పసికందు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

# ఉద్యోగం ఇచ్చిన యజమానికే నగ్న ఫొటోల బెదిరింపులు

### కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్

**హైదరాబాద్ (పంజగుట్ట), మే 16, ప్రభాతవార్త:** నమ్మి ఉద్యోగమిచ్చిన యజమాని కుటుంబంలోనే చిచ్చురేపి, యజమానినే బెదిరించిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్‌లో నివసించే ఓ వ్యాపారి దగ్గర చాలాకాలంగా ఇఫ్తికర్ అనే వ్యక్తి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎక్కువకాలం నుంచి పనిచేస్తుండడంతో వ్యాపారి భార్యతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆ సంబంధం అక్రమ సంబంధంగా మారింది. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. ఇఫ్తికర్ ఆమెతో గడిపిన సమయంలో ఆమెకు తెలియకుండా ఫొటోలను తీశాడు. ఆ తర్వాత ఆ ఫొటోలను తన యజమానికే పంపి తనకు కోటి రూపాయలు ఇవ్వకపోతే ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పెడతానని హెచ్చరించసాగాడు. దాంతో సదరు వ్యాపారి మొదట కుంగిపోయినా చివరకు పోలీసులకు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్, మే 16: భారత సైన్యం, జమ్ముకాశ్మీర్‌ప ఓలీసులతో కలిసి జరిపిన సంయుక్త ఆపరేషన్‌లలో కేవలం 48 గంటల్లోనే ఆరుగురు ఉగ్రవాదులను ఖతంచేసారు. మార్చి లో అమాయకుల ప్రాణాలుతీసిన ఒక టెర్రరిస్టు కూడా వీరిలో ఉన్నట్లు జిఓసి విఫోర్స్ మేజర్‌జనరల్ ధనుంజయజోషి, ఐజిపి కాశ్మీర్ వికె బిర్డిలు వెల్లడించారు. ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా ఏరివేస్తామన్నారు. మే 12వ తేదీ కెలర్‌పర్వత శిఖరాలవద్ద ఉగ్రబృందాలు దాక్కని ఉన్నట్లు మాకు సమాచారం వచ్చిందని, మర్నాడు ఉదయమే అక్కడ అనుమానాస్పద కదలికలను గుర్తించామన్నారు. దీనితోభద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయని వారు కాల్పులుజరపడంతో ఎన్‌కౌంటర్‌లో వారు మృతిచెందినట్లు తెలిపారు. ఇక ట్రాల్‌పరిసరాల్లోని సరిహద్దుగ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరిగింది. అక్కడమేం నిరంతర తనిఖీలుచేపట్టామని, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లల్లో నక్కి కాల్పులు ప్రారంభించారని, ప్రజల ప్రాణాలను రక్షించడం ఇక్కడ మాకు సవాలుగా మారిందని, కానీ ఎట్టకేలకు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టామన్నారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన ఆరుగురిలో ఒకడైన షహీద్‌కుట్టె రెండు పెద్ద దాడుల్లో నిందితుడన్నారు. జర్మనీ పర్యాటకులపైనా ఇతడు దాడిచేసాడన్నారు. ట్రాల్‌ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులు కూడా చాలా కఠినంగా ఉన్నాయని మేజర్‌జనరల్ ధనుంజయ జోషి అన్నారు. ఈ ఆపరేషన్లలో జమ్ముకాశ్మీర్‌సైన్యం, పోలీస్, సిఆర్‌పిఎఫ్ దళాలు కూడా పాల్గొన్నాయి.

# సాగునీటి వినియోగ వ్యత్యాసాలు మదింపు చేయండి

### ఒక టిఎంసి నీరు ఆంధ్రాలో 8,400 ఎకరాలు, తెలంగాణలో 12,800 ఎకరాలకు వినియోగం

### జూన్ 23 నుంచి 25కు కెడబ్ల్యుడిటి-2 విచారణ

**హైదరాబాద్,మే 16,ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వినియోగించే సాగునీటిని శాస్త్రీయంగా మదింపు చేసి కృష్ణానది పరివాహక ప్రాంతం ఆధారంగా నీటి కేటాయింపులు చేపట్టాలని కెడబ్ల్యుడిటి-2 ముందు తెలంగాణ తనవాదనను వినిపించింది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఒక టిఎంసి నీటిని తెలంగాణ ప్రాంతం రైతులు 12800 ఎకరాలకు వినియోగించుకునేలా నీటిని విడుదలచేసేవారని, ఆంధ్ర ప్రదేశ్‌పై రైతులకు 8400ఎకరాలకు ఒక టిఎంసి నీటిని కేటాయించేవారని తెలిపారు. ఇప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్ నీటిని దుర్వినియోగం కూడా పెరిగిందని దానిని తగ్గించాలని సూచించారు. శాస్త్రీయంగా టిఎంసి నీటిని వినియోగం రూపొందించాలని సూచించారు. జూరాల ప్రియదర్శిని ప్రాజెక్టుకు 17.84 టిఎంసిలకు మించి నీటిని కేటాయింపులు చేయాల్సి అవసరం ఉందని కోరారు. ఎస్ఎల్‌బిసి ఎస్ఆర్‌బిసి కి నీటి కేటాయింపులను పునఃమదింపు చేయాలని సూచించారుజ కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి పంపిణీపై జరుపుతున్న విచారణ జూన్ 23 నుంచి 25 వరకు వాయిదా వేసింది.మే26 నుంచి 13జూన్ వరకు సుప్రీం కోర్టుకు సెలవు ఉండటంతో సెలవుల తరువాత జూన్23 నుంచి 25తేదివరకు జరుగుతుంది. శుక్రవారం కెడబ్ల్యుడిటి చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్. సభ్యులు జస్టిస్‌లు రాం మోహన్ రెడ్డి, తాళపత్ర ఆధ్వర్యంలో విచారణ జరుగగా తెలంగాణ తరుపున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ గిరిధర్‌రావు రవీందర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సూర్యసతీష్ రజినికాంత్‌రెడ్డి, కుషివిందర్‌వోరా, నూకల సుమంత్, వినయ్‌గోయల్, కర్ణికా ఎస్ పాస్యత్‌నిఖిల్ స్వామి వాదించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఉమాపతి,గుంటూరు ప్రమోద్‌కుమార్ వాదించారు.

# పుణే యాపిల్ వ్యాపారికి పాక్ నుంచి బెదిరింపులు

### తుర్కియే యాపిల్స్ బహిష్కరించడమే కారణం

**పుణె, మే 16:** తుర్కియే యాపిల్ బహిష్కరించినందుకు సుయోగ్ జెండే అనే వ్యాపారికి పాకిస్థాన్ నుంచి బెదిరింపు కాల్ రావడం కలకలం రేపుతోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి యాపిల్లు పుణె మార్కెట్ యార్డుకు వస్తాయి. తుర్కియే నుంచి కూడా యాపిళ్లు పెద్ద మొత్తంలో వస్తాయి. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశానికి తుర్కియే, అజర్‌బైజాన్ మద్దతు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో తుర్కియే యాపిళ్లను బహిష్కరించాలని నిర్ణయించారు. ఇందులో ఆ మార్కెట్‌లో వ్యాపారం చేసే సుయోగ్ జెండే ప్రధాన పాత్ర పోషించాడు. దీంతో పాకిస్థాన్ నుంచి అతడికి 7 వాట్సాప్ కాల్స్, ఒక వాయిస్ రికార్డు వచ్చింది. అందులో భారతీయులు ఏం చేయలేరని సుయోగ్‌పై బెదిరింపులకు పాల్పడ్డారు దుండగులు. అయితే దీనిపై సుయోగ్ స్పందిస్తూ తాము ఛత్రపతి శివాజీ వారసులమని, తామేం చేస్తామో వారు చూస్తారని చెప్పాడు. ఈ ఘటనపై సీపీని కలిసి ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.




రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జ్యువెలర్స్ అసోసియేషన్ టర్కిష్ ఆభరణాలను విక్రయించకూడదని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ సోని తెలిపారు. తుర్కియే ఆభరణాలను విక్రయించకూడదని మొత్తం అసోసియేషన్ ఏకగ్రీవంగా నిర్ణయించిందని అన్నారు. కాగా, భారత్‌తుర్కియే మధ్య ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. 2024లో తుర్కియే నుంచి భారత్ 274.91 మిలియన్ డాలర్ల విలువైన ముత్యాలు, విలువైన రాళ్లు, ఆభరణాలు దిగుమతి చేసుకుంది. ఇప్పుడు ఇది తగ్గే అవకాశం ఉందని అంచనా. జోధ్‌పూర్‌లో విక్రయించే ఆభరణాలలో 510శాతం తుర్కియే ఆభరణాలేనని నవీన్ సోని చెప్పారు. కాగా, ఇండియన్ ఇంటర్నేషనల్ జ్యువెలరీ షో ద్వారా తుర్కియే ఆభరణాలు భారతదేశానికి వస్తాయి. ఈ ప్రదర్శనలో టర్కిష్ వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేస్తారు. స్థానిక వ్యాపారులు వారితో ఒప్పందాలు చేసుకున్న తర్వాత ఆభరణాలు మార్కెట్‌లోకి వస్తాయి. జులై 30 నుంచి ఈ షో ప్రారంభం కానుంది. అయితే ఇప్పుడు ఈ షోలో తుర్కియేకు స్టాల్స్ కేటాయించవద్దని షో నిర్వాహకులకు లేఖ రాస్తామని సోని చెప్పారు.

# 23 నుంచి ఇఒ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలోని ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఈవో) పోస్టులకి ఎంపికైన వారికి ఈ నెల 23 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేష న్‌ను నిర్వహించనున్నారు. 23 నుంచి 28 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) షెడ్యూల్‌ను ప్రకటించ్చింది. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (సూపర్‌వైజర్) (గ్రేడ్-1 పదవికి ఎంపికైన వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలోని ఈవో పోస్టుల భర్తీ కోసం టిజిపిఎస్‌సి ఆగస్టు 27, 2022 నోటిఫికేషన్ నెం.11/2022ను జారీచేసిన విషయం తెలిసిందే. ఇఒ పోస్టులకు ఎంపికైన వారికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 23 నుంచి 28 వరకు ఉదయం 10.30 గంటల నుండి సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం) పబ్లిక్ గార్డెన్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్ (పాతక్యాంపస్)లో జరగనుందని టిజిపిఎస్‌సి ప్రకటిం చింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థుల జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని ప్రకటించింది. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న వెరిఫికేషన్ మెటీరియల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చేటపుడు అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని అవసరమైన పత్రాలను తప్పకుండా తీసుకురావాలని కమిషన్ సూచిం చింది. అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 28 వరకు టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలని పేర్కొంది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ రోజున ఏ అభ్యర్థి అయినా సర్టిఫికెట్స్ వెరిఫి కేషన్‌కి హాజరుకాకపోతే అదనపు సమయం ఇవ్వబడదని కమిషన్ స్పష్టం చేసింది.

# బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి జ్యోతిషం చెప్పుకోవాలి

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** బిజెపి శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డి రాజకీయాలు వదిలేసి జ్యోతిషం చెప్పుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ రెండు నెలలకోసారి మహేశ్వర్ రెడ్డి ఊకదంపుడు సోది, ఊహకు అందని స్టోరీ లు అల్లుతున్నాడని ఆరోపించారు. మహేశ్వర్ రెడ్డి కి ఆయన కూర్చున్న నాంపల్లి బిజెపి ఆఫీస్‌లో ఏం జరుగుతుందో తెలియదని అన్నారు .సహచర ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ లో కొనసాగుతాడా లేదో మహేశ్వర్ రెడ్డి కి తన చిలుక జ్యోతిష్యం చూసి చెప్పాలి అని కోరారు. మహేశ్వర్ రెడ్డి కి జ్యోతిష్యం మీద అంత పట్టు ఉంటే తెలంగాణ బిజెపి అధ్యక్ష పదవి ఎవరికి వస్తుందో చెప్పాలని అడ్లూరి సవాల్ విసిరారు.పార్టీ అధ్యక్ష పదవి కోసం తెలంగాణ బిజెపిలో అరడజను మంది నాయకులు కత్తులు దూసుకుంటున్నారని అన్నారు. ఒకరి వెనుక మరొకరు గోతులు తీసుకుంటున్నారని ఎకసెక్కాలు చేశారు. అధిష్టానం దగ్గర ఒకరి మీద మరొకరు ఫిర్యాదు లు చేసుకుంటున్నారు. మహేశ్వర్ రెడ్డి మాత్రం అమాయకంగా హైదరాబాద్ లో కూర్చుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీటు గురించి మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ విషయాలపై ఆయన శ్రద్ధతగ్గించి బీజేపీలో ఏం జరుగుతుందో తెలుసుకుంటే ఆ పార్టీ లో ఆయన భవిష్యత్తు బాగుంటుంది. మహేశ్వర్ రెడ్డి మాటల్లో సీఎం రేవంత్ రెడ్డి పై అక్కసు తప్ప ఏమీ కనిపించడం లేదుని ఆవేదన వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి పైన ఈర్ష,ద్వేషం తో ఆయన తప్పుడు ప్రచారం చేస్తున్నాడని అడ్లూరి ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి కట్టు తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తీరు మహేశ్వర్ రెడ్డి కి కనిపించడం లేదా..? ఏదో విధంగా మీడియాలో ఉండాలని నోటికొచ్చిన కథలు చెబుతున్నాడు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు ఇస్తే మహేశ్వర్ రెడ్డి గౌరవం పెరుగుతుంది లేకుంటే ఆయన భారతీయ జనతా పార్టీ ఆస్థాన జ్యోతిష్యుడి గా మిగిలి పోవాల్సి వస్తుందని అన్నారు.



# కేంద్ర ప్రాయోజితాలతో అధిక నిధులు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను అమలు చేయడం ద్వారా ఎక్కువ నిధులను రాబట్టాలని తెలంగాణ సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాష్ట్రానికి అందేలా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటి వరకూ కేంద్ర ప్రాయోజిత పథకాను రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వాటికి రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులు జత చేయకపోవడంతో పలు సందర్భాల్లో కేంద్ర నిధులు మంజూరు కావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుండి అటువంటి నిర్లక్ష్యం జరగకుండా సకాలంలో కేంద్ర నిధులకు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్లు కలిపి ప్రాయోజిత పథకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోనుంది. ఇందుకు కేంద్రం సింగిల్ నోడలన ఏజెన్సీ ద్వారా సిస్టమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్స్ఫర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ఈ కుబేర్ వ్యవస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఆయా ప్రాయోజిత పథకలను అమలు చేసే కేంద్ర శాఖలతో పాటు, రాష్ట్ర శాఖలు ప్రత్యేక ఖతాలను తెరచి వాటి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తాయి. ఈ విధానం అమలు కోసం రాష్ట్రంలో ఖజానా శాఖలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

# భారత్ మొట్టమొదటి గ్రామంలో ఘనంగా ‘పుష్కరకుంభ్’

**డెహ్రాడూన్, మే 16:** ఉత్తరాఖండ్‌లో పన్నెండేళ్ల తర్వాత పుష్కర్ కుంభ్ ప్రారంభమైంది. భారత్ మొట్టమొదటి గ్రామం మాణాలోని కేశవ్ ప్రయాగ్‌లో జరుగుతున్న ఈ పుష్కర్ కుంభ్‌కు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాలినడకన వెళ్లే భక్తుల కోసం ఆ మార్గాన్ని మరింత అప్‌గ్రేడ్ చేసినట్లు చమోలి జిల్లా మేజిస్ట్రేట్ సందీప్‌తివారి తెలిపారు. భక్తుల కోసం పలు భాషల్లో సైన్‌బోర్డులు పెట్టామన్నారు. దీనికి తోడు, ఆ మార్గంలో పోలీసు సిబ్బందిని మోహరించారు. కుంభ్ ప్రాంతంలో ఎలాంటి సంఘటనలు జరగకుండ సంగమం వద్ద నది ఒడ్డున ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు.



బృహస్పతి గ్రహం మిథున రాశిలోకి ప్రవేశించి నప్పుడు ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పుష్కర కుంభ్ నిర్వహిస్తారు. మాణా గ్రామంలోని అలకనంద, సరస్వతి నదుల పవిత్ర సంగమ స్థలమైన కేశవ్ ప్రయాగ్‌లో ఈ పుష్కర్ కుంభ్‌ను నిర్వహిస్తారు. ఈ పుష్కరాల్లో వైష్ణవ భక్తులు, ముఖ్యంగా దక్షిణ భారత ప్రాంతం నుంచి ఎక్కువ మంది పాల్గొంటారు.

హిందూ విశ్వాసాల ప్రకారం, మహర్షి వేద వ్యాసుడు తపస్సు చేస్తూ కేశవ ప్రయాగ్‌లో మహా భారతాన్ని రచించారట. ప్రఖ్యాత దక్షిణ భారత తత్వవేత్తలు, రామానుజాచార్య, మధ్వాచార్య వంటి సాధువులు ఈ ప్రదేశంలోనే సరస్వతి దేవి నుంచి దైవిక జ్ఞానాన్ని పొందారని కూడా భక్తులు నమ్ముతారు.

అందుకే దక్షిణాది నుంచి విష్ణు భక్తులు ఈ పుష్కరాల్లో పాల్గొని పవిత్ర సంగమంలో స్నానమాచరించి ప్రార్థనలు చేస్తారు. మరోవైపు, పుష్కర కుంభ్ ప్రారంభమైందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్‌ధామీ ప్రకటించారు. శ్రీ బద్రీనాథ్ ధామ్ సమీపంలోని భారతదేశంలోని మొట్టమొదటి గ్రామమైన మాణాలో 12 సంవత్సరాల తర్వాత పుష్కర్ కుంభ్ ప్రారంభమైంది. అలకనంద, నదుల పవిత్ర సంగమం వద్ద జరిగే ఈ గొప్ప ఉత్సవం మన శాశ్వత సంప్రదాయాల దైవత్వానికి సజీవ ఉదాహరణ అని అన్నారు.



# ఎమ్మెల్సీగా మీర్జారియాజ్ ఉల్ హాస్సన్ ప్రమాణస్వీకారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 16:** తెలంగాణ శాసన మండలిలోని తన ఛాంబర్ లో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైనా మీర్జా రియాజ్ ఉల్ హాస్సన్ ఎఫ్ఎండితో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా. వి. నరసింహా చార్యులు, ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, మీర్ జులుఫికర్ అలీ, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠినచర్యలు

### ఎసిబి డిజి వెల్లడి

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో ఉన్నతస్థాయిలో పనిచేసేవారిని అక్రమార్కులుగా చెబుతూ కొందరు ఎసిబి పేరిట బెదిరింపులకు పాల్పడుతుండడాన్ని అవినీతి నిరోధక శాఖ తీవ్రంగా పరిగణించింది. ఎసిబి పేరిట అబ్కారీ శాఖలో ఓ అధికారిని బెదరించి 25 లక్షల రూపాయలు వసూలు చేసిన విషయం పోలీసుల వరకు వెళ్లడం, దీనిపై కేసు కూడా నమోదవడంతో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసేందుకు ఎసిబి రంగంలో దిగింది. సర్కారీ విభాగాల్లో అక్రమాలకు పాల్పడే వారి గురించి ఇప్పటికే సమాచారం తెప్పించుకుని వరుసగా దాడులు చేస్తున్న ఎసిబి ఇదే సమయంలో ఎసిబి పేరు చెబు తూ బెదిరింపులకు పాల్పడే వారి భరతం పట్టేందుకు నిర్ణయించింది. ఈ తరహా వ్యక్తుల గురించి ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఎసిబి డిజి విజయ్ కుమార్ కోరారు.

ఎసిబి అధికారులు ఎవరినీ బెదిరించే సమస్య వుండదని, క్షేత్రస్థాయిలో అందే కచ్చితమైన సమాచారం ఆధారం గానే దాడులుంటాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎసిబి పేరిట ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వెంటనే 1064కు ఫోన్ చేయాలని, లేదా సమీప పోలీసు స్టే షన్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# ఎరువుల వినియోగం తగ్గించండి

### రాష్ట్రాలకు కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖ సూచన

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** వ్యవసాయ పంటలకు ఎరువులు ప్రధానంగా యూరియా వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ రాష్ట్రాలకు సూచన చేసింది. యూరియా వినియోగం రానురాను ఎక్కువవుతోందని ఫలితంగా దాని ప్రభావం సాగు భూములపై చూపుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కాగా తెలంగాణలో పంటల సాగులో ఎరువుల వాడకం ప్రధానంగా యూరియా వినియోగం ఆందోళనకరంగా పెరుగుతోంది.

పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది.

రాష్ట్రంలో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నట్లు వెల్లడైంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది.

# జలచరాల రక్షణ కోసం సరికొత్త విధానం

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** జలచరాలు, జలావరణాన్ని పరిరక్షించేందుకు హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ సరికొత్త ఎన్విరాన్‌మెంట్ డీఎన్ఏ విధానాన్ని రూపొందించింది. దీన్ని తొలిసారి తూర్పు కనుమల్లో వినియోగించి అక్కడి జలవనరుల్లో చొరబడిన నిషేధిత క్యాట్‌ఫిష్ సంతతిని సమర్థ వంతంగా గుర్తించింది. మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలిగించే క్యాట్‌ఫిష్‌ను సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించడం కష్టం. అందుకే ఈడీఎన్ఏ విధానాన్ని సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయోటజీ అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా నీఇలోని నమూనాలను సేకరించి, అందులో ఉండే ఈడీఎన్ఏను ప్రత్యేక పద్ధతిలో వేరు చేస్తారు. అనంతరం క్యూపీసీఆర్ అంప్లికేషన్ పద్ధతిలో డీఎన్ఏను విశ్లేషించి క్యాట్‌ఫిష్ సంతతి ఏ స్థాయిలో ఉందో తెలుసుకుంటున్నారు. క్యాట్‌ఫిష్‌ను వేగంగా గుర్తించేందుకు ఈ విధానం ఎంతో దోహద పడుతుందని హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad

**O.A. No. 96 OF 2025**

**BETWEEN:**
M/s. Yes Bank Ltd. ....APPLICANT
Vs
M/s. Royal General Contractors Private Limited & Anr. ....DEFENDANTS

**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**

To,
M/s. Royal General Contractors Private Limited, Represented by its Managing Director, Mr. Shaik Hussain Saheb, 2nd Floor, H.No.5-9-22/4/C, Hill Fort, Road No.4, Adharsh Nagar, Hyderabad, Telangana-500063. .....DEFENDANT NO.1

Please take the summons in the above **O.A.No. 96 of 2025** filed by the Applicant for Recovery of **Rs.44,76,845.02/- (Rupees Forty Four Lakh Seventy Six Thousand Eight Hundred Forty Five and Two Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** Telugu Newspaper edition daily newspaper and posted the matter to **19/06/2025.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under: (i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **19/06/2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001,** in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this **09th day of May, 2025.**

(By order of the Court)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad.

తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనముల శాఖ**

CTN. NIT No.EE(R&B/SRD/PA to EE/DB/T1/02/2025-26/168, తేది: 15.05.2025, క్ర.సం.1, పని పేరు: 1) నం. భవన మరమ్మతు (1) నం. కల్వర్ట్ పని మరియు (01) నం. BT నవీకరణ పని. సంగారెడ్డి జిల్లాలో 2025-26 సంవత్సరానికి సంగారెడ్డి డివిజన్ (R&B)కు సంబంధించినవి, అంచనా కాంట్రాక్ట్ విలువ: రూ.లక్షలలో (ECV రూ.) 14.33. పై పనికి బిడ్ దాఖలు ముగింపు తేది: 03.06.2025. సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (R&B) జిల్లా (R&B) అధికారి, సంగారెడ్డి జిల్లా, సెల్ నం.9440818095/7032303377. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), జిల్లా R&B అధికారి, సంగారెడ్డి జిల్లా
DIPR.No.1999-PP/CL/Advt/1/2025-26, తేది: 16.05.2025

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.

-డబ్ల్యు ఎమర్సన్

# ఎవరు సుప్రీం!


భారత రాజ్యాంగ రచన జరిగి 75 వ పడిలో పడుతున్న వేళ దేశ కాల మాన పరిస్థితుల రీత్యా కొన్ని కొత్త కొత్త మీమాంసలు తలెత్తుతున్నాయి. తమిళనాడు శాసనసభ ప్రతిపాదించిన బిల్లులు సుదీర్ఘ కాలం గవర్నర్ ఆమోదం లేకుండా, పెండింగ్‌లో ఉన్న విషయంపై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రాజ్యాంగ సందేహాలు ఎదురయ్యాయి. తమిళనాడు ప్రజలకు మేలు కలిగించే బిల్లులు సుప్రీం తీర్పుతో గట్టెక్కాయి. కానీ రాష్ట్రాలు పంపే బిల్లులను రాష్ట్రపతి గానీ గవర్నర్ గానీ గరిష్టంగా 3నెలల్లోగా ఆమోదించడం, లేదా తిప్పి పంపించడం చేయాలంటూ సుప్రీం ధర్మాసనం ఇచ్చిన తీర్పులోని ముఖ్యాంశాలపై తాజాగా రాష్ట్రపతి జోక్యం చేసుకుని సుప్రీం ఎవరో తేల్చాలని పట్టు బట్టడంతో విషయ ప్రస్తావన జనం చర్చలోకి వెళ్ళింది. అసాధారణ అధికారాలపై న్యాయసమీక్షకు ప్రాతిపదిక ఏమిటి? ఇలాంటి రాష్ట్రపతి ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం అవసరముంది. తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పు సందర్భంగా రాష్ట్రపతిపై కూడా పరిమితులు విధిస్తూ సుప్రీం ధర్మాసనం తీర్పుపై రాష్ట్రపతి ముర్ము అసహనం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో, ఎలా సంక్రమించిందో చెప్పాలని కోరారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెన్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు మూడు నెలల గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిదేనని ధర్మాసనం ఆదేశించింది. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయో వివరించాలని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదో ఒకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితం గా చెప్పాలని తెలిపింది. ఈతీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియా పరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్ధివాలా, అర్ మహదేవన్ ధర్మానసం తమ 415పేజీల తీర్పులో వెల్ల డించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించ డంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పుఎలా ఇచ్చారని రాష్ట్రపతి అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్ధివాలా, జస్టిస్ ఆర్ మహ దేవన్ ధర్మాసనం తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటి షన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన ప్రత్యేక అధికారాలనుపయోగించి ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉండాలా? ఆర్టికల్ 200కింద గవర్నర్ విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించుకునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారంపై న్యాయసమీక్ష చేయవచ్చు. అలాంటి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా? గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయంలో రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? ఒకవేళ ఉంటేదానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. ఇప్పుడు తాజాగా రాష్ట్రపతి లేవనెత్తిన సందేహాలకు సమాధానం, లేదా సరైన భాష్యం ఎవరు చెబుతారో తేలాలి. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి జటిలమైన ఈ అంశంపై విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయడమొక్కటే పరిష్కారం కాగలదు. సుప్రీం కోర్టు తీర్పుఅనంతరం కొందరు ప్రఖ్యాత న్యాయకోవి దులు ఈఅంశంపై మిశ్రమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రజాస్వామ్యంలో నాలుగు స్థంబాలుగా పేర్కొనబడే వ్యవస్థల మధ్య అవగాహన సందర్భంలో కానీ బాధ్యతల నిర్దేశంలో కానీ రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయం తీసుకోవడం పరిపాటి. ఏదైనా రాజ్యాంగమే సుప్రీం అన్న విషయం తెలిసిందే.

మనిషి పరిపూర్ణత అతని ఆస్తులలో ఉండదు. అతని స్వభావంలో ఉంటుంది.



మహాత్మాగాంధీ

మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.



అరిస్టాటిల్

# వసివాడుతున్న బాల్యం

**ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయి పంచకు పంపడానికి కారణం కేవలం ఆర్థిక పరిస్థితేననేది సత్యం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నో బాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థిక పరిస్థితులు వారిని నోరు విప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై వారి ప్రేమావాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు, ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్ర్యమే ఏకైక కారణం.**

దామెర్ల సాయిబాబ

చేసింది చెప్పుకోవడం సులభం. కానీ చెప్పింది చేయడం మాత్రం ఎంతో కష్టతరం. అలా హామీలిచ్చి ఆ తర్వాత మాట మార్చిన నేతలెందరో కాలగర్భంలో కలిసిపోయారు. కేవలం కొందరు మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుని చిరస్థాయిగా నిలిచిపోతారు. అందుకే మాట ఇచ్చేముందు అన్ని కోణాల్లో ఆలోచించి ఆచరణయోగ్యమా కాదా అందుకు తగిన వనరులు ఉన్నాయా తదితర అంశాలు పరిశీలించుకొని మాట ఇవ్వాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన విషయంలో పాలకులు మాట నిలబెట్టుకోలేకపోతున్నారు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. అవేమీ ఆశించిన ప్రయోజనాలు చేకూర్చడం లేదు. అందుకు కారణం అమలులో చిత్తశుద్ధి లేకపోవడమే. చట్టాలు చేసేటప్పుడు నిబంధనలు విధించేటప్పుడు ఉన్న శ్రద్ధ ఆచరణకు వచ్చేసరికి ఉండడం లేదు. అందుకే ఈ వ్యవస్థ అంతకంతకు పెరిగిపోతున్నది. వాస్తవంగా పరిశీలిస్తే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బాలకార్మికుల వ్యవస్థను రూపుమాపేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమేరకు ఫలితాలు కూడా సాధించారు. కానీ గత రెండు, మూడు దశాబ్దాలుగా ఆ కోణంలో చర్యలు లేవనే చెప్పొచ్చు. కరోనా రక్కసి విజృంభణ తర్వాత ఈవ్యవస్థ మరింతగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది విద్యార్థులు మరీ నిరుపేదల పిల్లలు బడిబాట మానేసి కార్మికులుగా అవతారమెత్తారు. ఆర్థిక వసతులు లేకపోవడం, కంప్యూటర్ వాట్సాప్, ఫోన్లు కొనలేక, కొన్నా సాంకేతిక పరిజ్ఞానం రాక ఇవన్నీ ఉంటేఅక్కడ ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు చదువులకు స్వస్తి చెప్పారు. అధికార లెక్కల ప్రకారమే దాదాపు కోటి మందికిపైగా బాలబాలికలు చదువులకు స్వస్తి చెప్పి వ్యవసాయరంగంలోనో, లేక పారిశ్రామిక రంగంలోనో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏదో పనుల్లో చేరిపోయారు. ఆ తర్వాత పాఠశాలలు తెరిచినా, ప్రభుత్వం బడిబాట కార్యక్రమాలు ఏర్పాటు చేసినా ఆ వైపు రాలేదనే చెప్పొచ్చు. దీంతో బాలకార్మిక వ్యవస్థ మళ్లీ బాగా పెరిగిపోయింది. ఫలితంగా ఆటపాటలు, చదువు సంధ్యలతో ఆనందంగా గడపాల్సిన ఎంతో మంది బాలల జీవితాలు కళ్లముందే బుగ్గిపాలవుతున్నాయి. పాత చట్టాలకు మరింత పదును పెట్టి కొత్త చట్టాలు తీసుకువచ్చామని ఎన్నిసార్లు నేతలు ప్రకటించుకుంటున్నా శతకోటి దరిద్ర్యాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఏదో ఒక మార్గంలో, ఏదో ఒక రూపంలో ఈ వ్యవస్థ కొనసాగుతూనే ఉన్నది. అన్నింటికంటే ప్రధానంగా ఈ కూపం నుంచి బయటకు తీసుకువచ్చిన బాలకార్మికులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని నిర్దిష్ట చర్యలవైపు అడుగులు వేయలేకపోతున్నారు. ఇది ఎన్నో ఏళ్ల నుంచి జరుగుతున్నా చాలా మంది అధికారులకు తెలిసినా పాలకులను నమ్మించేందుకు కాగితాల మీద ఏదో రాసుకొని కాలం గడుపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నాటి ప్రధాని జవహర్ లాల్‌నెహ్రూ, నేటి ప్రధాని నరేంద్ర మోడీ వరకు రాష్ట్రపతులు, సర్వేపల్లి రాధాకృష్ణన్, అబ్దుల్ కలాం తదితర పెద్దలెందరో బాలల పట్ల అత్యంత ప్రేమాభిమానాలు చూపినవారే. ఈ బాలలే భావిభారత పౌరులని వారి జీవితాల్లో వెలుగు నింపాలని ఆశించిన వారే. ఎన్నో కార్యక్రమాలు, మరెన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రోత్సహించిన వారే. ఇక మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఈ విషయంలో ప్రత్యేక

## ఒక్క మాట

శ్రద్ధ తీసుకున్నారు. రాజ్యాంగంలోని 24వ అధికరణ బాల కార్మిక వ్యవస్థను సమూలంగా వ్యతిరేకిస్తున్నది. పద్నాలుగు సంవత్సరాల వయసుగల పిల్లలను వ్యక్తులు కానీ, సంస్థలు కానీ పనిలో పెట్టుకోకూడదని నిర్దేశిస్తున్నది. రాజ్యాంగంలోని 39(ఇ)అధికరణ కూడా ఇదేవిషయాన్ని స్పష్టంగా పేర్కొంటున్నది. లేత వయసులో ఉన్న పిల్లలను వారి వయసుకు మించిన పనుల్లో పెట్టకూడదని రాజ్యాంగ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ ఆర్థిక అవసరాల నిమిత్తం పిల్లలను వయసుకు మించిన పనిలో నియమించరాదని రాజ్యాంగ నిబంధనలు ఘోషిస్తున్నాయి. మరొపక్క ప్రమాదాలకు అవకాశం ఉన్న పరిశ్రమల్లో బాలకార్మికులను నియమించరాదని మరో చట్టం తీసుకువచ్చారు. రాజ్యాంగ నిర్దేశాలు, చట్టాలు ఉన్నా అంతగా ఫలితం లేకపోవడంతో బాలకార్మిక వ్యవస్థలో మార్పులు రాకపోగా మరింతపెరుగుతుండడంతో 1986లో పదమూడు వృత్తులకు సంబంధించి యాభైఏడు రకాల పనులు బాలలతో చేయించకూడదనిమరో చట్టాన్ని తీసుకువచ్చారు. ఈచట్టం ప్రకారం బాలకార్మికులను పనుల్లో నియమించుకునేవారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అయినా అంత ప్రయోజనం చేకూరలేదు. ఆందోళన చెందిన కేంద్ర పాలకులు 1994లో పటిష్టమైన చర్యలకు ఆదేశించారు. 2000సంవత్సరం నాటికి బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని అధికారికంగా ప్రకటించుకున్నారు. మరొకపక్క రోజురోజుకు పెరిగిపోతున్న బాలకార్మిక సంఖ్యను చూసి ఆందోళన చెందిన దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2006లో మరొక చట్టాన్ని తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా ఇళ్లల్లో పనిచేసే కోట్లాది మంది బాలకార్మికులకు భరోసా కల్పించి వారికి అక్షరాలు నేర్పించి చైతన్యవంతులను చేయాల్సిందిగా నడుం బిగించింది. ఈచట్టం ప్రకారం హోటళ్లలోనూ, రెస్టారెంట్లలోనూ, బార్లలో తదితర చోట్ల బాలకార్మికులందరికి విముక్తి కల్పించి ప్రత్యామ్నాయం చూపాలని నిర్దేశించారు. అలాగే బాలలను పనిలో నియమించుకున్నవారిపై క్రిమినల్ కేసులు పెట్టి జరిమానాలతోపాటు జైలు శిక్ష కూడా విధించేలా చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించారు. పెద్దఎత్తున దాడులు జరిగాయి. అప్పట్లోనూ తెలుగు రాష్ట్రాల్లోనూ వేలాదిమంది బాలకార్మికులకు విముక్తి కల్పించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వెట్టిచాకిరిలో మగ్గిపోతున్న బాలలెందరినో బయటకు తీసుకువచ్చి వారి వారి రాష్ట్రాలకు పంపారు. ఇందులో ఆనాటి ఉమ్మడిరాష్ట్ర పోలీసులు ఎంతో కృషి చేశారు. కానీ అలా వెళ్లిన వారు ఎంతో కాలం వారి స్వగ్రామాల్లో ఉండలేకపోయారు. ఏదో మార్గం ద్వారా పాత పనులకు వచ్చి చేరుకున్నారు.ఇందుకు ముఖ్య కారణం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడమే. బాల కార్మికులను ఆ కూపంనుంచి బయటకు తీసుకువచ్చామని, పునరావాసం కల్పించామని చేస్తున్న ప్రకటనలు ప్రచార్భాటాలుగానే మిగిలిపోతున్నాయి. పాఠశాలల్లో చేర్పించామని చెప్పుకుంటున్నా ఆ పిల్లల్లో అధికశాతం తిరిగి తమతమ పాత పనుల్లోకి చేరిపోతున్నారు. కోట్లాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నా నేతలు వాస్తవాలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ ఆశించిన లక్ష్యం చేరుకొనే అవకాశాలు కనుచూపు దూరంలో కన్పించడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు, కారకులు ఎవరు అనేవిషయంలోకి పాలకులు పోవడం లేదేమోననిపిస్తున్నది. తల్లిదండ్రులే తమ పిల్లలను నాలుగు డబ్బుల కోసం ఇలాంటి పనుల్లో చేర్పిస్తున్నారనే వాదనను తోసిపుచ్చలేం. పాలకులు మనసుపెట్టి ఒక విషయాన్ని ఆలోచించాలి. లేత వయసులో చదువు సంధ్యలతో ఆడుతూ పాడుతూ కళ్లముందు ఉండాల్సిన పిల్లలు ఎక్కడో కన్పించని ప్రాంతాలకు పనికోసం పంపుతున్న ఆ తల్లిదండ్రులు ఎంతటి మానసిక క్షోభకు గురవుతుంటారో వేరే చెప్పక్కర్లేదు. ఏ తల్లిదండ్రులు తమ పిల్లలను మనస్ఫూర్తిగా ఆ పనులకు ఆ వయసులో పంపరనేది వాస్తవం. అయినా పేగుతెంచుకొని పుట్టిన కన్నబిడ్డలను పదిరాళ్ల కోసం పరాయి పంచకు పంపడానికి కారణం కేవలం ఆర్థిక పరిస్థితేననేది సత్యం. ఆ పిల్లలు చేయరాని, చేయలేని, చేయకూడని పనులెన్నో చేస్తూ ఇంకెన్నోబాధలు అనుభవిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులకు తెలియంది కాదు. అయినా వారి ఆర్థికపరిస్థితులు వారిని నోరు విప్పనీయడం లేదు. తల్లిదండ్రులకు దూరమై వారి ప్రేమావాత్సల్యాల కోసం ఆ పసిహృదయాలు ఎంత వేదన పడుతుంటాయో చెప్పడానికి మాటలు దొరకవు. అటు తల్లిదండ్రులకు, ఇటు తమకు ఇష్టంలేని వ్యవస్థలోకి పిల్లలు బలవంతంగా ప్రవేశిస్తున్నారు. అందుకు కేవలం ఆ కుటుంబాన్ని పట్టిపీడిస్తున్న దారిద్ర్యమే ఏకైక కారణం.ఆకోణంలో ఆలోచిస్తే కొంత మేరకైనా ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అంతేకానీ మూలాలు వదిలిపెట్టి చట్టాలు తెచ్చుకున్నాం, సమావేశాలు, సమీక్షలు చేస్తున్నాం అంటూ అంతా అయిపోనట్టుగా ప్రకటించుకోవడం మనలను మనం మోసం చేసుకోవడమే. ●

# పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ఉత్తర్వులను సవరించాలి

వాసిలి సురేష్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల పునర్వ్యవస్థీకరణ పేరుతో కొత్త విధానంతో విద్యారంగాన్ని బాగు చేయాలని ప్రభుత్వ ఉత్తర్వులు 19, 20, 21 విడుదల చేసింది. 117 జీఓకు పూర్వం ఉండే పాఠశాల వ్యవస్థ విధానాలు కావాలని ఉపాధ్యాయ సంఘాలు కోరడం, 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, పాఠశాల పునర్వ్యవస్థీకరణ పేరుతో కొత్తగా ప్రభుత్వ ఉత్తర్వులు 19, 20, 21 తీసుకొచ్చింది. వీటిని అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కాకపోగా బలహీన పడే అవకాశం ఉంది. గత ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని, విద్యా రంగాన్ని గాడిలో పెడతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యా రంగాన్ని మరింత గందరగోళంలోకి నెట్టే పరిస్థితులు తీసుకు వస్తున్నది. గత ప్రభుత్వం కేవలం 3,4,5 తరగతులను మాత్రమే ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తే ఈ ప్రభుత్వం ఒకటి, రెండు తరగతులను కూడా విలీనం చేయడం విడ్డూరంగా ఉంది. మోడల్ ప్రాథమిక పాఠశాలల కోసం, ఫౌండేషన్ పాఠశాలలను నెలకొల్పడం సరికాదు. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్లను నియమించడం అశాస్త్రీయంగా ఉంది. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5 తరగతులు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 20లోపు విద్యార్థులు ఉన్నప్పుడు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతున్నాయి. కాబట్టి విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలి. విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం కోసం తెలుగు ఇంగ్లీషు మాధ్యమాలను కొనసాగించాలి. మైనారిటీ భాషల మాధ్యమాలను కూడా కొనసాగించాలి. ప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి కొత్తగా ప్రవేశపెట్టిన మోడల్ ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్‌ల ఆలోచనను విరమించుకోవాలి. మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులను మాత్రమే నియమించాలి. ఎస్జీటీ టీచర్లకు ప్రైమరీ స్కూలు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు ఇవ్వాలి. స్కూల్ అసిస్టెంట్‌లను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మాత్రమే వినియోగించాలి. మోడల్ ప్రాథమిక పాఠశాలలలో 120 మంది విద్యార్థులు దాటితే ఆరుగురు ఉపాధ్యాయులను నియమించాలి. ఉన్నత పాఠశాలలలో 1నుంచి 5 తరగతులు విలీనంచేసే ప్రతిపాదనను విరమించుకోవాలి. హైస్కూళ్లలో ఆరునుంచి పదితరగతులు మాత్రమే నిర్వహించాలి. కొత్తగా ప్రతిపాదిత ప్రభుత్వ ఉత్తర్వు21లో ఉన్నత పాఠశాలలోఉపాధ్యాయులకు 40 పీరియడ్ల భారం పడనున్నది.దానిని 32 పీరియడ్లకు మించకుండా చూడాలి. ఉన్నతపాఠశాలలో 45మంది విద్యార్థులు దాటిన చోట రెండవసెక్షన్ ఏర్పాటుచేయాలి. క్లస్టర్ స్థాయిలో ఉపాధ్యాయులను మిగులు చూపించకుండా వారిని విద్యార్థుల సంఖ్యను బట్టి డిసెండింగ్ ఆర్డర్లో పాఠ శాలలకు కేటాయించాలి.పెరిగిన జనాభాకు అనుగుణంగా మునిసిపాలిటీ, కార్పొరేషన్,నూతనంగా వెలిసిన ఆవాసాలలో నూతన పాఠశాలలు ఏర్పాటుచేయాలి. అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్అసిస్టెంట్ తెలుగు ప్రమోషన్లలో సీనియారిటీ జాబితాలోచేర్చి ప్రమోషన్లు ఇవ్వాలి. ●

# ప్రజావాక్కు



## శిక్షలు పడితే తప్ప మారరు

అత్యున్నత పదవులు అనుభవిస్తూ, అత్యంత అభిమానించి రాజ్యాంగ పరమైన అధికారం కట్టపెట్టితే పదవులు దక్కిన తరువాత సమయం, సందర్భం, సంయమనం కోల్పోయి ఇష్టారీతిన ఎందుకూపనికిరాని పోలికలతో పనికిరాని చెత్త మాటలతోఏదో గొప్పగా మాట్లాడుతున్నామనే భావన చాలామంది ప్రజాప్రతినిధులకే కాక, మంత్రివర్యులూ మాట్లాడడం ఒక ఫ్యాషన్‌గా మారింది. చాలా సందర్భాలు చూసాం. ఈ మధ్య ఒక ప్రజాప్రతినిధి యుద్ధాన్ని గురించి మాట్లాడుతూ ఎయిర్ కలనల్ ఖురేష్యా పై చేసింది ఇటువంటిదే.సాక్షాత్తు అత్యున్నత న్యాయస్థానమే మొట్టికాయలు బాగా దంచికొట్టడం నిజంగా గమనార్హం. ఎన్ని సందర్భాలలో మనము ఇటువంటివి నాయకులు, సెలబ్రిటీలు,మంత్రులు,గొప్పగా చెప్పుకుంటున్న కొందరు విజ్ఞానులు నోటి దూలలు వింటూనే వున్నాము. గట్టి శిక్షలు పడితే తప్ప వీళ్ల మారరు.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## జరిమానాలు విధించడం సబబుకాదు

విజయవాడలో వాహనదారులు సమాజసంక్షేమం దృష్ట్యా తీసుకుంటున్న చర్యలు హర్షణీయమే ఐనాకొన్ని విషయాలు విస్తు గొల్పుతున్నాయి.వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్,రాంగ్‌రూట్ డ్రైవింగ్, అతి వేగంగా వాహనాన్ని నడపడం వంటివి సమంజసమే. కానీ, వాహనదారుల వ్యక్తిగతఅంశాలైన ఇన్సూరెన్స్, ద్విచక్ర వాహన దారుల హెల్మెట్ ధారణ అదీ బైక్‌పై ఉన్న ఇద్దరూ ధరించాలనడం సమంజసం కానే కాదు. వీటివల్ల కలిగే కష్టనష్టాల్నివాహనదారుడే భరిస్తాడు.సమాజంలో ఎదుటివారికి ఏమాత్రం సంబంధం లేని విషయాలు ఇవి. కనుక ఈ రెండు విషయాల్లో మాత్రం వాహనదారుల ఇష్టాలకు వదిలేయాలి. జరిమానాలు విధించడం సబబు కాదు.

-వీరుభొట్ల పేరయ్య శాస్త్రి, విజయవాడ

## కోచ్ పరిశ్రమ స్థాపన

కాజీపేటలో మల్టీ మోడల్ కోచ్ పరిశ్రమ స్థాపనతో ఉద్యోగాలకు ఉపాధికి రెక్కలొచ్చినట్టు అయ్యింది. ఈ మల్టీ మోడల్ పరిశ్రమ కొన్ని వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. దీనివల్ల కొన్ని వేల కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది. జీవన ప్రమాణ రేట్ పెరుగుతుంది.

-భారత అవినాష్, జనగామ

## పెరుగుతున్న అపరిష్కృత కేసులు

ఏపి రాష్ట్ర హైకోర్టు, ఏఎన్‌యు నిర్వహించిన కార్యకలాపాల వివరాల ప్రకారం దేశంలో అపరిష్కృత కేసుల సంఖ్య ఐదు కోట్లకు దాటడం ఆందోళన కలిగిస్తుంది. సమాజంలో వ్యక్తుల మధ్య సంఘీభావం పూర్తిగా కొరవడటం,ప్రతీకార ధోరణి, ఆధిపత్య ధోరణి, అమానుష చర్యలు చాలా వరకు కేసుల పెరుగుదలకు కారణం. గ్రామ స్థాయిలోనే పెద్దల సమక్షంలో వివాదం తేల్చుకోవచ్చు. పంతాలు,పట్టింపులు ఎక్కువై పైస్థాయికి వెళ్తున్నారు. ధనం, కాలం, శ్రమ పూర్తిగా ఇరుపక్షాలకు నష్టమే. వివాదం లేకుండా ప్రవర్తించడం సమస్యను జటిలం చేస్తుంది. న్యాయ శాస్త్రపరిధిలోతీర్పుకు సమయం తప్పదు.న్యాయ శాస్త్ర నిపుణులు ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాలకు కృషి ఎంతో విలువైనది. న్యాయ విద్యార్థుల క్రమశిక్షణ, సహనం అలవాటైతే ఉత్తమ ఫలితాలు,విజయం సాధ్యమే .ప్రజలు కూడా వివాదం కన్న పరిష్కార మార్గం సులువును కోరుకోవాలి.

-బొల్లోజు మేఘనాథమ్, విశాఖపట్నం

## ప్రజావాణిలో మార్పులు రావాలి

ప్రతి సోమవారం రోజున ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి దరఖాస్తుల కార్యక్రమం మొక్కుబడిగా నిర్వహించడం తప్ప పరిష్కారం ప్రజలకు దొరుకడం లేదు. సమస్యలపై అధికారులు చోరువ తీసుకొనేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పరిష్కారం చూపించాలి.ప్రభుత్వ అధికారులు పౌరసేవలను సరియైన సమయం అమలు చేసేవిధంగా సూచనలు చెయ్యాలి.సమాచార హక్కుచట్టం ప్రకారం సమాచారం ఇవ్వాలి. పౌరులు పైన తెల్పిన వాటి గురించి ప్రశ్నించిన్నప్పుడు మా విధులకు ఆటంకం కల్పిస్తున్నారని అల్లరి చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిసేస్తూ పనులను చేయటం లేదు.

-ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్

## పట్టుదల ముఖ్యం

దేశంలోని బొగ్గుసంస్థలలో పనిచేస్తున్నజనరల్ మజ్దూర్ పదవి పేరును జనరల్ అసిస్టెంట్‌గా మార్చడం చాలా సంతోషం. అన్ని జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఐక్యంగా పోరాడి తరతరాలుగా ఉన్నపేరును మార్చడం అభినందనీయం. ఈ పేరు సంఘంలో చాలా గౌరవనీయంగా ఉంటుంది.ఇదే స్ఫూర్తితో బొగ్గు రిటైర్డ్ ఉద్యోగులకు కూడా పెన్షన్ పెంపుదల చేయుటకు మెరుగైన వైద్య సౌకర్యాలు అపరిమితంగా ఉచితంగా కల్పించుటకు కృషి చేయాలి.

-దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

మనవి

**ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వీధి కుక్కల సమస్యకు పరిష్కారమేదీ?



డివి లక్ష్మీనారాయణ

వీధి కుక్కల సమస్య ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో గత సంవత్సరం 2,500 మంది కుక్కగాట్లకు గురికాగా వారిలో తొమ్మిది (9)మంది రేబిస్ వ్యాధికిగురై చనిపోయారు. తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో గల నారాయణగూడాలో ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ వద్దకి సాధారణ రోజుల్లోనే నెలకి 2500 మంది దాకా కుక్కగాటు బాధితులు చికిత్స కోసం వస్తుంటారు. తాజాగా ఇటీవల గుంటూరులోని ఒక వీధిలో కుక్కల గుంపు దాడి చేసి 25 మందిని గాయపరిచాయి. అలానే కొద్ది రోజుల క్రితం గుంటూరులోని ఒక వీధిలో నాలుగు సంవత్సరాల బాలుడిని వీధి కుక్కలు గొంతు కొరికి చంపేశాయి. ప్రభుత్వం ఆ బాలుడు కుటుంబానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది.తాజాగా నంద్యాల జిల్లా బేతంచర్లలో వీధి కుక్కలు నాలుగు సంవత్సరాల బాలుడిని శరీరమంతా కరిచి చంపేసాయి. అభం శుభం తెలియని ఆ నాలుగేళ్ల ఇరువురు చిన్నారులకు నూరేళ్ల నిండాయి. ఆ పాపం ఎవరిది. కుక్కల సంతతి నిరోధించేందుకు చేసే ఆపరేషన్లు ఒక్కొక్క కుక్కకు 1500 రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.ఆఖరికి అధికార పార్టీకి చెందిన ఒక మహిళ ఎమ్మెల్యే కుక్కల ఆపరేషన్లు సరిగా జరగడం లేదని కుక్కల సమస్యపై సుదీర్ఘంగా చర్చించి అధికారులను అసెంబ్లీలోనే నిలదీశారు.అయినా గాని ప్రయోజనం ఏమి లేదు. ఆ మహిళా ఎమ్మెల్యే ఆవేదన కుక్కకాటు బాధితుల ఆక్రందన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది. కాగా కొన్ని దశాబ్దాల క్రితం ఇంతగా వీధి కుక్కల సంతతి పెరిగిపోలేదు. గత ఐదు సంవత్సరాల నుండి ప్రస్తుతం ప్రతి వీధిలో పదికి తగ్గకుండా కుక్కలు గుంపులుగా చేరి దారిన పోయే వారిని కరుస్తున్నాయి. సమాజంలో కొందరు కొన్ని మూగ జీవాలను భక్తితో పూజిస్తారు. ఉదాహరణకి గోవులు కోతులు, పాములు చెప్పుకోవచ్చు.అలానే మరి కొంతమంది కుక్కలను పెంచుతుంటారు ఎంతో ఆప్యాయంగా చూసుకుంటారు. ఎంతగా అంటే వాటిని తన కుటుంబ సభ్యులలో ఒకటిగా భావిస్తారు. అది మంచిదే అలాంటి నిజమైన మూగజీవాల ప్రేమికులు ఈ సమాజానికి చాలాఅవసరం. అలానే మూగ జీవాలను ప్రేమించే జంతు సంరక్షణ సంఘాల అనేకం ఉన్నాయి. వాళ్లంతా వీధికుక్కల పెంపకం ఒక దైవకార్యంగా భావించి వీధి కుక్కలను తమ శక్తి మేర ఎక్కువ సంఖ్యలో పెంచుకుంటే కొంతవరకు వీధి కుక్కల సమస్య పరిష్కారం అవుతుంది. అలానే ప్రభుత్వం నుండి సేవా భావం ఉన్న ఇతరుల నుండి ఆర్థిక సహాయం పొంది ఎక్కడికక్కడ వీధి కుక్కల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయిస్తూ ఆ



బాధ్యతలు తీసుకుంటే వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. అప్పుడు మూగ జీవాల రక్షణ సంఘాల, మూగజీవాల ప్రేమికుల సంఘాల స్థాపన ఆశయం నెరవేరుతుంది. అలా కాకుండా కేవలం ప్రచారానికే పరిమితమైతే అది లోకావంచన ఆత్మవంచన గానే మిగిలిపోతుంది. మూగజీవాలను ప్రేమించడం అంటే సాటి మానవులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూస్తూ వాటి పట్ల దయా,జాలి కలిగి ఉండటమే. అంతేగాని సాటి మనిషి ప్రాణాల కంటే కుక్కలు బల్లులు పిల్లులు, నల్లులు, బొద్దింకలు చీమలు, దోమల మీద జాలి దయ ఎక్కువ అంటే అదేదో అంతుచిక్కని మానసిక వ్యాధిగానే పరిగణించాలి పరిగణించాలి. చిన్నపిల్లలు వృద్ధులు, పాదచారులు, సైకిళ్లు, మోటారు సైకిళ్ల చోదకులు ఎక్కువగా వీధి కుక్కల బారినపడి గాయాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ కష్టనష్టాలకు గురవుతున్నారు. కార్లలో తిరిగేవారికి వీధికుక్కల గండం లేదు. అందువలన వీధి కుక్కలతో సమస్యలు, బాధలు వాళ్ళకి అర్థం కాదు. ఫలితంగా మన పాలకులు ఈ సమస్యను తీవ్రంగా పరిగణించరు. వీధి కుక్కల సమస్య వినడానికి చాలా చిన్న సమస్యగానే ఉన్న కుక్క కరిస్తే 14 ఇంజక్షన్లు చేయించుకోవాలి. లోగడ సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించమని పెద్దలు దీవించేవారు. కానీ ఇప్పుడు కుక్కలు కరవకుండా కనీసం 30 ఏళ్లు జీవిస్తే చాలని దీవించే రోజులు వచ్చాయి. కొన్ని వీధులలో అయితే అర్ధరాత్రి కుక్కల బారిన పడకుండా క్షేమంగా నడిచివస్తే వాడికి పరమవీరచక్ర బిరుదుఇవ్వవచ్చు. ద్విచక్ర మోటార్ వాహనాలపై వెళుతూ వీధి కుక్కలు వెంబడించడంతో కంగారుపడి కింద పడిపోయి గాయాల పాలయిన సందర్భాలు అనేకం. పతి ఒక్క వీధిలో కనీసం 20 ఇళ్ళు ఉంటాయి. నగరాలు పట్టణాలలో ఇంటి ఖరీదు కనీసం కోటి రూపాయలు ఉంటుంది కాబట్టి వీధి కుక్కలపై అంతగా జాలి ఉంటే ఆ వీధిలో కుక్కలను వారి సొంత కొంపలో ఒక గది కేటాయించి పెంచుకుంటే అది పుణ్యఫలాన్ని ఇస్తుంది. అంతేగాని మూగ జీవాలపై దయ పేరుతో కుక్కలకు ఆహారం పెట్టి అవి అందర్నీ కరుస్తుంటే అది జంతు ప్రేమ అనిపించుకోదు కదా అంతకుమించిన పాపం మరొకటి ఉండదు. ఇటీవల వీధి కుక్కల దాడిలో అసువులు బాసిన నాలుగు సంవత్సరాల చిన్నారుల మాతృమూర్తుల కడుపుకోత మనల్ని జీవచ్ఛవాలని చేసింది. అయినా మనం పట్టించుకోము. మన ఆశయాలు మన ఆలోచనలే మనకు ముఖ్యం ఎంతమంది ఎలా చస్తే మనకి ఏమిటి. కవి శ్రీశ్రీ గారు చెప్పినట్లు మనది ఒక బ్రతుకేనా సందులలో గొందులలో పందుల వలె అని మనకి మనం ప్రశ్నించుకునే సమయం ఆసన్నమయ్యే వరకు మనకేం పట్టవు.కాగా ఇకమూగ జీవాలలో సైతం ప్రత్యేకత కనపరుస్తుంటారు. మూగజీవాలంటే మనుషల లాగా మాట్లాడడం పోట్లాడటం పొగడటం శాపనార్థాలు పెట్టడం చేయలేవు అని అర్థం. వాస్తవానికి కొందరు ఆహార పదార్థాలుగా తినే అనేక మూగజీవాలు మనకు ఎలాంటి అపకారం చేయవు. కష్ట,నష్టాలు కలిగించవు కానీ వాటిపై ఎలాంటి దయ ఉండదు. వివాహ భోజ నంబు ఇష్టమైన వంటకంబు అవన్నీ నాకుచాలు అని పాడు కుంటూ తింటున్నారు. నిజమేనేమో కేవలం నష్టం కలుగజేసే వాటిని చంపేస్తున్నారు. గాయపరిచి ప్రాణాలు తీసే వాటి పట్ల దయ చూపిస్తున్నారు. ●

# రక్షణకు మరో రూ.50వేల కోట్లు!

## పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రతిపాదనలు



**న్యూఢిల్లీ,మే 16:** ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణరంగాన్ని మరింత బలోపేతంచేసేందుకు గాను కేంద్రం 50 వేల కోట్లు అదనపు నిధులు కేటాయించింది. అనుబంధ బడ్జెట్ గ్రాంట్లలో ఈనిధులు కేటాయించడం జరుగుతుందని, ఈమొత్తంతో రక్షణరంగానికి ఈ బడ్జెట్‌లో మొత్తం ఏడు లక్షలకోట్లు కేటాయించినట్లవుతుందని రక్షణశాఖ ప్రకటించింది. ఆసయుధ బలగాలకోసం మొత్తం 6.81 లక్షలకోట్లు కేటాయించారు. 2025/26 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈ కేటాయింపులనుప్రకటించారు. గత బడ్జెట్‌లో పొందుపరిచిన 6.22 లక్షలకోట్లకంటే 9.2శాతం ఎక్కువ కేటాయింపులు జరిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశంలో ఈ పెంచిన కేటాయింపులకు అనుమతులు పొందుతారు. ఈ నిధులు రీసెర్చి డెవలప్‌మెంట్, ఆయుధ కొనుగోళ్లు, ఆయుధసామగ్రి సమీకరణ ఇతర అత్యవసర సామగ్రిని కొనుగోలుకు వినియోగిస్తారు. నరేంద్రమోడీ పాలనలో 2014నుంచి కూడా రక్షణరంగానికి ప్రాధాన్యత పెరిగింది. 2.29 లక్షలకోట్లు 2014/15 బడ్జెట్‌లో కేటాయిస్తే ఈసారి ఏకంగా మొత్తం బడ్జెట్‌లో 13శాతం రక్షణరంగానికి కేటాయింపులు జరిపారు. పాక్‌తో మరింత ఉద్రిక్తతలు పెరుగుతుండటం, పహల్గాంవ్‌లో ఉగ్రదాడుల తర్వాత రక్షణరంగానికి అత్యంత ప్రాధాన్యత పెరిగింది. ఆపరేషన్ సింధూర్‌తో భారత రక్షణ సంపత్తి సామర్థ్యం ప్రపంచానికి తెలిపింది. ఇజ్రాయిల్ తరహాఐరన్‌డోమ్‌లాగే భారత రక్షణ వ్యవస్థను కూడా దుర్భేధ్య వ్యవస్థగా మార్చింది. ఆకాశ్ మిసైల్ వంటి వాటితో రక్షణ వ్యవస్థను మరింత బలపరిచింది. అప్పటినుంచి సాయుధ శక్తులు భార్గవాస్త్రను కూడా పరీక్షలుచేసారు. తక్కువ వ్యయంతో నిర్మించిన కౌంటర్‌డ్రోన్ వ్యవస్థను సమర్ధవంతంగా పరీక్షించారు. వందగంటలపాటు జరిగిన భారత్‌పాక్ దాడుల తర్వాత రాజ్‌నాథ్ సింగ్ రక్షణరంగ సామగ్రిని దేశీయంగానే ఉత్పత్తిని చేసేందుకు మరింతగా సుముఖంగా ఉన్నారు. భారత్ సింధు నదీజలాల ఒప్పందం నిలిపివేత,పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం వంటి చర్యలతో భారత రక్షణరంగ పటిష్టత మరింతపెరిగిందనే చెప్పాలి. పాక్ ఆక్రమించిన కాశ్మీర్‌ను వెంటనే అప్పగించాలని, ఉగ్రస్థావరాలు, ఉగ్రవాదులకు స్థానంలేకుండా చేసినప్పుడే పాకిస్తాన్‌తో చర్చలుంటాయని, పాక్‌భారత్ వివాదంలో బయటి వ్యక్తులప్రమేయం అంగీకరించబోమని, మధ్యవర్తుల ప్రమేయం అనవసరమని, ద్వైపాక్షికమని స్పష్టం చేసారు. దీనితోపాటే పిఓకేను తక్షణమే అప్పగించాలన్న డిమాండ్‌కు అనుగుణంగానే అంతర్జాతీయంగా పాక్‌ను ఏకాకిచేసే లక్ష్యంతో భారత్ వెళుతున్న సంగతి తెలిసిందే.

# భారత్ సమీపంలో చైనా గూఢచారి నౌక..

## పాకిస్థాన్‌ను ఆదుకునేందుకేనా?




**న్యూఢిల్లీ, మే 16:** పాకిస్థాన్ సహా, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసేందుకు మన బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించిన సంగత తెలిసిందే. ఆపరేషన్ జరిగిన వెంటనే భారత్ జలాల్లో చైనాకు చెందిన గూఢచారి నౌక 'ద యాంగ్ యిహావో' కదలికలు కనిపించడం చర్చనీయాంశమైంది. ఇది పాక్-చైనా బంధాన్ని తెలిపేలా ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనం రాసుకొచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో చైనా నౌక భారత జలాలకు సమీపంలో సంచరించడం పలు అనుమానాలకు తావిచ్చింది. మన సముద్ర జలాల్లోని భారత నౌకల కదలికలు, నిఘా, ప్రతిస్పందన సామర్థ్యాన్ని, బలాంతర్గాముల కదలికలను హైడ్రోగ్రాఫిక్ పరికరాల సాయంతో చైనా పసిగట్టే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత అరేబియా సముద్రం, హిందూ మహా సముద్రంలో ఉత్తరం వైపు మన నౌకాదళం అత్యంత అప్రమత్తమైన సంగతి తెలిసిందే. ఐఎన్ఎస్ విక్రాంత్, బ్రహ్మోస్ క్షిపణులతో కూడిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములను మోహరించింది. ఆ గూఢచారి నౌకకు ఉన్న అధునాతన సెన్సర్లతో ఐఎన్ఎస్ విక్రాంత్ సహా భారత యుద్ధ నౌకల కదలికతలను పసిగట్టేందుకు వీలుంది. పాక్‌కు తమ మద్దతు ఉందని సంకేతాలు పంపేందుకు, నిఘా సమాచారాన్ని సేకరించేందుకు ఈ మోహరింపు ఉపయోగిం చుకొని ఉండొచ్చని అనుమానాలు. ఒకవేళ పాకిస్థాన్‌లోని కరాచీపై భారత్ దాడి చేసేందుకు సన్నాహాలు చేస్తే, వాటిని ముందుగానే పసిగట్టి, సదరు సమాచారాన్ని పాకిస్థాన్‌కు తెలియజేసేలా ఈ మోహరింపు ఉండి ఉండొచ్చు. చైనా ప్రతిష్ఠాత్మక బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్ (బిఆర్ఐ) కింద చైనా-పాకిస్థాన్ ఎకానమిక్ కారిడార్ నిర్మాణం జరుగుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మీదుగా సిపెక్ ప్రాజెక్టు చేపట్టడంపై భారత్ మొదటి నుంచీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి కావాలంటే పాక్‌లో రాజకీయంగా, ఆర్థికంగా స్థిరమైన పరిస్థితులు ఉండటం డ్రాగన్‌కు అత్యంత కీలకం. అది కూడా నిఘా వెనక కారణం కావొచ్చు. ఈ నౌక భారత నౌకాదళ విభాగాల మధ్య కమ్యూనికేషన్‌కు అడ్డంకులు సృష్టించగలదు. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లో కీలకమైన జలాంతర్గాములు రాకపోకలను ఇది మ్యాప్ చేయగలదు. అలాగే ఇక్కడ సేకరించిన సమాచారాన్ని పాక్‌లో నిర్మించాలనుకుంటున్న మిలిటరీ లాజిస్టిక్స్ బేస్ కోసం ఉపయోగిం చుకోవచ్చు. హిందూ మహా సముద్రంలో ఇలా చైనా నౌకల కదలికలు ఉండటం ఇదే తొలిసారి కాదు. 2024లో యువాన్ వాంగ్-6 వంటి నౌకలను మోహరించింది. ఈ ప్రాంతంతో భారత ఆధిపత్యాన్ని సవాలు చేసే లక్ష్యంగానే ఈ చర్యలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## చార్‌ధామ్ యాత్రకు తగ్గిన భక్తులు

**డెహ్రాడూన్, మే 16:** ఛార్‌ధామ్ యాత్రలో భాగమైన గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. దీంతో, పూర్తిస్థాయిలో చార్‌ధామ్ యాత్ర మొదలైంది. ఈ యాత్రలో భక్తుల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. చార్‌ధామ్ యాత్రలో మొదటి రెండు వారాల్లో భక్తులు 6,62,446 మంది భక్తులు గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలను సందర్శించారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 31 శాతం భక్తుల సంఖ్య తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్ 30 నుంచి మే 13 వరకు 6,62,446 మంది భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. అదే గత ఏడాది యాత్ర ప్రారంభమైన మే 10 నుంచి మే 23 వరకు 9,61,302 మంది భక్తులు సందర్శించినట్లు ఎస్‌డీసీ ఫౌండేషన్ అనే సంస్థ వెల్లడించింది. జమ్మూ కశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి, భారత్‌పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల ప్రభావం భక్తులపై పడిందని ఆ సంస్థ పేర్కొంది. కాగా భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గిన నేపథ్యంలో రానున్న రోజుల్లో యాత్రకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుందనే అభిప్రాయాన్ని ఆ సంస్థ వెల్లడించింది. కాగా చార్‌ధామ్ యాత్ర ప్రారంభమన తొలిరోజు కార్యక్రమాల్లో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ పాల్గొన్నారు. ఆలయ ద్వారాలు తెరుచుకునే సమయంలో భారత ఆర్మీకి చెందిన ఘర్వాల్ రైఫిల్స్ సైనికులు సంప్రదాయ భక్తిగీతాలను ప్లే చేశారు. ఆలయం పరిసరాల్లో ముఖ్య సేవక్ భండారా వద్దభక్తులకు ముఖ్యమంత్రి స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈ సందర్భంగా సీఎం తెలిపారు. యాత్రా మార్గాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని, యాత్రికుల రాకపోకలను నిశితంగా పరిశీలిస్తున్నామని సీఎం పుష్కర్ సింగ్ ధామీ అన్నారు. స్థానికులు ఎంతో మందికి ఉపాధి కల్పించే ఛార్‌ధామ్ యాత్ర రాష్ట్రానికి జీవనాడి అని, ఏడాదంతా ఆధ్యాత్మిక యాత్రలకు అవకాశం కల్పించే ఉద్దేశంతో శీతాకాల తీర్థయాత్రలకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కేదార్‌నాథ్ ఆలయ అభివృద్ధి కోసం రూ.2 వేల కోట్లు కేటాయించామని, భక్తుల సౌకర్యార్థం గౌరీ కుండ్ నుంచి కేదార్‌నాథ్ వరకూ రోప్‌వే నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా ఆమోదం తెలిపిందని ఆయన తెలిపారు.

# బిఎల్వోలకు ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు




**న్యూఢిల్లీ, మే 16:** క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సంస్కరణలు చేపట్టింది. అందులో భాగంగా మొదటిసారి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓ)లకు ప్రామాణిక గుర్తింపు (ఐడీ) కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వివిధ రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఎదుర్కొంటున్న సవాళ్లను గమనించిన ఎలక్షన్ కమిషన్, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని ద్వారా బీఎల్ఓలకు, పౌరులకు మధ్య అంతరాలు తొలగించి, వారిని మరింత ఇంటరాక్టివ్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు బూత్ లెవల్ అధికారులను గుర్తించడానికి మన దేశంలో ఎక్కడా ప్రత్యేకమైన గుర్తింపు కార్డులు లేవు. అంతేకాదు ప్రస్తుతం సంబంధిత అధికారులు జారీ చేస్తున్న కార్డులపై ఈసీఐ పేరు కూడా ఉండడం లేదు. కానీ త్వరలో జారీ చేయనున్న గుర్తింపు కార్డ్ పై భాగంలో పోల్ ప్యానల్ లోగో, పేరు ఉంటుంది. దాని కింద బీఎల్ఓ ఫొటో, పేరు ఉంటుంది. అలాగే బీఎల్ఓవిధులు నిర్వర్తించే అసెంబ్లీ నియోజకవర్గం పేరు కూడా ఉంటుంది. కార్డ్ దిగువ భాగంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) సంతకం ఉంటుంది. బీఎల్ఓలకు ఈ ఐడీ కార్డులు ఉండడం వల్ల, పౌరులు వారిని సులభంగా గుర్తించగలుగుతారు. వారికున్న సందేహాలను అడిగి, తగిన సమాధానం పొందగలుగుతారు. దీని వల్ల ఎన్నికల కార్యకలాపాలు చాలా సులభతరం అవుతాయని ఓ సీనియర్ ఎన్నికల అధికారి చెప్పారు. కొన్నిసార్లు బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి పనిచేయాల్సి ఉంటుంది. కానీ వారికి సరైన గుర్తింపు కార్డు లేకపోవడం వల్ల ప్రజలు వారిని అనుమానిస్తున్నారు. దీని వల్ల క్షేత్రస్థాయిలో బీఎల్ఓలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకే వారికి ఐడీ కార్డులు జారీ చేయనున్నాం. దీని వల్ల వారిని గుర్తించడం సులభం అవుతుంది. పౌరులు కూడా వారితో నమ్మకం మాట్లాడడానికి అవకాశం ఏర్పడుతుందని ఆ సీనియర్ ఎన్నికల అధికారి తెలిపారు. బుధవారం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ సదస్సు జరిగింది. ఇందులో హరియాణా, దిల్లీకి చెందిన బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఈఆర్ఓ)లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ త్వరలో బీఎల్ఓలకు ఐడీ కార్డులు జారీ చేస్తామని చెప్పారు. కానీ స్పష్టమైన తేదీని మాత్రం వెల్లడించలేదు.

# పార్టీ రాజకీయానికి కేంద్ర బిందువు తుల్‌బుల్ నేవిగేషన్ ప్రాజెక్టు

## సిఎం ఒమర్, మాజీ సిఎం ముఫ్తీలమధ్య మాటల యుద్ధం



**న్యూఢిల్లీ, మే 16:** జమ్ముకాశ్మీర్‌లో పునరుద్ధరించతలపెట్టిన తుల్‌బుల్ నేవిగేషన్‌ప్రాజెక్టు ప్రస్తుత మాజీ సీఎంలమధ్య వివాదాన్ని రేకెత్తించింది. మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ ప్రస్తుతం సరిహద్దుల్లో నెలకొన్న హింస, ఉద్రిక్తత వాతావరణంలో ఈప్రాజెక్టు అత్యవసరంగా చేపట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అయితే మెహబూబా విమర్శలను ఓమర్ అబ్దుల్లా కొట్టివేసారు. మెహబూబా చౌకబారు పబ్లిసిటీకోసం వ్యాఖ్యలుచేస్తున్నారని, పాకిస్తాన్‌లో కొందరిని ప్రసన్నంచేసుకునేందుకే తుల్‌బుల్ నేవిగేషన్‌ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారని దుయ్యబట్టారు. జీలంనదికి అనుసంధానంగా ఉన్న వూలార్ సరస్సుకు ఈ నదీజలాలే అందుతాయి. బండిపోరా జిల్లాలో ఉన్న ఈ ప్రాజెక్టు 1987లో ప్రారంభించారు. ఆ తర్వాత 2007లో ప్రాజెక్టును పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిలిపివేసారు. ఇండస్ జలాల ఒప్పందం ఉల్లంఘిస్తోందని అప్పట్లో పాక్ తీవ్రస్థాయిలో విమర్శలుచేసింది. అయితే గతనెల 23వ తేదీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ నదీజలాల ఒప్పందం నిలిపివేస్తున్నట్లు భారత్‌ప్రకటించడంతో ఇపుడు ఈప్రాజెక్టును పునరుద్ధరించాలని సీఎం ఓమర్ అబ్దుల్లా నిర్ణయించారు. ఉత్తరకాశ్మీర్‌లో ఉన్న వూలార్ సరస్సుకు ఈ జలాలు వెళుతుంటాయి. ఇప్పటికే తుల్బుల్ నేవిగేషన్ బ్యారేజిలో సివిలపనులు చూస్తున్నామని ఇపుడు ఒప్పందంనుంచి బయటకు వచ్చేసామని అందువల్లనే పనులు ప్రారంభిస్తామని సీఎం తన సోషల్‌మీడియా పోస్టులో వివరించారు. ఈ ఒప్పందం కింద తూర్పుప్రాంతంలోని సట్లెజ్, బియాస్, రవి నదుల జలాలనుంచి 33 మిలియన్ ఎకరాలకు సరిపడే సాగునీరుసాలీనా అందుతుంది. పశ్చిమప్రాంతంలోని సింధు, జీలమ్, చీనాబ్ నదుల నీళ్లు 135 మిలియన్ యాకర్ ఫీట్‌జలాలు సాలీనా పాకిస్థాన్‌కు అందుతాయి. ఇపుడు హడావిడిగా మళ్లీ ప్రారంభించడాన్ని మెహబూబా ముఫ్తీ తీవ్రంగా విమర్శించారు. ఉద్రిక్తతలను మరింత పెంచడమేనన్నారు. కాల్పుల విరమణకు రెండుదేశాలు ముందుకు వచ్చిన సమయంలో ఈ ప్రాజెక్టు పనులు మళ్లీప్రారంభించడంపై ముఫ్తీ తీవ్ర విమర్శలు చేసారు. పిడిపి చీఫ్ మాట్లాడుతూ కేంద్ర పాలితప్రాంతంలో శాంతిసామరస్య వాతావరణం నెలకొని ఉంటుందని నదీజలాలను నిలిపివేయడం అమానవీయమని, అంతేకాకుండా ఈసమస్యను ద్వైపాక్షికంగానే చూడాలని, అంతర్జాతీయం చేయకూడదని వాదించారు. మాజీ సీఎం వ్యాఖ్యలపై అబ్దుల్లాకూడా తీవ్ర స్థాయిలో స్పందించారు. సరిహద్దులకు ఆవలి వైపున కొందరిని ప్రసన్నం చేసుకునేందుకే ముఫ్తీ ఇలాంటి చౌకబారు పబ్లిసిటీ వ్యాఖ్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తాను నిరంతరం ఈ ఒప్పందాన్ని వ్యతిరేకించానని, ఇపుడు కూడా వ్యతిరేకిస్తానన్నారు. జమ్ము కాశ్మీర్‌ప్రజలు ఈ నదీజలాలను వినియోగించుకునే హక్కులు కలిగి ఉన్నారరని, అందుకోసం తాను నిరంతరం కృషి చేస్తానన్నారు.

# జస్టిస్ బేలా త్రివేదిని విస్మరించిన సుప్రీం బార్



## వీడ్కోలు సభలో చీఫ్ జస్టిస్ చురకలు

**న్యూఢిల్లీ, మే 16:** భారత న్యాయవ్యవస్థలో పదవినుంచి దిగిపోతున్న ఒక మహిళా న్యాయమూర్తిని గౌరవించుకోవడంపై సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ వ్యవహరించిన తీరును సుప్రీం చీఫ్ జస్టిస్ బిఆర్‌గవాయి తప్పుపట్టారు. బార్ అసోసియేషన్ వైఖరిని తాను బహిరంగంగానే విమర్శిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. వాస్తవానికి జడ్జి బేలా త్రివేది జూన్ 2025 నాటికి పదవీ విరమణ పొందాల్సి ఉన్నప్పటికీ వ్యక్తిగత కారణాలపై ఆమె శుక్రవారం పదవి నుంచి దిగిపోయారు. దీనితో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అందరి సమక్షంలోను సెంట్రల్ హాలులో ఆమెకు వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేసారు.ఇదే సభలో సుప్రీం బార్ అసోసియేషన్‌నుంచి సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్ , ఉపాధ్యక్షులు రచనా శ్రీవాస్తవవ వంటి వారున్నారని, కానీ సుప్రీం బార్ అసోసియేషన్ జస్టిస్ బేలా త్రివేదిని పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు. బార్ ప్రతినిధులుగా కాకుండా వ్యక్తిగతంగా హాజరయిన కపిల్ సిబాల్, రచనా శ్రీవాస్తవలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. జస్టిస్ బేలా త్రివేది సుప్రీం చరిత్రలో 11వ మహిళా న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఎన్నో కీలక తీర్పులను వెలువరించారు. మరెన్నో కీలక తీర్పుల్లో సహ న్యాయమూర్తిగా కూడా కొనసాగారు. న్యాయమూర్తులందరూ ఒకే విధంగా ఉండరని, విభిన్న వ్యక్తిత్వాలతో ఉంటారన్నారు. జస్టిస్ త్రివేది ముక్కుసూటిగాను, నిజాయితీతో వ్యవహరించే న్యాయమూర్తి అని ఆమె కష్టపడిన తీరు, సమైక్యతావైఖరి ఆమెకు ఆస్తిగా నిలిచిందన్నారు. న్యాయవ్యవస్థకు జస్టిస్ బేలా త్రివేదిక ఒక స్థిరాస్తి వంటి వారన్నారు. 2021 ఆగస్టు 31న ఆమె సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతిపొందారు. ఒకేసారి తొమ్మిది మంది కొత్త న్యాయమూర్తుల్లో ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఆనాడు పదవీప్రమాణం చేసారు. వారిలో బేలా త్రివేది ఒకరు. జులై 1995లో ఆమె గుజరాత్‌లోని దిగువకోర్టు జడ్జిగా కెరీర్ ప్రారంభించారు. జూన్ 10వ తేదీ 1960లో గుజరాత్‌లోని పటాన్‌లో జన్మించిన జస్టిస్ త్రివేది న్యాయవాదిగా గుజరాత్‌లో పదేళ్లపాటు పనిచేసారు. సిటిసివిల్ అండ్ సెషన్స్ కోర్టుకు 1995లో న్యాయ మూర్తిగా వచ్చారు. హైకోర్టు రిజిస్ట్రార్ విజిలెన్స్‌గాను, గుజరాత్ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శిగాను పనిచేసారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా 2011లో నియమితులయ్యారు.

# యుద్ధ విరమణకు త్వరలో పుతిన్‌ను కలిసి ఒప్పిస్తా

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### శాంతిచర్చలకు హాజరుకాని పుతిన్



**దుబాయి, మే 16:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలో భేటీ కానున్నారు. స్వయంగా ఈ విషయాన్ని శుక్రవారం ట్రంప్ వెల్లడించారు. వీలైనంత త్వరగానే పుతిన్‌తో సమావేశం నిర్వహిస్తామని ట్రంప్ అన్నారు. అందుకోసం ముందునుంచే కసరత్తులు చేస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. శుక్రవారం తుర్కియే శాంతి చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హాజరుకాకపోవడం వల్లే ట్రంప్ ఈ భేటీకి ప్రయత్నాలు ప్రారంభించినట్లుగా తెలుస్తోంది. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ఈ శాంతి చర్చలను ట్రంప్ ఇటీవల ప్రతిపాదించారు. అందుకోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన బృందంతో హాజరయ్యారు. రష్యా కూడా తన ప్రతినిధి బృందాన్ని పంపింది. ప్రస్తుతం పశ్చిమాసియా పర్యటనలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ మాత్రం రష్యా అధ్యక్షుడు హాజరుకాకపోవడం తనను ఆశ్చర్యానికి గురి చేయలేదని తెలిపారు. తాను లేకుండా పుతిన్ అక్కడికి వెళ్లరని అన్నారు. అంతేకాకుండా పుతిన్‌ను తాను కలవనంత వరకూ ఏమీ జరగదని ట్రంప్ పేర్కొన్నారు. ఇక ఇస్తాంబుల్ చేరుకున్న జెలెన్‌స్కీ తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో భేటీ అయ్యారు. ఆ సమావేశం అనంతరం మాట్లాడుతూ పుతిన్ చర్చలకు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలు జరగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలని 30 రోజులు తాత్కాలిక కాల్పుల విరమణకు అమెరికా ప్రతిపాదించింది. దీనిపై ఉక్రెయిన్ ఆమోదం తెలపాగా, రష్యా మాత్రం తిరస్కరించింది. ఆ తర్వాత శాంతి చర్చలకు పిలుపునిచ్చాయి. దీనికి రష్యా అధ్యక్షుడు పుతిన్ గైర్హాజరయ్యారు. అయితే ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటే ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం ఆలోచనలను విరమించుకోవాలని పుతిన్ శాంతి చర్చలకు అంగీరించిన సందర్భంగా మరోసారి డిమాండ్ చేశారు. అలాగే, తాము ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాల నుంచి వారి బలగాలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఫిబ్రవరి 2022లో రష్యా ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో ఇరు దేశాలు సంధి కోసం ముసాయిదా ఒప్పందాన్ని చేసుకున్నాయని తెలిపారు. అప్పట్లో సంధి చర్చలు విరమించుకుంది తాము కాదని, ఉక్రెయిన్ వాటి నుంచి వైదొలిగిందని పేర్కొన్నారు.



## గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు:82 మంది మృతి

**టెల్అవీవ్, మే 16:** ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. గాజాపై వరుస దాడుల్లో టెల్అవీవ్ విరుచుకుపడుతోంది. తాజాగా దక్షిణ గాజాలోని ఖాన్‌యూనిస్, దేర్ అల్-బలా నగర శివార్లపై వైమానిక దాడులు చేసింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు కొనసాగిన ఈ దాడుల్లో 82 మంది మృతి చెందినట్లు అక్కడి ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతదేహాలను నాజర్ ఆస్పత్రికి తరలించారని ఆరోగ్య అధికారులు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యప్రాచ్యం పర్యటనలో ఉండగా గాజాపై ఇజ్రాయెల్ విస్తృతమైన దాడులకు పాల్పడడం గమనార్హం. కాగా తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎటువంటి ప్రకటనా చేయలేదు. బుధవారం టెల్అవీవ్ గాజాపై చేసిన దాడుల్లో 70 మందికిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు.

ఇటీవల అగ్రరాజ్యం మధ్యవర్తిత్వంతో హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో ఇరువర్గాల బందీలను విడుదల చేస్తున్నాయి. గాజాతో యుద్ధంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఇటీవల మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గాజాలో తమ యుద్ధాన్ని ఆపడానికి ఎటువంటి మార్గం లేదని స్పష్టం చేశారు. హుతీలు తమపై దాడులు జరపడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హుతీలను కచ్చితంగా ఎదురుదెబ్బ తీస్తామన్న ఆయన గతంలో ఐడిఎఫ్ చేసిన దాడులను గుర్తుపెట్టుకోవా లన్నారు. ఈసారి దాడులు మామూలుగా ఉండవని బాంబుల మోతలతో హోరెత్తుతాయని హెచ్చరించారు. దీంతో యుద్ధ విరమణ ఆశలు సన్నగిల్లాయి. గాజాలోని పాలస్తీనియనుల్లు ఖాళీ చేయాలని గతంలో ప్రతిపాదించిన ట్రంప్ గురువారం పశ్చిమాసియాలో మాట్లాడుతూ గాజాను అమెరికా అధీనంలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. గాజాలో కూలిన శిథిలాల కిందే ప్రజలు ఉంటున్నారని అది ఆమోద యోగ్యం కాదని పేర్కొన్నారు. గాజాకు సంబంధించి తనకు మంచి ఆలోచనలు ఉన్నా యని ఆ ప్రాంతాన్ని స్వేచ్ఛా మండలంగా మలచడానికి కృషి చేస్తానని అన్నారు.

## సౌదీ అరేబియాను షేక్ చేస్తున్న పాక్ బిచ్చగాళ్లు!



**ఇస్లామాబాద్, మే 16:** 'మేము ఏ మిత్రదేశానికి వెళ్లినా అడుక్కోవడానికే వచ్చామన్నట్లు చూస్తారు' ఇది దాదాపు మూడేళ్ల క్రితం ప్రస్తుతం పాక్ పిఎం షెహబాజ్ షరీఫ్ ఓ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు. ఆయన ఏ ఉద్దేశంతో అన్నారో గానీ దాని మిత్ర దేశాలను మాత్రం పాక్ బిచ్చగాళ్లు హడలెత్తిస్తున్నారు. యాచకులను ఎగుమతి చేసే దేశంగా అయాచిత అపకీర్తిని పొందింది. తాజా సౌదీ అరేబియాలో పాకిస్థాన్‌కు చెందిన 5,033 మంది పాక్ బిచ్చగాళ్లను వారి స్వదేశానికి బలవంతంగా పంపించింది. మరో 369 మందిని ఇతర దేశాలకు అప్పగించింది. ఈ విషయాన్ని పాక్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహసిన్ నక్వీ ఇటీవల నేషనల్ అసెంబ్లీ (ఆ దేశ పార్లమెంట్)లో వెల్లడించిట్లు డాన్ పత్రిక కథనంలో పేర్కొనడం గమనార్హం.

**సంపన్న ప్రావిన్స్‌ల నుంచే అత్యధిక మంది:** ఇక 2024 జనవరి నుంచి తమ మిత్ర దేశాలు తరిమేసిన పాక్ బిచ్చగాళ్ల సంఖ్యను కలుపుకొంటే ఇది 5,402 చేరుతుందని వెల్లడించారు. వీరిని సాగనంపిన వారిలో సౌదీతోపాటు ఇరాక్, మలేసియా, ఒమన్, ఖతార్, యుఎఇ ఉన్నాయి. ఈ మొత్తంలో సింధ్ ప్రావిన్స్‌కు చెందిన వారు 2,795 మంది, పంజాబ్ ప్రావిన్స్ నుంచి 1,437,కెపి నుంచి 1,002, బలోచిస్థాన్ 125, పిఒకె 33, మరో 10మంది ఇస్లామాబాద్ నుంచి ఉన్నారు.

**వీసా సమస్యలు:** పాక్ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఏప్రిల్ 19న సియాల్‌కోట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ దేశంలో యాచన ఓ పెద్ద సమస్యగా మారిందన్నారు. దీని వల్ల దేశాలు వీసాలు జారీ చేయడం లేదని చెప్పారు. దేశంలో దాదాపు రెండుకోట్ల మంది యాచకులు ఉన్నట్లు చెప్పారు.వీరి నెలసరి ఆదాయం 4,200కోట్లపాకిస్థానీ రూపాయలు అని ఆయనే వెల్లడిం చారు. సియాల్‌కోట్ నుంచి వారిని రెండుసార్లు ఏరివేస్తే మళ్లీ తిరిగి వచ్చారన్నారు. 2023లో పాక్ సెనెట్ ప్యానెల్ ఎదుట నాటి ఓవర్సీస్ మినిస్ట్రీ సెక్రటరీ జుల్ఫీకర్ హైదర్ మాట్లాడుతూ విదేశాల్లో అరెస్టు అవుతున్న 90 శాతం బిచ్చగాళ్లు పాక్‌కు చెందినవారని వెల్లడించారు. చాలామంది యాత్రికుల వీసాలను తీసుకొని సౌదీ, ఇరాన్, ఇరాక్ వంటి ప్రదేశాలకు వెళ్లి అడుక్కుంటున్నట్లు చెప్పారు. వీరికి జపాన్ కొత్త కేంద్రంగా మారుతోందని నాడు వెల్లడించారు.

## ఇండియా కూటమిలో అనిశ్చితి వాస్తవమే: కాంగ్రెస్ నేత చిదంబరం



**న్యూఢిల్లీ, మే 16:** బిజెపి అన్ని విధాలుగా బలంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కొనియాడారు. అదే సమయంలో విపక్ష ఇండియా బ్లాక్ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తం చేశారు. కూటమిలో అనిశ్చితి నెలకొన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. దీనిపై బిజెపి వ్యంగ్యాస్త్రాలు విసిరింది. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చిదంబరం మాట్లాడుతూ 'ఇండియా బ్లాక్ చెక్కుచెదరకుండా ఉంటే చాలా సంతోషం. కానీ అది బలహీనంగా కనిపిస్తోంది. కానీ అది పుంజుకోవడానికి సమయం ఉంది. అదే బిజెపి విషయానికొస్తే వ్యవస్థీకృతంగా బలంగా ఉంది. నా అనుభవం, చరిత్ర చూస్తే ప్రతి విభాగంలోనూ పటిష్టంగా ఉన్న బిజెపి లాంటి పార్టీ మరొకటి లేదు. ప్రతి వ్యవస్థను నియంత్రించగల, స్వాధీనం చేసుకోగల శక్తి కలిగి ఉంది. అలాగే దానిని సవాలు చేయాలంటే విపక్ష కూటమి అన్ని విభాగాలను మెరుగుపరచుకోవాలి. ఈ పరిస్థితుల్లో 2029 ఎన్నికలు అత్యంత కీలకం' అని చిదంబరం అభిప్రాయపడ్డారు. దీనిపై బిజెపి స్పందించింది. వరుస ఓటములు కాంగ్రెస్‌ను బాధించాయని ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. 'చిదంబరం అంచనా ప్రకారం విపక్ష కూటమిలో అనిశ్చితి ఉంది. బిజెపి బలమైన పార్టీ. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదని రాహుల్‌గాంధీ అత్యంత సన్నిహితులకు కూడా తెలుసు' అని మరో నేత ప్రదీప్ బండారీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

# నకిలీ విత్తన వ్యాపారులపై ఉక్కుపాదం

## వ్యవసాయ, పోలీసు విభాగాలు ఉమ్మడిగా దాడులు చేయాలి

### కలెక్టర్లు, ఎస్పీల, కమిషనర్లతో మాట్లాడాలని

### ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించిన సిఎం రేవంత్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 16:** వానకాలం పంటల సాగుకు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడేన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, రైతులను మోసం చేసే కంపెనీలు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వానాకాలం పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాను అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దులు అన్ని చోట్ల టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచాలని చెప్పారు. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సీఎం హెచ్చరించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు, ఎక్కడ నిల్వలులున్నాయి? ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సీజన్లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్లో ఉన్నాయని చెప్పారు. ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రైతులకు భరోసానిచ్చారు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలన్నారు. అందుకు అనుకూలంగా సరైన అదనులో పంటలు వేసుకోవాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు. ప్యాక్డ్ విత్తనాలు తప్ప లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని, విత్తన పాకెట్లు కొనేటప్పుడు తప్పకుండా బిల్లును, పాకెట్ను పంట కాలం ముగిసేంత వరకు భద్రపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నకిలీ కంపెనీలు, కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖకు ఆదేశించారు. సిఎం వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# 50 ఇంజినీరింగ్ కాలేజీల ఫీజులు తగ్గే అవకాశం!

## మళ్లీ కాలేజీ యాజమాన్యాలతో ఎఎఫ్ఆర్‌సి ముఖాముఖీ చర్చలు

### భారీగా ఫీజు పెంపు ప్రతిపాదన నేపథ్యంలో మళ్లీ చర్చలు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల 2025-28 బ్లాక్ పిరియడ్ ట్యూషన్ ఫీజుల్లో మార్పులు జరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల ట్యూషన్ ఫీజు నిర్ధారణ కోసం తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ(ఏఎఫ్ఆర్‌సీ) దరఖాస్తులను స్వీకరించి.. కాలేజీ యాజమాన్యాలు సమర్పించి ఆదాయ, వ్యయాలను పరిశీలించి.. ముఖాముఖీ చర్చలు జరిపిన తరువాత ప్రభుత్వానికి ఏఎఫ్ఆర్‌సి ట్యూషన్ ఫీజులపై ప్రతిపాదనలు పంపించింది. ప్రతిపాదనల్లో భాగంగా మినిమమ్ ఫీజును రూ. 45వేలుగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ. 2.94 లక్షలుగా ప్రతిపాదించినట్టు తెలిసింది. ముఖాముఖి విచారణ అనంతరం రాష్ట్రంలోని సుమారు 157 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజులను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మంచి పేరున్న టాప్-20లోని కాలేజీలు.. ఇప్పటికే రూ. లక్షకి పైగా ఫీజు ఉన్న కాలేజీలు తమ ట్యూషన్ ఫీజును వంద శాతం పెంచాలని పేర్కొన్నాయి. కొన్ని కాలేజీలు 50 శాతం వరకు పెంచాలని పేర్కొంటు తమ ప్రతిపాదనలను ఏఎఫ్ఆర్‌సీకి సమర్పించాయి. 2025-26 విద్యా సంవత్సరం నుండి ప్రారంభమయ్యే మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు 50 శాతం నుండి 100 శాతం వరకు ఫీజుల పెంపును కోరుతూ కాలేజీ యాజమాన్యాలు ఏఎఫ్ఆర్‌సీకి ప్రతిపాదనలు సమర్పించాయి. అందులో భాగంగా సిబిఐటి కాలేజీ తన ఫీజును సంవత్సరానికి రూ.1.65 లక్షల నుండి రూ.2.94 లక్షలకు పెంచాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఫీజుకి దాదాపు రెట్టింపు ప్రతిపాదన. ఏఎఫ్ఆర్‌సీకి ప్రతిపాదించిన ఫీజుల్లో ఇదే అత్యధిక ఫీజుగా తెలుస్తోంది. వీజేఐఈటీ ప్రస్తుతం సంవత్సరానికి రూ.1.35 లక్షల ఫీజు ఉండగా.. దానిని కాస్త రూ.2.84 లక్షలకు పెంపును ప్రతిపాదించింది. రాష్ట్రంలోని టాప్ 15 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రతిపాదనల ప్రకారం.. 5 కాలేజీలు ట్యూషన్ ఫీజును రూ.2 లక్షలకు పైగా ప్రతిపాదించగా.. మిగిలిన సంస్థలు సంవత్సరానికి రూ.1.50 లక్షల కంటే ఎక్కువ ఫీజును ప్రతిపాదించాయి. సుమారు 60 కళాశాలలు రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల మధ్య ఫీజును కోరినట్టు తెలిసింది. కాలేజీ యాజమాన్యాలు సమర్పించిన ఆదాయం, వ్యయాల తుది ఆడిట్ స్టేట్‌మెంట్‌లు, బ్యాలెన్స్ షీట్‌లతోపాటు.. గత సంవత్సరాల అభివృద్ధి అవసరాలు, జీతాలు, మౌలిక సదుపాయాలపై చేసిన ఖర్చు వివరాల ఆధారంగా కాలేజీలకు ట్యూషన్ ఫీజులను ఏఎఫ్ఆర్‌సీ ప్రతిపాదించింది. అయితే ఏఎఫ్ఆర్‌సి కొన్ని కాలేజీలకు ప్రతిపాదించిన ఫీజులు అసాధారణంగా ఉన్నాయని ప్రభుత్వం భావించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఫీజు కంటే 100 శాతానికి మించి పెరిగిన కాలేజీల ఫీజులపై పునరాలోచన చేయాలని.. మరోసారి కాలేజీలు సమర్పించిన ఆడిట్ రిపోర్టులను పరిశీలించి ఫీజుల పెంపు ప్రతిపాదనలను సమర్పించాలని సూచించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం తరువాత మరోసారి ఏఎఫ్ఆర్‌సి సమావేశమై సుమారు 50 కాలేజీలు సమర్పించిన ఆడిట్ రిపోర్టులను పరిశీలించడానికి కాలేజీలకు షెడ్యూల్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్ల టెండర్ గడువు పెంచాలి

### మంత్రి సీతక్కకు పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** తెలంగాణవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్లకు కావాల్సిన గుడ్లను తామే సరఫరా చేస్తామని, అందుకోసం ప్రస్తుత టెండర్ల గడువును పొడిగించాలని పౌల్ట్రీ ఫామ్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగంగా శుక్రవారం సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి నారాయణరెడ్డి కలిశారు. గత బిఆర్ఎస్ హయాంలో కొందరికి లబ్ధిచేకూర్చడం కోసం సెంట్రలైజ్డ్ టెండర్లను పిలిచారని, దీంతో తమకు సరఫరా చేసేఅవకాశం రాలేదని మంత్రి ఎదుట వారు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరగాలంటే ప్రస్తుతంఉన్న టెండర్ విధానాన్ని రద్దు చేసి, పాత జిల్లాల వారీగా టెండర్లను పిలవాలని కోరారు. పౌల్ట్రీ పౌల్ట్రీ అసోసియేషన్ ప్రతినిధులకు టెండర్లుదక్కాలంటే ఇప్పుడు ఉన్న నిబంధనలను సడలించి కొత్తగా టెండర్లు పిలవాల్సి ఉంటుందని, ప్రస్తుత టెండర్లను రద్దు చేస్తే ఎదురయ్యే సమస్యలపై న్యాయసలహా మేరకు తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

# ఉన్నతంగా యోచించాలి.. పని తీరులో వేగం పెంచాలి

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని, సమాచారాన్ని సమన్వయంతో పాలుపంచుకుంటే ఊహించని రీతిలో ప్రగతి కనబడుతుందని, డ్రగ్ కంట్రోల్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ షానవాజ్ ఖాసీం అన్నారు. ఎక్సైజ్, డ్రగ్స్ కంట్రోల్ అధికారుల సమన్వయ సమావేశం అబ్కారీ భవన్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణహాని, మత్తు కలిగించే నిషేధి మందుల వినియోగం, డ్రగ్స్, గంజాయి, ఇతర రకాల డ్రగ్స్ వినియోగంతో యువత ఎంతోనష్టపోతున్నారని, ఈ విషయంలో ఏ శాఖ పనులు వారుచేసుకుంటూ, 2 శాఖలు కలిసి యువతను మత్తులోకి దింపుతున్న వాటిపై ప్రత్యేక దాడులు నిర్వహించడంతో పాటు సమాచారాన్ని పంచుకుంటే బాగుంటుందన్నారు.

ప్రధానంగా రెండు శాఖలు కలిసి పనిచేసేందుకు ఉన్నఅవకాశాలు ఏమిటి అనే అంశంపై చర్చించుకుని కలిసి దాడులు చేయడానికి ప్రాంతాలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. రెండు విభాగాల్లో సమాచార వ్యవస్థను వృద్ధి చేసుకోవడానికి నలుగురితో కూడిన కామన్ ఇంటిలీజెన్స్ టీమ్‌ను ఏర్పాటు చేసకోవాలని, ఇండస్ట్రీయల్, ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, జాయింట్ ట్రెయినింగ్, రైడ్స్, వాట్సాప్ గ్రూప్, ఇంటర్‌నెట్‌లో జరుగుతున్న డ్రగ్, డ్రగ్స్ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి పెట్టా లని సూచించారు. ఈ కార్యాచరణకు ఒక రూట్‌మ్యాప్‌ను బుక్‌లెట్ రూపంలో తీసుకు రావాలన్నారు.

ఈ సమన్వయ సమావేశంలో ఎక్సైజ్ శాఖ జాయింట్ డెరెక్టర్ సయ్యద్ యాసిన్ ఖురేషి, డ్రగ్ కంట్రోల్ జాయింట్ డెరెక్టర్ రామ్‌ధన్, డిప్యూటీ కమిషనర్లు కెబి శాస్త్రీ, పి.దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆస్పత్రిని సందర్శించిన జాతీయ వైద్య బృందం



గాంధీ ఆస్పత్రిలో జాతీయ వైద్య బృందం

### ఆభా ఐడి ద్వారా రోగుల రికార్డులు డిజిటల్ రూపంలో నమోదు

### స్కాన్ అండ్ షేర్ ద్వారా వేగవంతమైన ఒపి

**హైదరాబాద్ (సికిందరాబాద్), మే 16, ప్రభాతవార్త:** ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ వర్క్‌షాప్‌లో భాగంగా, 18 రాష్ట్రాల నుండి రాష్ట్ర నోడల్ అధికారులు శుక్రవారం సికిందరాబాద్ గాంధీ ఆసుపత్రిని సందర్శించారు. గాంధీ ఆసు పత్రిలో రాష్ట్ర స్థాయి సౌకర్యాలు, రికార్డుల డిజిటల్ నిర్వహణ సౌకర్యాలు, నూతనంగా వేగవంతమైన ఒపిడి సేవలు, స్కాన్ అండ్ షేర్ విధానం, ల్యాబ్‌లో డిజిటల్ సేవలు అందించే విషయాలను గాంధీ హాస్పిటల్ నోడల్ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి వివరించారు. క్రాస్ లెర్నింగ్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన వారికి గాంధీ ఆసుపత్రిలో అందుతున్న సేవలను గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమారి, సియస్ఆర్‌యంఒ డాక్టర్ శేషాద్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్యులు, నోడల్ అధికారులు వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల రికార్డులు డిజిటల్ చేయడం ద్వారా వారి ఆరోగ్య వివరాలు వారి మొబైల్ నెంబర్ ద్వారా వారి అకౌంట్‌లో ఉంటాయని, దీని ద్వారా ల్యాబ్ రిపోర్టులు జీవితాంతం అందుబాటులో ఉంటాయని తెలిపారు. 100 డిజిటల్ చేయాలని ఇప్పటికే పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. స్కాన్ అండ్ షేర్ ద్వారా త్వరగా ఒపి సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జాతీయ స్థాయి మెడికల్ బృంద సభ్యులు డాక్టర్ పంకజ్ అరోరా, సౌరభ్ సింగ్, రితిక, బబిత, అభ్యుదయ్ గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమారి, సి యస్ఆర్‌యంఒ డాక్టర్ శేషాద్రి, ఒపి ఆర్ఎంఒ డాక్టర్ రజని, నోడల్ ఆఫీసర్ ఫర్, అభా డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ఎంఒలు డాక్టర్ మీనాక్షి, డాక్టర్ నజీమ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ యోగి, డాక్టర్ నవీన్, డాక్టర్ సరిత, యూసుఫ్, కిరణ్, జగదీష్, చిరంజీవి, సుప్రియ, నరేష్, రాష్ట్ర బృందం దివ్య, డాక్టర్ విమల, సురేష్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన నోడల్ అధికారులు ఉన్నారు.




శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

# తెలంగాణ మహిళల ఆత్మగౌరవం ఏం కాలేదు

### కోడిగుడ్డుపై ఈకలు పీకొద్దు: ఎంపి చామల

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** రామప్పగుడి దగ్గర అత్యుత్సాహంతో ఎవరో మిస్‌వరల్డ్ పోటీదారు కాళ్లు కడిగి ఉండొచ్చు.. దానికి తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ఏదో జరిగినట్లు కోడిగుడ్డు పైన ఈకలు పీకినట్లు బిఆర్ఎస్ రాజకీయం చేస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరో పించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ అనబడే సైకో రాము కల్లు తాగిన కోతులాగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. తెలంగాణ మహిళ ల ఆత్మ గౌరవం ఏమైంది అంటూ సోనియాగాంధీ కి ట్వీట్ చేయడం ఏంటి అని నిలదీశారు. పదేండ్లు వాళ్ళ ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప ఏ ఇంటి ఆడబిడ్డ గురించి మాట్లాడలేదు అని గుర్తుచేశారు. అలాంటి కేటిఆర్ మహిళల ఆత్మ గౌరవం గురించి మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీది అని జగిత్యాల సంఘటనను గుర్తు చేసుకున్నారు. జనాన్ని తప్పుదోవ పట్టించాలని కేటిఆర్ రోజు ఎదో ఒకటి తప్పుడు ప్రచారం చేస్తుండని అన్నారు. బిఆర్ఎస్ అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తుంటే ,కేటిఆర్ డిస్టర్బ్ చేస్తున్నాడని అన్నారు. .గతంలో దండుకున్న వందల కోట్ల రూపాయల తో కొన్ని యూట్యూబ్ చానల్స్‌తో కేటిఆర్ తప్పుడు ప్రకారం చేస్తున్నారు. మార్ఫింగ్ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొండా సురేఖ ఏ సందర్భంలో మాట్లాడారో ఆమె సమాధానం చెప్పుకుంటారని అన్నారు.

**తెలంగాణ మహిళతో కాళ్లు కడిగించడం అవమానకరం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడమే అవమానకరమైన విషయమని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. మిస్ వరల్డ్ పోటీదారులు వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా మొత్తం పూరి గుడిసెలు ధ్వంసం చేసి చిరు వ్యాపారులు లేకుండా చేసే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పాల్పడిం దన్నారు. అందాల పోటీలకు హాజరైన మహిళ కాలు కడిగి తుడిచే కార్య క్రమానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడాన్ని జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు.

# శాసన మండలి భవన పునరుద్ధరణ పనులను పరిశీలించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 16:** తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో ఉన్న శాసన మండలి భవన పునరుద్ధరణ పనులను పరిశీలించారు. తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డా.వి.నరసింహా చార్యులు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, అగాఖాన్ సంస్థ అధికారులు, అలాగే సంబంధింత అధికారులతో కలిసి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని , రానున్న సమావేశాలు ఈ భవనంలో జరపాలనే దృఢసంకల్పంతో రాష్ట్ర సర్కారు ఉందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. అలసత్వం వదిలి ఆర్ అండ్ బి శాఖ అధికారులు, అగాఖాన్ సంస్థ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేసి, నిర్ణీత సమయానికి భవనాన్ని అప్పగించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# హరీశ్‌రావుతో కెటిఆర్ చర్చల మతలబు మాకు తెలియాలి

### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** హరీశ్‌రావు ఇంటికి వెళ్లి కెటిఆర్ చేసిన చర్చల మతలబు మాకు తెలియాల్సిందే అంటూ ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్‌లో ముసలం మొదలైందని కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని అన్నారు. పార్టీ ప్లీనరీ సమయంలో హరీశ్ రావుకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆయనకు అంత సీను లేదని చెప్పారని నాయక్ వివరించారు. ఎప్పుడూ లేని విధంగా హరీశ్‌రావు ఇంటికి కేటీఆర్ వెళ్లాడనిరెండు గంటలకు పైగా హరీశ్‌రావును చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లలేదని రాంచంద్రనాయక్ గుర్తుచేశారు హరీష్ రావు ఇంట్లో గతంలో పంక్షన్ జరిగినా కేటీఆర్, ఆయన కుటుంబం దూరంగా ఉందని అన్నారు.

ఇప్పుడు సడన్ గా హరీష్ రావు పైన కేటీఆర్ కు ఎందుకంత ప్రేమ వచ్చిందో చెప్పాలని నిలదీశారు. హరీష్ రావు కొత్త పార్టీ పెడుతున్నాడని ప్రచారం జరుగుతోంది. కల్వకుంట్ల కవిత ఇప్పటికే పార్టీ కి వ్యతిరేకంగా బహిరంగంగా విమర్శలు చేస్తున్నారని గుర్తుచేశారు. తన మీద దుష్పచారం జరుగుతోందని, దాని వెనుక ఎవరు న్నారో తనకు తెలుసునని కవిత అంటోందని చెప్పారు. మొత్తంగా కల్వ కుంట్ల కుటుంబసభ్యుల మధ్య ఆధిపత్యపోరు జరుగుతోందని తెలిపారు. రాజకీయ ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

# సమాచార శాఖ కమిషనర్లలో ఒక్క బిసికి ఇవ్వరా!

### మిగిలిన మూడు ఆ వర్గాలకే ఇవ్వాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య లేఖ

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** సమాచార శాఖకు చీఫ్ కమిషనర్‌తో సహా ఆరు మంది కమిషనర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందులో ఒక్కరికి కూడా బీసీలకు చెందిన వారిని నియమించలేదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మిగిలిన మూడు కమిషనర్ పోస్టులన్నింటిని బీసీలతో నియమించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఎంకు ఆయన లేఖ రాశారు. 'ఒకవైపు ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతంకు రిజర్వేషన్లు పెంచుతామని అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారు. ఇంకొక వైపు రాహుల్ గాంధీ జనాభా ప్రకారం బీసీలకు పదవులు ఇస్తామని వరుస ప్రకటనలు ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జనాభా గణనను తెలంగాణ బీసీ ఎజెండా దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తూ తెలంగాణ మోడల్ ఆదర్శంగా తీసుకున్నారంటూ రాజీవ్ గాంధీ ప్రకటననలను గుప్పిస్తున్నారు. తెలంగాణ మోడల్ అంటే ఇలా ఒక్కరికీ కూడా పదవిలో కూడా బీసీలకు ఇవ్వకపోవటమేనా అని కృష్ణయ్య ప్రశ్నించారు.

ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర బిసి వ్యతిరేక చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుంది. మంత్రివర్గంలో కేవలం ఇద్దరికీ ఇచ్చి అవి ప్రాధాన్యత లేని శాఖలు ఇచ్చి అవమానపరిచారు. కార్పొరేషన్ చైర్మన్ ఇతర నామినేటెడ్ పదవులలో బీసీలకు 20 శాతం పదవులు కూడా ఇవ్వలేదు. అధికారుల నియమకాలలో బిసిలకు అన్యాయం చేస్తున్నారు. ఇక స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లను 42 శాతం రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి జీవో తీసి అమలు చేయకుండా కేంద్రం మీద నెడుతూ తప్పించుకోవాలని చూస్తున్నారు. పేరుకు ప్రచారం కోసం బీసీ అజెండా వాడుకుంటున్నారు. కానీ ఆచరణలో అగ్రకులాలకు పదవుల ఇస్తూ బీసీలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అలాగే కాలేజీ విద్యార్థులకు ఫీజుల బకాయిలు చెల్లించకుండా వారు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు.

కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులు 10 శాతం కమిషన్లు తీసుకొని చెల్లిస్తున్నారు. కానీ రాష్ట్రంలో లక్షమంది విద్యార్థులకు ఒక కాంట్రాక్టర్లకు ఇచ్చే బిల్లుకు ఇచ్చే మొత్తంతో 14 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజులు ఇవ్వవచ్చునని అన్నారు. బహిరంగంగా ఇంత అవినీతి పాల్పడుతూ కమిషన్లు తీసుకుంటున్న అవినీతి చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం విద్యార్థులకు ఇన్ని ఇబ్బందులు పెడుతున్న ప్రతిపక్షాలు నోరు మెదపడం లేదని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 226

**హైదరాబాద్ (బేగంపేట) మే 16, ప్రభాతవార్త:** మహాత్మాజ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 226దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 64దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 54దరఖాస్తులు, హోంశాఖకు సంబంధించి 20దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్లకోసం 37దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 51దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు. వివిధ కారణాలతో విధుల నుంచి తొలగించిన ఆర్టీసీ ఉద్యోగులు తమను తిరిగి విధులలోకి తీసుకోవాలని ,త్రిసభ్య కమిటీలో తుది నిర్ణయం తీసుకోవాలని కోరగా అందుకు తగిన నిర్ణయం త్వరలోనే తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్యలు వారికి వివరించారు. సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.జి.చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్యలు దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

# మంత్రివర్గ విస్తరణ సిఎంకు ఇష్టం లేదు

### రాష్ట్రం దివాలా అనే సిఎం వ్యాఖ్యలపై స్పందించని డిప్యూటీ సిఎం భట్టి

### వారిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి

### మంత్రుల మధ్య కొరవడిన సమన్వయం

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్య

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణను అడ్డుకుంటున్న సూత్రధారి, కుట్రదారుడు సిఎం రేవంత్‌రెడ్డేనని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో మహేశ్వరరెడ్డి మాట్లాడారు. రాష్ట్రం దివాలా తీసిందని ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ డిప్యూటీ సిఎం భట్టి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయంలో సిఎం తీరును తప్పు పడుతూ బిఆర్ఎస్, బిజెపి ముఖ్య నేతలు మాట్లాడినప్పటికీ, వారికి కౌంటర్ ఇవ్వడానికి భట్టి విక్రమార్క ఏనాడు ఆసక్తి చూపలేదు. దీన్నిబట్టి సిఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సిఎం భట్టికి తీవ్ర విభేదాలున్నాయని స్పష్టమవుతుందన్నారు. ఉద్యోగుల విషయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై మంత్రివర్గంలో విభేదాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీని పెట్టి సంక్షేమ పథకాలు, ఉద్యోగుల బకాయిలు ఎగ్గొట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. ఆర్థిక ఎమర్జెన్సీ స్టేట్‌మెంట్‌ను మిగతా మంత్రులు వ్యతిరేకిస్తున్నారని, ఈ నేపథ్యంలో మంత్రిమండలి రెండుగా చీలిందంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రికి హైకమాండ్‌కు గ్యాప్ కంటిన్యూ అవుతుందన్నారు. ఇటీవల రాహుల్‌గాంధీ హైదరాబాద్ వచ్చినప్పుడు రేవంత్‌ను పలకరించలేదని తెలిపారు. ఆర్థిక ఎమర్జెన్సీ పెట్టాలనే ఆలోచనతోనే చీఫ్ సెక్రటరీగా రామకృష్ణరావు నియామకం జరిగిందని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వికారాబాద్ సభలో మాట్లాడుతూ తెలంగాణలో కుటుంబాలను మించి రేషన్ కార్డులు ఉన్నాయిని, రాష్ట్రంలో కోటి పది లక్షల కుటుంబాలు ఉంటే కోటి పాతిక లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని ఉచితాలు తగ్గించాలని పేర్కొన్నారు. కేబినెట్ మంత్రుల్లో సమన్వయం కొరవడిందన్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని సీనియర్ నేత జానారెడ్డిచే కాంగ్రెస్ హైకమాండుకు లేఖ రాయించడం, మాదిగలకు, లంబాడాలకు క్యాబినెటులో స్థానం కల్పించాలంటూ సంబంధిత ఎమ్మెల్యేల నుంచి తాను స్వయంగా వినతిపత్రం తీసుకోవడమే కాకుండా హైకమాండుకు రిప్రజంటేషను పంపడం వంటి వ్యూహాలను అమలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి మంత్రి పదవి విషయంలో ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య విభేదాలు వచ్చేలా వ్యవహరించడం వంటి ఎత్తుగడలన్నీ సిఎం రేవంత్ రెడ్డి వేసిన స్కెచులేనని పేర్కొన్నారు. బిసిలకు క్యాబినెటులో ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. మంత్రివర్గ విస్తరణ జరిగితే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఫార్ములా ప్రకారం మరో నాలుగు బెర్తులు ఇవ్వాల్సి ఉంటుంది. బిసిల నుంచి పొన్నం ప్రభాకర్‌కు డిప్యూటీ సిఎం పదవి, మాదిగల నుంచి దామోదర రాజనర్సింహకు కూడా డిప్యూటీ సిఎం పదవి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ దృష్ట్యా భట్టి విక్రమార్క కూడా మంత్రివర్గ విస్తరణకు అడ్డు పడుతున్నారు. తనకు అనుకూలమైన వారికి మంత్రి పదవులు వచ్చే అవకాశం లేకపోవడం, కొత్త మంత్రులు వస్తే తన వద్ద ఉన్న హోంశాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి శాఖ, విద్యా శాఖ ఇంకా ఇతర శాఖలను వదులుకోవడం సిఎం రేవంత్‌కు ఇష్టంలేదు. అందుకే విస్తరణకు వ్యూహాత్మకంగా అడ్డుపడుతూ నెపం హైకమాండుపై నెడుతున్నారన్నారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత సిఎం మార్పు గురించి ఆలోచిస్తామని హైకమాండ్ పెద్దలు సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో చెప్పిందట, అందుకే వారిద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, హైడ్రా, మూసి ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, కొడంగల్ భూముల సేకరణ వంటి అంశాల్లో సిఎం రేవంత్‌రెడ్డి లోపాలు, తప్పిదాలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి తీరుపై అసంతృప్తితో ఉన్న అంశాలపై హైకమాండుకు నివేదికలు పంపుతున్నారట అని ఏలేటి పేర్కొన్నారు.

# ఇది ఓల్డ్‌సిటీ కాదు.. ఇదే ఒరిజనల్ సిటీ

## హాజ్ యాత్రికులకు వీడ్కోలు కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 16:** తెలంగాణలోని మైనారిటీ వర్గాల అభివృద్ధి,విద్య,ఉపాధి రంగాల్లో అవసరమైన మేరకు ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ముస్లింలలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల్లో వారి జనాభా మేరకు అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. హాజ్ యాత్రికుల సౌకర్యార్థం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని మామిడిపల్లిలో వసతి భవనం (రూబత్) నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హాజ్‌కు వెళ్లి ప్రార్థనలు చేయాలని అనుకుంటారని, ఈసారి ప్రభుత్వానికి 6వేల దరఖాస్తులు అందితే వాటన్నింటినీ ఆమోదించినట్లు చెప్పారు. హాజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతూ విమానాశ్రయంకు బయలుదేరిన బస్సులను నాంపల్లి హాజ్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఎం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ యాత్రికులకు శుభాభినందనలు తెలిపారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి హాజ్‌కు వెళ్లే హాజీల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారని, ప్రభుత్వం అందుకు అన్ని విధాలుగా సహకరించిందని చెప్పారు. ఈ వేదిక నుంచి ఎంపీ అసదుద్దీన్ ఓవైసి లేవనెత్తిన అంశాలను రేవంత్‌రెడ్డి ప్రస్తావిస్తూ ఇది ఓల్డ్ సిటీ కాదు, ఇదే ఒరిజనల్ సిటీ అని ఇది వరకు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఒరిజనల్ సిటీ అభివృద్ధి కోసం ఎంపీ అడిగిన దాని కన్నా ఎక్కువగానే దాదాపు రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మెట్రో విస్తరణ,. రోడ్ల నిర్మాణం, మిరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జీ నిర్మానం వంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. హాజ్‌కు వెళ్తున్న యాత్రికులు ఈ దేశం కోసం, ఈ రాష్ట్రం కోసం ప్రజల శాంతియుత జీవనం కోసం అల్లాను ప్రార్థించండీ అని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు,హాజ్ కమిటీ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# పసుపు రైతుకు న్యాయమైన ధర లేదు

## రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** పసుపు బోర్డు వచ్చినా రైతుకు న్యాయమైన ధర అందడం లేదని రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. పసుపు తీయడం, ఉడకపెట్టడం, పాలిష్ చేయడంలో యంత్రపరికరాలు అవసరం ఉంటుందని, వీటిని అందించడంలో కేంద్రానిదే బాధ్యతని శుక్రవారం ఒక ప్రకటనలో చెప్పారు. అలాగే కురుకుమిన్ శాతం ఎక్కువగా వుండే విత్తనాన్ని అందించాలని సూచించారు. ములుగులో అమాయక రైతులను మోసం చేసిన ఘటన ఈ మధ్యకాలంలో వెలుగుచూసిందన్నారు. నిర్దిష్టమైన విత్తన చట్టం త్వరలో రాబోతుందని వెల్లడించారు. రాష్ట్రంలో కల్తీ విత్తనం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పసుపు పంటకు యాంత్రీకరణ అవసరమని, దానికోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవసాయం జరుగుతోందన్నారు. విత్తనోత్పత్తి కోసం చాలా కంపెనీలు రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు కానీ ఎక్కడ అగ్రిమెంట్స్ పేపర్స్ ఉండడం లేదని చెప్పారు. సీడ్ చట్టం ప్రకారం నకిలీ విత్తనాలు అమ్మితే ఐదేండ్లు పదేండ్లు జైలుశిక్ష ఉండాలని పేర్కొన్నారు.

# యుకెలో ఆటోమొబైల్ ఇంజినీరింగ్ సర్వీసెస్ కంపెనీ

## కేంద్రం ప్రారంభానికి కెటిఆర్‌కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 16:** మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో ప్రతిష్టాత్మక ఆహ్వానం అందింది. లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సంస్థ ప్రాగ్మాటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పిడిఎస్ఎల్), యూకేలోని వార్విక్ టెక్నాలజీ పార్క్‌లో ఏర్పాటుచేసిన తమ నూతన కేంద్రాన్ని ప్రారంభించాల్సిందిగా కేటీఆర్‌ను ఆహ్వానించింది. ప్రపంచంలోనే అతిపెద్ద విలువైన కారు బ్రాండ్ అయినా మైక్లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్ ల్యాండ్ రోవర్ వంటి ప్రముఖ ఆటో దిగ్గజాలకు సేవలు అందిస్తోంది. గత దశాబ్దాన్నరకి పైగా ఈ సంస్థ ఆటోమోటివ్ పరిశ్రమలో అనేక ఉత్పత్తులను, సేవలను అందిస్తూ కొనసాగుతోంది. తమ నూతన కేంద్రం ద్వారా ఆటోమోటివ్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు పీడీఎస్ఎల్ సంస్థ పేర్కొంది. ఈ నెల 30వ తేదీన యూకేలోని వార్విక్ యూనివర్సిటీ సైన్స్ పార్క్‌లోని పరిశోధన కేంద్రాన్ని కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రాన్ని కేటీఆర్ ప్రారంభించాలని సంస్థ ఈరోజు ఆహ్వానం పంపింది.తెలంగాణ రాష్ట్రాన్ని ఐటీ, ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా తీర్చిదిద్దిన కేటీఆర్ నాయకత్వాన్ని గౌరవంగా గుర్తించిన పీడీఎస్ఎల్, తమ ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించుకోవడం గర్వకారణంగా భావిస్తోంది. "ఇన్నోవేషన్, రీసెర్చ్ రంగాల పట్ల కేటీఆర్ వినూత్నమైన విప్లవాత్మకమైన దృక్పథం, అంతర్జాతీయ స్థాయిలో భాగస్వామ్యాల స్థాపన, ఇన్నోవేషన్ ప్రోత్సాహానికి ఆయన పెట్టిన కృషి మా సంస్థ విధానాలకు అనుగుణంగా ఉంది. ఆయన చేతుల మీదుగా మా కేంద్రం ప్రారంభం కావడం గర్వకారణం అని సంస్థ డైరెక్టర్ క్రాంతి పుప్పాల తెలిపారు.

# ఎకో పార్క్‌ను సందర్శించిన మిస్‌వరల్డ్ పోటీదారులు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త :** నగర శివారులోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌ను మిస్ వరల్డ్ 2024 ఘన విజేత చెక్ రిపబ్లిక్ నుండి క్రిస్టినా పిష్కోవాతో పాటు అమెరికా ఖండ ఓసియానియా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు శుక్రవారం సాయంత్రం సందర్శించారు.ఈ సందర్భంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లకు ఎక్స్పీరియం వద్ద డోల్ వాయిద్యం,గజ్జలతో సాంప్రదాయికంగా స్వాగతం పలికారు.

250 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ పార్క్, కళ, నవీన, స్థిరత్వం సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఇది భారతదేశంలోనే అతిపెద్ద ప్రకృతి ఆధారిత గమ్యస్థానంగా నిలిచింది.ఈ పార్కును పర్యావరణ అనుకూలమైన బ్యాటరీ వారు వాహానాలతో సందర్శించారు.

ఈ సందర్భంగా మిస్ వరల్డ్ కంటెస్టంట్లకు హైదరాబాద్ పర్యావరణ సమతుల్యత, స్థిరమైన అభివృద్ధి ప్రయత్నాలను అధికారులు వివరించారు.ఎక్స్‌పీరియం ఎకో పార్లో గ్రీన్ టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ, స్థానిక జీవవైవిధ్యం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.పార్క్ లోని ప్రకృతి సౌందర్యం, హరిత విహార ప్రాంతాలను కంటెస్టంట్లు సందర్శించారు.అద్భుతమైన సూర్యాస్తమయ దృశ్యాలను అందించే ప్రదేశం సన్‌డైనర్ పాయింట్ ,ప్రకృతి, ఆధ్యాత్మికతల యొక్క శాంతియుత సంగమం బుద్ధ ఇన్స్పైడ్ ట్రీ స్పాట్, భూగర్భ శాస్త్రపరమైన అద్భుతం రెడ్ టైల్ ఫార్మేషన్ స్పాట్ , అపూర్వమైన ప్రకృతి ఛాయావృత ప్రదేశం ఓవల్ అంబ్రెలా ఆకారపు చెట్టు స్పాట్ , హైటీ, సెషన్‌తో కూడిన కూడిన రౌండ్ టేబుల్ అమరిక ఈజిప్షియన్ రాక్ స్పాట్ ను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించారు.

పార్క్ అందాలను వీక్షించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ సందర్భంగా మిస్ కెనడా, ఎమ్మా మోరిసన్ మాట్లాడుతూ..ఈ ప్రదేశం అద్భుతమైనదని, నా తల్లిదండ్రులు త్వరలో మళ్ళీ హైదరాబాద్‌కు వస్తానని ఎక్స్పీరియంను మిస్ అవ్వకుండా చూస్తా అన్నారు. మిస్ యుఎస్, అథెనా క్రాస్బీ మాట్లాడుతూ."భూమిని రక్షించడం మన బాధ్యత. ఎక్స్పీరియం,సృజనాత్మక డిజైన్ ద్వారా ప్రకృతితో ఎలా సామరస్యంగా జీవించవచ్చో చూపిస్తుందన్నారు.

మిస్ బ్రెజిల్, జెస్సికా పెడ్రోసో మాట్లాడుతూ..ఈ పార్క్‌ను సందర్శించడం తనకు ఒక గొప్ప అనుభవమని మా దేశాలు కూడా ఇలాంటివి అనుసరించాలన్నారు.



మిస్ గయానా, జలీకా సామ్యూల్స్ మాట్లాడుతూ..'ఆధునిక ప్రపంచంలో స్థిరత్వం కీలకం. ఎక్స్పీరియం ప్రకృతిని సంరక్షిస్తూ, అద్భుతాలను సృష్టిస్తోందని తన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ధరణితో రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

## భూ భారతి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం

## నిర్మల్,ఆసిఫాబాద్ రైతు సదుస్సులలో

## రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,మే16,ప్రభాతవార్త :** ధరణి పోర్టల్ వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని,గత ప్రభుత్వం చేసిన నిర్వాకం,తొందరపాటుతో వారి ప్రమేయం లేకుండానే రైతులు శిక్షను అనుభవించారని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శుక్రవారం నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.భూభారతి నాలుగు పైలట్ మండలాల్లో 13వేల దరఖాస్తులు వచ్చాయని,వీటైనంతవరకూ ఈనెల30తేదీలోగా పరిష్కరించవలసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.
తహసిల్దార్, ఆర్డిఓ,అదనపు కలెక్టర్,కలెక్టర్, సిసిఎల్ఎ,ఆపై ట్రిబ్యునల్ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థను ఈ చట్టాన్ని అనుసరించి రూపొందించినట్లు తెలిపారు. ప్రజలకు రెవెన్యూశాఖ సేవలు సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తుందని పేర్కొన్నారు.

భూభారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతంగా జరగడమే కాకుండా, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతోందన్నారు. వాస్తవిక డేటాతో భూ పత్రాలను సమర్పించడం వల్ల భవిష్యత్తులో హక్కులపై ఆందోళనలు తలెత్తవని స్పష్టం చేశారు.ఉద్దేశ్యపూర్వకంగా భూ సమస్యలను అ పరిష్కృతంగా ఉంచుతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

భూ యజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసుపుస్తకంలో ముద్రించి ఇస్తామని తెలిపారు. ఆరువేల మంది లైసెన్సు కలిగి ఉన్న సర్వేయర్లను అధికారికంగా నియమిస్తున్నామని చెప్పారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు.
అలాగే త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని అన్నారు.భూములు ఉన్న ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టం ద్వారా రక్షణ ఏర్పడుతుందని అన్నారు.పట్టా లేని భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు అందజేస్తామన్నారు.ఈ సమావేశాల్లో సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లపై ఆందోళన వద్దు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల అందిస్తామని అన్నారు. తొలి విడతలో ఇండ్లు రానివారు ఆందోళన చెందవద్దని మంత్రి పొంగులేటని శ్రీనివాసరెడ్డి అన్నారు. మొదటి విడతగా ప్రతీ నియోజక వర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల కేటాయించామని,మరో నాలుగు విడతల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామన్నారు.

# ప్రపంచ ఆర్థికవ్యవస్థ మందగిస్తున్నా భారత్ జిడిపి 6.3శాతం అంచనా

## ఐక్యరాజ్యసమితి ప్రస్తుత ఆర్థిక నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, మే 16:** భారత స్థూలదేశీయోత్పత్తి 2025 సంవత్సరానికి గానూ 6.3 శాతం ఉండనుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది. ఆర్థిక వృద్ధి తక్కువగా ఉంటుందని అంచనా వేసినప్పటికీ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని సమితి తెలిపింది. స్థిరమైన వినియోగం, ప్రభుత్వ వ్యయం మద్దతుగా దేశం పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచిందని ఐక్యరాజ్యసమితి నివేదికను విడుదల చేసింది. 2025 మధ్యలో ప్రపంచ ఆర్థిక పరిస్థితి అవకాశాలు' పేరిట ఈ రిపోర్ట్ వెలువడింది. 2025లో వృద్ధి అంచనాలను 6.3 శాతానికి తగ్గించినప్పటికీ, బలమైన ప్రైవేట్ వినియోగం, ప్రభుత్వ పెట్టుబడుల కారణంగా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని యూఎఎస్‌ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం పేర్కొంది. వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, విధానపరమైన అనిశ్చితి నెలకొనడం లాంటి సమస్యలు తలెత్తడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదకర పరిస్థితిలో ఉంది. ఇటీవల అమెరికా సుంకాల రేటును పెంచడంతో.. ఉత్పత్తి ఖర్చులు పెరిగాయి. ఇది గ్లోబల్ చైన్‌ను దెబ్బ తీసి ఆర్థిక సంక్షోభం ముప్పు వాటిల్లింది. అయినాకూడా భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉందని స్థిరమైన వినియోగం, ప్రభుత్వ వ్యయం మద్దతు ఇస్తున్నట్లు సమితి పేర్కొంది. 2024లో 7.1 శాతంగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ 2025లో 6.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా. 'యునైటెడ్ స్టేట్స్ సుంకాలు వస్తు ఎగుమతులపై ప్రభావం చూపుతున్నప్పటికీ, ప్రస్తుతం మినహాయింపు పొందిన రంగాలు – ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఎనర్జీ, ఖనిజాల్లో రాగిగా ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో ప్రచురించబడిన యూఎన్ ప్రపంచ ఆర్థిక పరిస్థితి ముఖచిత్రం 2025లో 6.6 శాతం కంటే కొంచెం తక్కువే అయినప్పటికీ 2026కి భారతదేశ జిడిపి వృద్ధి 6.4 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.



భారతదేశంలో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల మధ్య నిరుద్యోగం చాలావరకు స్థిరంగా కొనసాగుతోంది. భారతదేశంలో ద్రవ్యోల్బణం 2024లో 4.9 శాతం నుంచి 2025లో 4.3 శాతానికి తగ్గుతుందని కేంద్ర బ్యాంకు టార్గెట్ రేంజ్‌లోనే ఉంటుందని సమితి అంచనావేసింది. ఫిబ్రవరి 2023 నుంచి తన పాలసీ రేటును 6.5 శాతం వద్ద స్థిరంగా ఉంచిన భారత రిజర్వ్ బ్యాంక్, ఫిబ్రవరి 2025లో తన సడలింపు సైకిల్ ప్రారంభించిందని నివేదిక పేర్కొంది. అదే సమయంలో, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక ప్రభుత్వాలు ఐఎంఎఫ్ మద్దతు ఉన్న కార్యక్రమాల కింద ఆర్థిక పునరేకీకరణ, ఆర్థిక సంస్కరణలను కొనసాగించాలని భావిస్తున్నాయి. ప్రపంచ జిడిపి వృద్ధి ఇప్పుడు 2025లో కేవలం 2.4 శాతంగా అంచనా వేస్తుండగా.. ఇది 2024లో 2.9 శాతంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వృద్ధి 2025కి 2.4 శాతంగా, 2026కి 2.5 శాతంగాను ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇక అమెరికాలో వృద్ధి 2024లో 2.8 శాతం నుంచి 2025లో 1.6 శాతానికి గణనీయంగా తగ్గుతుందని అంచనా వేశారు. అధిక సుంకాలు, విధాన అనిశ్చితి ప్రైవేట్ పెట్టుబడి, వినియోగంపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. ఈ సంవత్సరం చైనా వృద్ధి 4.6 శాతానికి మందగించవచ్చని అంచనా. ఇది వినియోగదారుల సెంటిమెంట్‌ను, ఎగుమతి ఆధారిత తయారీలో అంతరాయాలు, కొనసాగుతున్న ఆస్తి రంగ సవాళ్లను ప్రతిబింబిస్తుంది. బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికాతో సహా అనేక ఇతర ప్రధాన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు కూడా వాణిజ్యం బలహీనపడటం, పెట్టుబడులు మందగించడం, వస్తువుల ధరలు తగ్గడం వల్ల వృద్ధి తగ్గుదలలను ఎదుర్కొంటున్నాయి. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలకు, ఈ ఆర్థిక అనిశ్చితి ఉపాధి కల్పన, పేదరికాన్ని తగ్గించడం, అసమానతలను పరిష్కరించే అవకాశాలను దెబ్బతీస్తుందని యూఎన్ పేర్కొంది. 2024లో 4.5 శాతం నుంచి 2025లో 4.1 శాతానికి వృద్ధి మందగించవచ్చని అంచనా వేశారు.

# వివాదస్పదమైన మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు

## నిజాలు బయటపెట్టారు.. థాంక్స్ చెప్పిన కెటిఆర్

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు: సురేఖ వివరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 16:** తెలంగాణ మంత్రి కొండ సురేఖ వివాదంలో చిక్కుకున్నారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అరవిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె డబ్బులు తీసుకోకుండా మంత్రులు ఏ పని చేయరూ అంటు వ్యాఖ్యానించారు. మా దగ్గరకు చాలా ఫైల్స్ వస్తుంటాయి. చాలా మంది మంత్రులు డబ్బులు తీసుకొనే ఫైల్స్ క్లియర్ చేస్తుంటారు. కానీ, నేను అలా చేయను. సమాజ సేవే చేస్తుంటాను. నాకు నయా పైస అక్కర్లేదు. స్కూల్ డెవలప్‌మెంట్ చేయమన్నాను అని సురేఖ అన్నారు. దీంతో ఇది చాలా వివాదాస్పదమైంది. దీనిపై ఆమె తాజాగా వివరణ ఇచ్చారు.బిఆర్ఎస్‌లో ఉండే మంత్రుల గురించి తాను మాట్లాడానని.. అలా తప్పుడు ప్రచారం చేయడం తప్పు అని ఆమె పేర్కొన్నారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకొనే వారని అన్నారు.అయితే కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కెటిఆర్ థ్యాంక్స్ చెప్పారు. మొత్తానికి కొండ సురేఖ నిజాలు బయట పెట్టారని ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.కాంగ్రెస్ పార్టీ కమీషన్ సర్కార్ నడుపుతోందని కెటిఆర్ వ్యాఖ్యానించారు. "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక కమీషన్ సర్కార్‌గా నడుస్తోందన్నది ఇప్పుడు బహిరంగ రహస్యమే. ఈ ప్రభుత్వంలో ఫైళ్లపై సంతకాలు పెట్టాలంటే మంత్రులు, వారి సహచర మంత్రులు ఏకంగా 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారు అని కేటీఆర్ ఆరోపించారు. ఇది అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. గతంలో సచివాలయంలో కొందరు కాంట్రాక్టర్లు ఇదే కమీషన్ల వ్యవహారంపై ధర్నా చేసిన ఘటనను కేటీఆర్ గుర్తుచేశారు.ఆ సంఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమీషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. కమీషన్లు తీసుకుంటున్న ఆ మంత్రుల వివరాలను, వారి పేర్లను ప్రజల ముందు బహిర్గతం చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.

# వెయ్యి కోట్ల టాస్మాక్ స్కామ్‌లో ఇడి ఆకస్మిక దాడులు

**చెన్నై, మే 16:** తమిళనాడు మద్యం కుంభకోణానికి సంబంధించి శుక్రవారం ఈడీ అధికారులు ఏకకాలంలో వివిధ చోట్ల దాడులు చేసారు. సుమారు 1000 కోట్ల కుంభకోణంగా భావిస్తున్న ఈ స్కాంపై ఈడీ విస్తృత దర్యాప్తుచేస్తోంది. ఈకేసులో మనీలాండరింగ్ జరిగిందన్న అభియోగాలపై ఈడీ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. సుమారు రూ.1000 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. టాస్మాక్ అధికారులు, ఏజెంట్లనే టార్గెట్‌గా ఈ సోదాలుజరిగాయి. తమిళచలన చిత్రనిర్మాత ఆకాశ్‌భాస్కరన్ ఇంట్లోకూడా సోదాలునిర్వహించారు. తమిళంలో ఇడ్లీ కడాయి, పరాశక్తి చలనచిత్రాలను ఆయన నిర్మిస్తున్నారు. తమిళనాడు మద్యం అమ్మకాల్లో టాస్మాక్ గుత్తాధిపత్యంతో ఉంది. గత మార్చిలో ఈడీ అధికారులు భారీ అవకతవకలు జరిగాయని సోదాలునిర్వహించారు. టెండర్లలోనే అవకతవకలున్నాయని, సుమారు రూ.1000 కోట్ల రూపాయలమేర లెక్కలుతేలని లావాదేవీలు జరిగాయని ఆరోపణలు గుప్పుమన్నాయి. డిస్టిలరీ కంపెనీలద్వారానే ఈ దాడులుచేసామన్నారు.

# 'కార్‌లాంజ్' గోల్‌మాల్ కంపెనీలు మరిన్ని!

## ఖరీదైన విదేశీకార్ల అక్రమ దిగుమతిపై డిఆర్‌ఐ విచారణలో సంచలన విషయాలు

**హైదరాబాద్, మే 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కార్ లాంజ్ పేరుతో నడుస్తున్న కార్ల విక్రయ సంస్థలో గోల్‌మాల్ వ్యవహారాలను రట్టు చేసిన కేంద్ర ప్రభు త్వ సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (డిఆర్ఐ) ఈ తరహా కార్ల విక్రయ కంపెనీలు దేశంలో మరిన్ని వున్నట్లు ఆధారాలు సేకరించింది. అమెరికా, బ్రిటన్ తదిత ర దేశాల నుంచి ఖరీదైన కార్లను కొని వాటిని శ్రీలంక, దుబాయ్‌లకు తరలించి భారత్‌లో వున్న పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి తక్కువ ధర కార్లు గా చెబుతూ దేశంలోకి తెస్తూ కోట్ల రూపాయల పన్నులను ఎగవేస్తున్నట్లు డిఆర్ఐ అధికారులు తేల్చారు. భారత్‌లోకి అక్రమంగా తరలించిన ఖరీదైన కార్లను త మకు నమ్మకమైన వారికి సదరు కంపెనీల యజమానులు అసలు ధరకు అమ్ముతూ దండిగా లాభాలు గడిస్తున్నట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. ఇప్పటి వరకు కేవలం కార్ లాంజ్ షోరూంలో అమ్మకాలు జరిగిన 30 విదేశీ కార్ల బండారం మాత్రమే రట్టయినా ఇటువంటి కంపెనీలు కనీసం పది వరకు దేశంలోని పలు నగరాలలో వున్నట్లు డిఆర్ఐ భావిస్తోంది. విదేశాలకు చెందిన ఖరీదైన కార్లను చట్ట వ్యతిరేకంగా భారత్‌కు తెప్పించి, ఇక్కడ వాటిని భారీ లాభాలకు అమ్మిన కేసులో అరెస్టయిన హైదరాబాద్‌కు చెందిన కార్ లాంజ్ షోరూం అధిపతి బషర్ ఖాన్ వ్యవహారం కొత్త మలుపులు తిరుగుతోంది.

అమెరికా, బ్రిటన్, జపాన్ తదితర దేశాలకు చెందిన ఖరీదైన కార్ల విలు వను తక్కువగా చూపించి వాటిని భారీ ధరలకు భారత్‌లో విక్రయించిన నేరంపై బషర్ ఖాన్ అరెస్టు తరువాత జరిపిన విచారణలో ఆయన వంద కోట్ల రూపా యల పన్నులను ఎగవేసినట్లు డిఆర్ఐ తేల్చింది. గుజరాత్‌లో ఐదు రోజుల క్రితం బషర్ ఖాన్ అరెస్టవడం తెలిసిందే. బషర్ ఖాన్ ఒక పథకం ప్రకారం ఖరీదైన కార్లను తక్కువ ధర వాహనాలుగా చెబుతూ కొని వాటిని శ్రీలంక, దుబాయ్‌లకు తరలించే వాడని డిఆర్ఐ తేల్చింది. అనంతరం ఆ వాహనాలకు వున్న ఎడమ వైపు డ్రైవింగ్‌ను కుడివైపుకు మార్చడంతో పాటు ఇంకొన్ని మార్పులు చేసి నకిలీ పత్రాలను వాడి తక్కువ ధర కలిగిన వాహనాలుగా తప్పుడు పత్రాలు తయారు చేసి భారత్‌కు తెప్పించేవాడు. ఇలా ఇప్పటి వరకు బషర్ ఖాన్ 30కి పైగా విదేశీ కార్లను భారత్‌కు తెప్పించి తనకు బాగా తెలిసిన వ్యాపారులు, సెలబ్రటీలకు అమ్మినట్లు డిఆర్ఐ గుర్తించింది.

విదేశాల నుంచి భారత్‌కు అక్రమంగా పన్ను ఎగవేసి తెప్పించిన కార్లలో హమ్మర్ ఈవీ, కాడిలాక్, ఎస్కలేడ్, రోల్స్ రాయిస్, లెక్సస్, టయోటా ల్యాండ్ క్రూయిజర్, లింకన్ నావిగేటర్ వంటి లగ్జరీ మోడల్ కార్లు వున్నట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. పదేళ్లుగా హైదరాబాద్‌లో లగ్జరీ కార్ల షోరూం నడుపుతున్న బషర్ ఖాన్ తన సొంత అవసరాల కోసం కొన్ని కార్లను ఇలా విదేశాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుని ఏడు కోట్ల రూపాయ లకుపైగా పన్నులను ఎగవేసినట్లు డిఆర్ఐ తేల్చింది.

కాగా బషర్ ఖాన్‌కు అతని వ్యాపార భాగస్వామి డాక్టర్ అహ్మద్ సహాయం చేసినట్లు డిఆర్ఐ అధికారులు గుర్తించారు. బషర్ ఖాన్ దిగుమతి చేసుకున్న కార్లను డాక్టర్ అహ్మద్ ఫాం హౌజ్‌లో వుంచినట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. బషర్ ఖాన్ వద్ద నుంచి విదేశీ కార్లను కొనుగోలు చేసిన వారంతా నగదు రూపంలోనే చెల్లింపులు జరిపినట్లు డిఆర్ఐ తేల్చింది. బషర్ ఖాన్ తరహాలో మరికొందరు ఇలాంటి గోల్‌మాల్‌కు పాల్పడుతున్నట్లు డిఆర్ఐ విచారణలో తేలింది. ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, పూణె, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలతో ఇలాంటి గోల్‌మాల్ వ్యాపారా లు వున్నట్లు డిఆర్ఐ గుర్తించింది. బషర్ ఖాన్ వద్ద విదేశీకార్లను కొన్న బడా బాబులకు సంబంధించిన వివరాలను సేకరించిన డిఆర్ఐ అధికారలు వారిని విచారించి, పన్నులను జరిమానాలతో సహా వసూలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఒకవేళ ఇందులో వారు నేరపూరిత కుట్రకు పాల్పడి వుంటే వారిపైనా చర్యలు తీసుకోవాలని డిఆర్ఐ భావిస్తోంది.

నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్ : U40109TG2000SGC034119

సంక్షిప్త టెండర్ ప్రకటన నం.01/2025-26 ఆఫ్ స్పెసిఫికేషన్ నం.01/25-26 ఆఫ్ SE/OP/ కరీంనగర్
కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ వారిచే పద్మానగర్ జంక్షన్ అభివృద్ధి కొరకు పేమెంట్ పనులు D-2502-03-01-03-01-001 క్రింద కరీంనగర్ డివిజన్ యొక్క సబ్ డివిజన్ టౌన్-II యొక్క కరీంనగర్ టౌన్-II సెక్షన్ ఆపరేషన్‌లో 33 KV మరియు 11 KV ఇన్ఫ్రాస్ట్రక్చర్ యొక్క స్థాపన మరియు తొలగింపు కలుపుకొని 33 KV మరియు 11 KV లైన్ల షిఫ్టింగ్ ప్రతిపాదన నిమిత్తం TGNPDCL సమోదిత కాంట్రాక్టరుల నుండి సీల్డ్ టెండర్‌లు కోరబడుతున్నవి. పనుల వివరాలు మరియు ఇతర సమాచారం మా వెబ్‌సైట్ www.tgnpdcl.in నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, కరీంనగర్

సంక్షిప్త టెండర్ ప్రకటన నం.01/2025-26 ఆఫ్ SE/OP/NML స్పెసిఫికేషన్ నం.83/2025-26 to 100/2025-26 & 01/2025-26 to 14/2025-26తో (32 నం.లు స్పెసిఫికేషన్‌లు)
నిర్మల్ సర్కిల్ ఆపరేషన్‌లో వివిధ పనుల కొరకు TGNPDCL నమోదిత కాంట్రాక్టరుల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుతున్నవి. పని సంబంధిత వివరాలు మా వెబ్‌సైట్ www.TGNPDCL.com నుండి పొందవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, నిర్మల్

SE/OP/BKGM యొక్క స్పెసిఫికేషన్ నం.114తో టెండర్ ప్రకటన నం.02/2025-26
భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్‌లో కొత్తగూడెం-డివిజన్‌లో లైన్స్ యొక్క షిఫ్టింగ్ నిర్వహించుటకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యొక్క TGNPDCL నమోదిత కాంట్రాక్టరుల నుండి సీల్డ్ టెండర్‌లు కోరబడుతున్నవి. పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.in నుండి పొందవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, TGNPDCL, భద్రాద్రి కొత్తగూడెం
DIPR.No.1989-PP/CL/Advt/1/2025-26, తేది: 16.05.2025

# జూన్ 12న 'హరి హర వీరమల్లు'



**ఈ సంవత్సరం** విడుదల కానున్న భారీ భారతీయ చిత్రాలలో హరి హర వీరమల్లు ఒకటి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. సినీ అభిమానులంతా ఈ చిత్రం కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, రెండు పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న మూడవ గీతాన్ని ట్రైలర్‌తో పాటు ఆవిష్కరించ డానికి చిత్ర బృందం సిద్ధమవుతోంది. ట్రైలర్ విడుదలతో అంచనాలు నూతన శిఖరాలకు చేరుకుంటాయని చిత్ర యూనిట్ నమ్మకంగా ఉంది. అత్యద్భుత స్థాయిలో రూపొందించబడుతోన్న హరి హర వీరమల్లు చిత్రం తుదిదశకు చేరుకుంది. నిర్మాణాంతర కార్యక్రమాలు జోరుగా జరుగుతున్నాయి. వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, డబ్బింగ్ పనులతో మెరుపు వేగంతో తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఆలస్యాల మధ్య పగ్గాలు చేపట్టిన దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ, కొద్ది నెలలుగా అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ప్రతి విభాగాన్ని పర్యవేక్షిస్తూ, వెండి తెరపై మునుపెన్నడూ చూడని అద్భుతమైన అనుభూతిని ప్రేక్షకులకు అందించడానికి కృషి చేస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన మాట వినాలి, కొల్లగొట్టి నాదిరో గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ ఛాయగ్రాహకుడు మనోజ్ పరమహంస కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ సినిమాకి, లెజెండరీ కళా దర్శకుడు తోట తరణి అద్భుతమైన సెట్ లను రూపొందించారు. చిత్ర బృందం ఎక్కడా రాజీ పడకుండా, ప్రపంచం మెచ్చే గొప్ప చిత్రంగా మలచడానికి కృషి చేస్తోంది. చారిత్రాత్మక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కళ్యాణ్ కనువిందు చేయనున్న ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు భాగమయ్యారు. మొఘల్ చక్రవర్తిగా బాబీ డియోల్ నటిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, జిషు సేన్‌గుప్తా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న హరి హర వీరమల్లు చిత్రం, జూన్ 12న బాక్సాఫీస్ దగ్గర గర్జించనుంది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో భారీ ఎత్తున విడుదల కానున్న ఖిహరి హర వీరమల్లుఖి సినిమా.. ప్రేక్షకుల హృదయాలను, బాక్సాఫీస్‌ను గెలుచుకోవడానికి సిద్ధంగా ఉంది. తారాగణం: పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్, జిషుసేన్‌గుప్తా, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు, నరా ఫతేహి, దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ, నిర్మాత: ఎ. దయాకర్ రావు సమర్పణ: ఎ. ఎం. రత్నం బ్యానర్: మెగా సూర్య ప్రొడక్షన్స్.

# 'కన్నప్ప' కామిక్ బుక్ ఫైనల్ చాప్టర్ కాన్సెప్ట్ వీడియో రిలీజ్

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప జూన్ 27న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కాబోతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రమోషనల్



కార్యక్రమాలు ఉవ్వెత్తున కొనసాగుతున్నాయి. టీజర్‌లు, పాటలు సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇప్పటికే యూఎస్‌లో విష్ణు మంచు స్టార్ట్ చేసిన కన్నప్ప ప్రమోషనల్ టూర్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక కన్నప్ప కథను అందరికీ తెలియాలనే ఉద్దేశంతో కామిక్ బుక్స్ రూపంలోకి విష్ణు మంచు తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. కామిక్ సిరీస్‌లోని మొదటి రెండు ఎపిసోడ్‌లకు అఖండ స్పందన లభించింది. ఇక ఇప్పుడు మూడో అధ్యాయాన్ని విడుదల చేశారు. ఈ చివరి ఎపిసోడ్ తిన్నడు భావోద్వేగ, ఆధ్యాత్మిక పరివర్తనను సూచిస్తుంది. అతను ఒకప్పుడు దైవత్వం ఆలోచనను తిరస్కరిస్తాడు.. కానీ చివరికి శివుని భక్తుడిగా మారుతాడు. కన్నప్పగా మారడానికి అతని అద్భుతమైన ప్రయాణాన్ని ఈ మూడో అధ్యాయం వివరిస్తుంది. భక్తి, ప్రేమ, త్యాగం, విధితో నిండిన ఈ కథ అందరినీ ఆకట్టుకుంటుంది. ఏఐ ద్వారా క్రియేట్ చేసిన ఈ విజువల్స్, వీడియో అందరినీ అబ్బుర పరిచేలా ఉంది. ఇంతకు మించి అనేలా సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ ఉంటాయని టీం చెబుతోంది. విజువల్ ఎఫెక్ట్స్‌లో జాప్యం వల్లే ఈ మూవీని జూన్ 27కి వ్యూహాత్మకంగా మార్చారు.

# 29న 'జనం' రీ-రిలీజ్

వీఆర్ పీ క్రియేషన్స్ పతాకంపై, పి.పద్మావతి సమర్పణలో సుమన్, అజయ్ ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా నటించిన చిత్రం జనం. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన జనం మూవీ మే 29న రీరిలీజ్ కాబోతుంది. రాజకీయాలను, రాజకీయ నాయకుల్ని ప్రజలు ఏ విధంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న ఘాటైన చర్చను రాజేసిన ఈ సినిమా గత ఏడాది నవంబర్ 10న థియేటర్లలో విడుదలై సంచలనం సృష్టించింది. సమాజంలోని పౌరులను పక్కదారి పట్టిస్తున్న ఘటన లను ఎత్తి చూపిస్తూ, అందరికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో తీసిన ఈ సినిమా.. ప్రేక్షకులందరికి చేరాలనే మళ్లీ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా రచన, దర్శక నిర్మాత వెంకట రమణ పసుపులేటి మాట్లాడుతూ, అదుపు తప్పుతున్న నేటి తరానికి అవగాహన కోసం చక్కటి సినిమా అందిస్తున్నాం. ఉత్తమ పౌరులుగా ఉండాల్సిన వారు స్మార్ట్ ఫోన్ కు, నాయకుల పంచే మందు, డబ్బులకు ఎలా బానిస అవుతున్నారో ఆలోచింపచేసేలా సినిమా తెరకెక్కించాము.



ఒకప్పుడు సినిమాలుజనాన్ని ఆలోచింప చేసే విధంగా ఉండేవి. కంటి చూపుతో విమానం కూలటం, రక్త పాతం, హింస, బీపీలు పెరిగే సౌండ్ అర్ధం లేని సినిమాలు వేల కోట్ల కలెక్షన్స్. సమాజానికి, రేపటి తరానికిఎలాంటి నేపథ్యమో ఆలోచించండి. మీ కోసం ఈ నెలలో విడుదల అవుతున్నజనం సినిమా చూడండి. ఓటీటీకి ప్లాన్ చేయడం లేదు. ఈ సినిమాకు సుమన్ గారే హీరో. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఇందులో కమర్షియల్ అంశాలు, సందేశం, సెంటిమెంట్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. మే 29న థియేటర్‌లకు వస్తుంది.

# వరుస సినిమాలతో భాగ్యశ్రీ బిజీ బిజీ

భాగ్యశ్రీ బోర్సే.. రవితేజ హీరోగా వచ్చిన మిస్టర్ బచ్చన్ సినిమాలో హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగట్రం చేసి తన అందం, సొగసు వలవేసి తెలుగు కుర్రాళ్ల మనసు దోచేసింది. దీంతో తెలుగు ఈ బ్యూటీకి విపరీతంగా క్రేజ్ పెరిగిపోయింది. ప్రస్తుతం వరుస సినిమాలతో తెలుగులో బిజీ అయిపోయింది. ఈ ముద్దుగుమ్మ లైనప్‌లో ఉన్న సినిమాలు ఏంటి.? ఈరోజు మనం తెలుసుకుందాం..

రవితేజ హీరోగా వచ్చిన మిస్టర్ బచ్చన్ సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్ అరంగట్రం చేసింది సొగసరి భామ భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా డిజాస్టర్ అయినప్పటికీ.. తన అందం, సొగసు చూపి తెలుగు కుర్రాళ్ల క్రాష్ లిస్ట్‌లో చేరిపోయింది ఈ బ్యూటీ. దీంతో ఈ ముద్దుగుమ్మకి తెలుగులో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం ఒకటి విజయ్ దేవరకొండకి జోడిగా నటించిన కింగ్ డమ్ మూవీ షూటింగ్ కంప్లెట్ అయింది. ఇది ఈ ఏడాది జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే దుల్కర్ సల్మాన్ సరసన కాంత అనే పీరియడ్ డ్రామా సినిమా చేస్తుంది ఈ బ్యూటీ. సెల్వమణి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకుడు. రానా దగ్గుబాటి, ప్రశాంత్ పొట్లూరి, జోన్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. వీటితో పాటు రామ్ పోతినేని హీరోగా తెరకెక్కుతున్న ఆంధ్ర కింగ్ తాలూకా సినిమాలో కథానాయికగా నటిస్తుంది భాగ్యశ్రీ. బయోపిక్ ఆఫ్ ఫ్యాన్ అనే ట్యాగ్ లైన్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తు న్నారు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ దర్శకుడు పి.మహేష్ బాబు. చేతిలో ఉన్న ఈ మూడు సినిమా కంప్లీట్ అవ్వక ముందే ప్రభాస్ సరసన ఓ సినిమాలో హీరోయిన్‌గా సెలెక్ట్ అయింది అనే సమాచారమే. ఇది నిజమైతే భాగ్యశ్రీ స్టార్ అయిపోవడం పక్కా. చూడాలిక టాలీవుడ్‌లో ఈమె జర్నీ ఎలా సాగనుందో.



# జులై 18న 'జూనియర్'

ప్రసిద్ధ నిర్మాణ సంస్థ వారాహి చలన చిత్రం, కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డిని జూనియర్ అనే ఫన్, ఫ్యామిలీ, ఎమోషన్‌తో నిండిన ఎంటర్టైనర్ ద్వారా సినీ రంగంలోకి పరిచయం చేస్తోంది. రాధా కృష్ణ దర్శకత్వంలో, రజని కొర్రపాటి నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రోమోలకే మంచి స్పందన అందుకుంది. కిరీటి తన డైలాగ్ డెలివరీ, స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నాడు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా కిరీటికి జోడీగా కనిపించనుంది. అలాగే జెనీలియా కీలక పాత్రలో వెండితెరకు కంబ్యాక్ ఇస్తుండగా, కన్నడ లెజెండ్ క్రేజీ స్టార్ డా.రవిచంద్ర వి కూడా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. మూవీ టీం విడుదల తేదీకి సంబంధించిన అప్‌డేట్‌ను రివీల్ చేసింది. జూనియర్ చిత్రం ఈ ఏడాది జూలై 18న థియేటర్లలోకి రానుంది. జూనియర్ ఈ మాన్సూన్ లో కుటుంబంతో కలిసి సరదాగా, భావోద్వేగాలతో జర్నీని అదించబోతోంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో ప్రధాన తారాగణం ఆనందంగా కనిపించగా, జెనీలియా మాత్రం సీరియస్ లుక్‌తో కనిపిస్తుంది. త్వరలోనే ప్రొమోషన్స్ కిక్ స్టార్ట్ చేస్తారు. ఈ చిత్రానికి ప్రఖ్యాత సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. కె కె సెంటిల్ కుమార్ సినిమాటోగ్రఫీను అందించగా, సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా రవీందర్ పనిచేస్తుండగా, యాక్షన్ సీన్‌లను భారత్‌లోనే అగ్రశ్రేణి స్టంట్ మాస్టర్ పీటర్ హెయిన్ కొరియోగ్రాఫ్ చేస్తున్నారు. డైలాగ్స్‌ను కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని రాయగా, నిరంజన్ దేవరమేనే ఎడిటర్.



తారాగణం: కిరీటి, జెనీలియా, డా. రవిచంద్ర వి, శ్రీలీల, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: రాధా కృష్ణ, నిర్మాత: రజని కొర్రపాటి, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: కె కె సెంటిల్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్ స్టంట్ డైరెక్టర్: పీటర్ హెయిన్, డైలాగ్స్: కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని.

# ఎన్టీఆర్ బర్త్‌డేకు హృతిక్ రోషన్ సర్‌ప్రైజ్

నార్త్, సౌత్ అన్న తేడా లేకుండా వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ నుంచి వచ్చి చిత్రాలపై అందరి దృష్టి పడుతుంది. ఇక ఈ స్పై యూనివర్స్‌లో భాగంగా వార్ 2లో కబీర్ పాత్రతో తిరిగి బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఇక ఈ చిత్రంలో మ్యాన్ ఆఫ్ మాసెస్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ బర్త్ డే (మే 20) సందర్భంగా అప్డేట్ రాబోతోందని హృతిక్ రోషన్ హింట్ ఇచ్చారు. ఈ మేరకు హృతిక్ ట్వీట్ చేస్తూ.. హే తారక్, ఈ సంవత్సరం మే 20న ఏ అప్డేట్ రాబోతోందో? అసలు ఏం జరగబోతోందో నీకు తెలుసా? నువ్వు అస్సలు ఊహించలేవు.. మీరంతా సిద్ధంగా ఉన్నారా? హైప్ పెంచేశారు. హృతిక్ అలా ట్వీట్ వేశాడో లేదో ఇలా ఒక్కసారిగా ట్విట్టర్‌ను షేక్ చేసింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ వార్ 2పై ఇప్పుడు వరల్డ్ వైడ్‌గా క్రేజ్ నెలకొన్న సంగతి తెలిసిందే. ఇండియన్ సూపర్ స్టార్లైన హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను ఒకే చిత్రంలో నటిస్తుండటంతో ప్రపంచ వ్యాప్తంగా హైప్ ఏర్పడింది. ఈ చిత్రం ఆగస్టు 14, 2025న హిందీ, తెలుగు తమిళ భాషలలో విడుదల కానుంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఏక్ థా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్ 3 వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక వార్ 2 అనేది వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో ఆరో చిత్రంగా నిలుస్తుంది.



# వరుస ఆఫర్లు అందుకుంటున్న సాన్వే మేఘన

**ఇండస్ట్రీలో** ఇప్పుడు తెలుగు అమ్మాయిలు రాణిస్తున్నారు. మంచి అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. వారిలో సాన్వే మేఘన ఒకరు. సాన్వే మేఘన 1998 సెప్టెంబరు 12న హైదరాబాద్‌లో జన్మించింది. ఈ ముద్దుగుమ్మ. ఈ ముద్దుగుమ్మ 2019లో సైరా నరసింహారెడ్డి సినిమాతో తన సినీ జర్నీని ప్రారంభించింది. ఆ తర్వాత పిట్ట కథలు, బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్, పుష్పక విమానం, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పుష్పక విమానంలో ఆమె షార్ట్ ఫిల్మ్ హీరోయిన్‌గా చేసిన పాత్ర ప్రేక్షకులను మెప్పించింది. తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు ఆరు సినిమాలు చేసింది. అలాగే తమిళ్‌లో ఓ సినిమా చేసింది. తమిళ్‌లో ఆమె కుటుంబస్థాన్ అనే సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. తెలుగులో రీసెంట్‌గా టుక్ టుక్ అనే సినిమా చేసింది. చేసిన సినిమా లన్ని మంచి టాక్ సొంతం చేసుకున్నా ఈ భామకు మాత్రం అంతగా గుర్తింపురాలేదు. రీసెంట్‌గా తమిళ్ లో ఓ సినిమా చేసింది. ఆసినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి తమిళ్ నుంచి క్రేజీ ఆఫర్స్ వస్తున్నాయి. ఇప్పటికైన తెలుగులో ఈ అమ్మడికి పెద్ద సినిమా ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.



# శ్రీనిధి శెట్టి ఒకే ఒక్క హిట్‌తో నాలుగు ఆఫర్స్


హీరోయిన్స్ సినిమాల్లో పాత్ర కోసం ఎంత రిస్క్ అయినా చేస్తుంటారు. ఇక ముద్దుగుమ్మలు ఫిట్ నెస్‌కు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కథకు తగ్గట్టుగా తమను తాము మార్చుకుంటూ నటనతో ఆకట్టుకుంటున్నారు. సినిమా సినిమాకు వేరియేషన్స్ చూపిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది హీరోయిన్స్ ఓవర్ నైట్‌లో స్టార్స్‌గా మారిపోతున్నారు. చేసిన ఒకే ఒక్క సినిమాతో విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంటున్నారు. ఇతర బాషల నుంచివచ్చిన ముద్దుగుమ్మలు చాలా మంది తెలుగులో మంచి క్రేజ్ తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే చాల ఏమండీ హీరోయిన్ అలా స్టార్స్‌గా మారినవారే వారిలానే ఇప్పుడు మరో ముద్దుగుమ్మ కూడా తెలుగులో వరుస అవకాశాలతో దుసుకుపోతుంది. రీసెంట్ గానే భారీ హిట్ అందుకుంది. ఆమె నటించిన సినిమా ఏకంగా రూ.300 కోట్ల వరకు వసూల్ చేసి నయా రికార్డ్ క్రియేట్ చేసింది. అంతే కాదు ఈ సినిమా హిట్‌తో ఈ చిన్నది ఏకంగా 4 సినిమా ఆఫర్స్ అందుకుంది. ఇంతకూ ఆ చిన్నది ఎవరో తెలుసా? శ్రీనిధి శెట్టి మోడల్‌గా కెరీర్ మొదలుపెట్టి ఆతర్వాత మిస్ సుప్రనేషనల్ 2016 విజేత. ఈ ముద్దుగుమ్మ ప్రధానంగా కన్నడ, తెలుగు, తమిళ చిత్రాలలో నటిస్తుంది. 2015లో మిస్ కర్ణాటక, మిస్ బ్యూటిఫుల్ స్మైల్ టైటిళ్లను, 2016లో మిస్ సుప్రనేషనల్ ఇండియా టైటిల్‌ను గెలుచుకుంది. రీసెంట్‌గా తెలుగులోకి అడుగు పెట్టింది. నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హిట్ 3 సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి విజ యాన్ని అందుకుంది. శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో ఈ బ్యూటీకి ఇప్పుడు తెలుగులో వరుసగా ఆఫర్స్ వస్తున్నాయి. ఇప్పటికే నాలుగు సినిమాలు లైనప్ చేసింది ఈ భామ. ప్రస్తుతం తెలుసు కదా అనే సినిమా చేసింది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఈ సినిమాతో పాటు మరో మూడు సినిమాలు చేస్తుంది.



## రుహాని శర్మ న్యూ లుక్



# 'తులసి'తో కాంతివంతంగా..



మచ్చలేని సౌందర్యాన్ని సొంతం మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉంటే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి.

**మొటిమలకు..**

తాజా తులసి ఆకులను తినడం వల్ల మొటిమలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. తాజా ఆకులను మెత్తగా చేసుకొని మొటిమలపై రాసినా ఫలితం ఉంటుంది.

తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుంది.

తులసి పొడిని రోజ్వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు తెరుచుకొని మొటిమలు ఇతర చర్మ సంబంధిత సమస్యలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. ..

తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుంది.



**నల్ల మచ్చలుంటే..** ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి అంతే మోతాదులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా క్రమం తప్పకుండా రోజుకోసారి చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్ల మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుంది. □

# కొత్త తరానికి పాత మధురాలు

**బొమ్మలు గీయడం అంటే చిన్నప్పట్నుంచీ ఇష్టం ఆమెకు. ఆ వ్యాపకాన్నే ఒత్తిడిని అధిగమించడానికి సాధనంగా చేసుకుంది. దానికి డిజిటల్ రూపాన్నిచ్చింది. అదే హరితా చిట్టా‌కు పేరు తెచ్చి పెట్టింది. సాధారణ గృహిణిని.. సెలెబ్రిటీ మెచ్చుకునే స్థాయికి తీసుకువెళ్లింది.**

'మీరు వేసే బొమ్మలు చూస్తుంటే... అలనాటి జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తున్నాయి'. 'మీ గొంతు వింటే ఏదో తెలియని ప్రశాంతత'. 'గతాన్నీ, వర్తమానాన్నీ జోడిస్తూ ' ఏం గీశారండి చిత్రాలు'. 'శాండ్‌విచ్, బర్గర్లను ఇష్టపడు తున్న ఈ తరానికి దేశీ వంటకానివి నువ్వు' . ఇలాంటి వందల కామెంట్లు హరితకు రోజూ పరిపాటి. ఇవన్నీ తనలో కొత్త ఉత్సాహాన్ని నింపి ఇంకా మంచి విషయాల్ని చెప్పడానికీ, చూపించడానికీకారణమవు తున్నాయి అంటారు హరిత. ఈమెది హైదరాబాద్ ఆర్కిటెక్చర్ చదువుకున్నారు. కొన్నాళ్లు ఉద్యోగమూ చేశారు. కానీ పాప పుట్టాక.. తన ఆలనాపాలనా చూసుకోవడానికి ఇంటికే పరిమితం అయ్యారు. దాంతో కెరియర్‌లో వెనకపడిపోతున్నా అన్న ఆందోళన.. వీటన్నింటి నుంచి బయటపడటానికి తనకెంతో ఇష్టమైన బొమ్మలు గీయడాన్ని మళ్లీ ప్రారంభిచారు. 'బాపూ, రవివర్మ చిత్రాలంటే ఇష్టం నాకు. చిన్నప్పట్నుంచీ వాటిని చూస్తూ పెరిగా. పైగా అమ్మ భాగవతుల విజయలక్ష్మికి కూడా ఆర్ట్స్ అంటే ఇష్టం. సమ్మర్‌లో పిల్లలకి తరగతులూ చెప్పేవారు. కానీ నేనెప్పుడూ ఆ దిశగా ప్రయత్నించలేదు. చదువు, కెరియర్‌పైనే దృష్టి. దీన్నెప్పుడూ కెరియర్‌గా మలుచుకోవాలనుకోలేదు' అంటారు హరిత.



**గుర్తున్నాయా ఆ రోజులు...** 'బొమ్మలు గీయడం ఎవరైనా చేస్తారు. కానీ వేసే చిత్రమేదైనా.. జీవితాన్నీ, విలువల్నీ, మంచినీ చెప్పేదిగా ఉండాలి. ముఖ్యంగా పిల్లలకు ఇవి ఉపయోగపడాలి. ఒక విషయాన్ని చదివి తెలుసుకుంటే గుర్తుండేది 40 శాతమే. అదే, చూస్తే 90 శాతం ప్రయోజన ముంటుంది. ఇది నేను కాదు, అధ్యయనాలు చెప్పి మాట. మంచో చెడో సామాజిక మాధ్యమాలకి సమయాన్ని కేటాయిస్తున్న పిల్లల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. అలాంటి వారికి ఈ మార్గంలో తపొప్పప్పుల పాఠాలు బోధిస్తే బాగుంటుంది అనిపించింది. అదేదో లెక్చర్‌లా చెబితే వెంటనే రీల్ మార్చేస్తారు. పాత చింతకాయ పచ్చడినే.. 'ట్యామరెండ్ పికిల్ అంటూ కొత్తగా అందిస్తున్న రోజులివి. అందుకే వేదాలు, భాగవతం, పురాణాలనే థీమ్‌గా ఇలస్ట్రేషన్స్ గీస్తున్నా. వాటికి వాయిస్ ఓవర్ కూడా ఇస్తున్నా. ఒకప్పుడు ఇవన్నీ పెద్దవాళ్ళు చెప్పేవారు. కానీ పట్టణ జీవితాలు, చిన్నకుటుంబాలు వల్ల అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల మాటలు, కథలు అన్నీ దూరమవుతున్నాయి. 'గుర్తున్నాయా ఆ రోజులు థీమ్‌తో రీల్స్ చేసిందీ అందుకే. నేను ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నా. అవసరమైనప్పుడల్లా వచ్చిపోతుంటా.



టాలీవుడ్ సినిమాలకీ డిజిటల్ ఇలస్ట్రేషన్స్ చేస్తున్నా. నానీ, నివేదా, థామస్, నవదీస్ నటించిన సినిమాలకు పనిచేశా. బొమ్మలూ గీశా. ఈ మధ్యే డబ్బింగ్ కూడా మొదలుపెట్టా రెండున్నరేళ్ల పాపతో ఇవన్నీ చేసుకోవడంలో నా భర్త డా. పవన్ కుమార్ అందించే సహాయం మరచిపోలేనిది. మనసుకు నచ్చింది చేయి. అప్పుడే సంతోషంగా ఉంటావంటూ నాన్న చెప్పే మాటే నాకు స్ఫూర్తి అనే హరిత.. 2డి, 3డి యానిమేషన్స్‌లో దూసుకుపోతోంది. □

# ఎండల్లో చల్లగా హాయిగా !

ఫ్యాషన్ ఫ్యాషన్



నూలు **దుస్తులంటే** అమ్మమ్మ, నానమ్మలు ఇష్టపడే ముతక రకాలనుకునే రోజులు కావివి. సంప్రదాయ రూపమైనా ఇండో వెస్ట్రన్ కాంబినేషన్ అయినా కాటన్ స్టైలిష్‌గా వెలిగిపోతోంది. అందుకే, వేసవిలో చల్లదనం, సౌకర్యం కావాలంటే చాలామంది తొలి ఎంపిక కాటన్ దుస్తులే. సుతిమెత్తగా, గాలి ఆడుతూ ఉండటంతో ఇవి మహిళలఫేవరిట్‌గా మారిపోయాయి. వేసవిలో చల్లదనంతోపాటు స్టైల్‌నీ కోరుకునే నూలు దుస్తులు చక్కని ఎంపిక. ఈ సంవత్సరుం పేస్టల్ కలర్స్, పసుపు, మింట్ గ్రీన్, బటర్ ఎల్లోతోపాటు డీప్ కలర్స్ మెకా బ్రౌన్, హాట్ పింక్ వంటివి కాటన్‌కు కొత్త శోభను తీసుకువచ్చాయి. ఇక స్టైల్ విషయానికి వస్తే.. కుర్తీలతోపాటు అనార్కలీ, మాక్సీ డ్రెస్‌లు, ఫ్రాక్‌లు, పలాజోలు, కో-ఆర్డ్ సెట్‌లు యువతని ఆకట్టుకుంటున్నాయి. వీటికి జతగా ఫ్లోరల్, చారలు, పోల్కా డాట్స్ వంటి క్లాసిక్ ప్రింట్లు ట్రెండీగా మారాయి. చీరల్నీ ఎంచుకుంటోంది తరం. కాసేపు ఎండలోకి వెళ్లొస్తే చాలు.. ఒళ్లంతా చెమట, జిగురు. ఇలాంటప్పుడు సిల్కు, క్రేప్, పాలియెస్టర్, నైలాన్ వంటి దుస్తులు వేసుకుంటే సరిగా గాలి ఆడదు ఖాదీ కాటన్ ఎంచుకోండి. ఇందులోని ఫైబర్ సహజ ఎయిర్ కండిషన్‌గా, ఇన్సులేటర్‌గా పనిచేయడంతో వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుంది. □







# పాలతో అందం ఆరోగ్యం !

పాలు **పోషకాలతో** నిండి ఉంటాయి చిన్నా, పెద్దా.. అందరూ క్రమం తప్పకుండా తీసుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉంటాం. పాలలోని పోషకాలు మనకు శక్తితోపాటు రక్షణనూ ఇస్తాయి. మరి ఈ పాలలో ఉండే మరిన్ని సుగుణాలేంటో చూద్దామా..



- పాలలో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్ పాంథోనిక్ యాసిడ్, సెలీనియమ్, నియాసిన్ లాంటి మూలకాలు, విటమిన్-ఎ, డి, బి6 లాంటి పోషకాలుంటాయి. వీటిలోని క్యాల్షియం దంతాలు, ఎముకలు దృఢంగా ఉండటానికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ నుంచి కాపాడుతుంది.
- . మాంసకృత్తులు కండరాలు బలపడటానికి దోహదపడతాయి. రోజూ రాత్రిపూట గ్లాసు పాలు తాగితే చక్కగా నిద్రపడుతుంది. కండరాలన్నీ సాంత్వన చెందుతాయి కూడా.
- . బరువు తగ్గలనుకునేవారికిపాలు చక్కటి ఎంపిక. గోరువెచ్చని పాలలో కాస్తంత పసుపు వేసుకుని తాగితే గొంతునొప్పి, జలుబు దూరమవుతాయి.
- . పోషకాలుండే పాలను రోజూ రెండు పూటలా తాగితే చర్మం కాంతిమంతంగా తయారవుతుంది.
- . పాలలోని విటమిన్లు, మినరల్స్ ఒత్తిడిని తగ్గిస్తాయి.
- . బడలికగా, అలసటగా అనిపించినప్పుడు ఓ గ్లాసు పాలు తాగి చూడండి. నిస్సత్తువ వెంటనే పోతుంది.
- . క్రమం తప్పకుండా తాగుతూ ఉంటే శరీరం డీ హైడ్రేట్ అవదు. □

# సప్త క్షయవ్యాధి సంక్రమణ - 2

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

**జాగ్రత్తలు** : సప్తక్షయవ్యాధికి రిఫాంపిసిన్, ఐసోనియా జిడ్ మందులు మొదటి మూడునెలలు, లేదా ఐసోనియా జిడ్ మందుని ఆరునెలల పాటు వైద్య నిర్ధారణ పరీక్షల అనతరం రోగి వయస్సు, ఆరోగ్య పరిస్థితిని బట్టి మందుల్ని వాడాల్సి ఉంటుంది. ఐ మందులు అంటే అవి వాడరాదు. వీటిని భోజనానికి ఒక గంట ముందు లేదా భోజనం తర్వాత రెండు గంటలకు వాడాల్సి ఉంటుంది. మీకు నచ్చిన దీన్ని ఏదైనా తినవచ్చు. స్వీట్స్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తినరాదు. పోషకాహారలోపం లేకుండా చూచుకోవాలి. రోగనిరోధక శక్తిని పెంపొందించే విధంగా శారీరక, మానసిక విశ్రాంతిని పొందాల్సి ఉంటుంది. ఇది ఏమిటి (మైక్రోబ్యాక్టీరియం ట్యూబిర్క్యులస్) కాంప్లెక్స్ ఆంటిజెన్‌లకు నిర్దిష్ట రోగ నిరోధక ప్రతిస్పందనను గుర్తించడం ద్వారా నిర్వహించబడుతుంది. ఆంటిబయాటిక్ చికిత్స ద్వారా దీన్ని నివారించవచ్చు. ఎందుకంటే ఇవి సంక్లిష్టమైన లిపిడ్ రిబ్‌సెల్ ఎన్విలిప్‌తో విభిన్నంగా ఉంటాయి. ఇది వ్యాధి యొక్క క్లినికల్ లక్షణాలు కల్గి ఉండక మైక్రో బాక్టీరియల్ ఆంటిజెన్‌కు రోగనిరోధక సున్నితత్వం కల్గి ఉంటుంది. ఇది ఒక లక్షణం లేని స్థితి ఉన్న క్లినికల్ కండీషన్. ఆరోగ్యకరమైన వ్యక్తులు జీవితకాలం సప్తక్షయవ్యాధిని కల్గి ఉంటారు. సప్త క్షయవ్యాధిని నియంత్రించడం అన్ని విధాలా ముఖ్యం క్షయ నియంత్రణలో పురోగతి సాధించాలంటే సప్తక్షయవ్యాధి సంక్రమణ రిజర్వాయర్‌ని పరిష్కరించడం చాలా కీలకం. ఎందుకంటే ఈ రోగులు క్రియా శీల క్షయకేసులకి రిజర్వాయర్స్‌గా పనిచేస్తారు. హెచ్ఐవి పాజిటివ్ ఉన్న వారికి (స్కానింగ్ టెస్ట్ చేయించాలి. సప్త క్షయవ్యాధి చికిత్స సవాలుగా ఉన్నప్పటికి వీరిని పరీక్షించడం మరియు చికిత్స చేయడంపై దృష్టి పెట్టాలి. ప్రపంచవ్యాప్తంగా 33% మంది (2.3 బిలియన్ల ప్రజలు) సప్తక్షయవ్యాధిని కల్గి ఉంటే వారిలో 3.5 లక్షల మంది ఐదేళ్ళలోపు పిల్లలు బాధపడుతున్నారు. వీరి శరీరంలో వ్యాధి ఏజెంట్‌ను సక్రియం చేయడం ద్వారా టి.బి. యొక్క క్యారియర్ కావచ్చు. మైక్రో బ్యాక్టీరియం సక్రియం అయ్యేవరకు రోగులు వ్యాధిని వ్యాప్తిచేయలేరు. వీరిని చికిత్స చేయకుండా వదిలేస్తే కొంతమంది వారి జీవితమంతా క్రమంగా టిబి వ్యాధిని అభివృద్ధి చేస్తారు. వీరిని విస్మరిస్తూ ఆక్టివ్ టి.బి. ఉన్న వ్యక్తుల సమర్థవంతమైనా రోగా నిర్ధారణ మరియు చికిత్సగా కొనసాగుతుంది.

సప్త క్షయవ్యాధి కోసం వాక్సిన్స్ ఇప్పుడు క్లినికల్ ట్రయల్స్‌లో ఉన్నాయి. వీటిని గుర్తించడానికి సమానమైన ప్రమాణం లేదు. ఎందుకంటే ఊపిరితిత్తుల్లోని ఎగువలోబ్స్‌లోని ప్రారంభగాయాల్లో సప్తబాసిల్లే నిద్రాణంగా ఉంటుంది. ఐఎన్‌హెచ్ ట్రీట్‌మెంట్ తీసుకుంటే 25%-92% తగినట్లు ట్రయల్స్ చూపించాయి. వీరిలో చాలావరకు నాల్గింట ఒక వంతు భారతదేశంలోనే ఉన్నారు. వీరు ప్రపంచ జనాభాలో 25% ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. వీరిని టి.బి. కారియర్స్‌గా పరిగణించవచ్చు. వీరు మందులు వాడినట్లయితే రక్తదానం ఇవ్వవచ్చు. సంతానాన్ని పొందవచ్చు. తల్లిపాలద్వారా క్షయ సంక్రమించే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది. సప్తక్షయవ్యాధి చికిత్స పూర్తిచేసే వరకు బీర్, వైన్, మద్యం పొగాకు సేవించరాదు. అయితే ఆంటీక్షయవ్యాధి (ఐఎన్‌హెచ్) చికిత్సవల్ల కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కల్గుతాయి.

**సాధారణ సైడ్ ఎఫెక్ట్స్** : ఫ్లూ జ్వరం లక్షణాల కల్గుతాయి. డిజ్జీనెస్ ఆకలి లేకపోవడం, విరేచనాలు, జ్వరం, బరువు తగ్గడం, ఆయాసం వంటి సాధారణ సైడ్ ఎఫెక్ట్స్ కల్గుతాయి. □

# నురగ స్నానం మంచిదేనా?

**వేసవి ఉష్ణోగ్రతల** నుంచి సేదతీరేందుకు షవర్‌బాత్‌లూ టబ్‌బాత్‌లూ చేస్తుంటారు. కొందరు వీటివల్ల మహిళలకు యూటీల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందంటున్నాయి అధ్యయనాలు. నురగ ఎక్కువ రావడానికి ఉపయోగించే రసాయానలు జననేంద్రియాలో మంట, దురదను కలిగిస్తాయి. సహజంగా యోని పిహెచ్ ఆమ్లత్వాన్ని కలిగి ఉంటుంది. ఇది ఆరోగ్యకర బ్యాక్టీరియాను కాపాడటంలో సాయపడుతుంది. బబుల్‌బాత్ లిక్విడ్‌లో ఉండే హానికారక రసాయనాలు. జననేంద్రియాల్లో ఉండే సహజ నూనెలను తొలగించడంతో ఆ ప్రదేశం పొడిగా మారే అవకాశం ఉంది. అలా కాకూడదంటే మీ చర్మతత్వాన్ని బట్టి సల్ఫేట్లు లేని బాత్‌సోప్ లిక్విడ్లు మాత్రమే ఎంచుకోవాలి. పావుగంటకు మించకుండా స్నానం చేయాలి. స్నానానంతరం జననేంద్రియాలను తడి లేకుండా తుడవాలి. □



# త్రిలోక సంచారి

ఆధ్యాత్మికం

మనకు త్రిమూర్తులు తెలుసు. వారు ఉండే లోకాలు శివుడు కైలాసం, విష్ణువు వైకుంఠం, ఇక బ్రహ్మ ఉండే లోకాన్ని బ్రహ్మ లోకం లేదా సత్యలోకం అని పిలుస్తారు. త్రిలోక సంచారి అని ప్రసిద్ధుడయినా నారద మహర్షికి ఈ లోకాలన్నీ తిరిగి లోక ఖ్యాతి పొందాడు. నారాయణ అనే నామస్మరణతో ఈ లోకాలను దర్శించి ఒక చిన్న తప్పు దొరికినా తగవు పెట్టడం నారదునికి వెన్నతో పెట్టిన విద్య. అందుకే శ్రీ కృష్ణ పరమాత్ముడు 'ఊరకరారు మహర్షులు' అనే వాడు చిరునవ్వుతో. 'నారాయణ నారాయణా' అని ఉదరంతో చేయి తాకేవాడు నారదుడు. 'కలహా భోజనుడు అని ఊరకే అనలేదు మరి 'అనే వారు శ్రీకృష్ణుల వారు. నాదేముంది కృష్ణా అంతా మీ మహిమనే నారాయణ అంటూ అక్కడ నుంచి కుచేలుని ఇంటి వైపు కదిలాడు నారదుడు. నారదుడు వెళ్ళే సమయానికి విపరీత ఆకలితో నక నక లాడుతున్నారు కుచేలుని సంతానం. 'నీకు శ్రీకృష్ణుడు బాల్య మిత్రుడు కద, ఏమైనా సహాయం అర్థించు' అని కుచేలుని భార్య రోదిస్తూ అంది. దానికి కుచేలుడు మౌనంగా ఉన్నాడు. అదే సమయానికి నారాయణ అంటూ వచ్చాడు నారద మహర్షి. పరిస్థితి వివరించింది కుచేలుని భార్య. నారదుడు చిరునవ్వు నవ్వుతూ నన్ను అందరూ కలహా భోజనుడు అంటారు కాని నేను చేసే మంచి ఎవరూ గ్రహించరు అన్నాడు. ఆనందంతో నారదుని వైపు చూసింది కుచేలుని భార్య. "శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్ళవయ్య"అని పురమాయించాడు. వెంటనే కుచేలుని భార్య అటుకులు అతని వస్త్రానికి కట్టి పంపింది. "పోయిరా మంచే జరుగుతుంది" అన్నాడు నారదుడు. ద్వారకాలో బిక్కు బిక్కు మని శ్రీకృష్ణుని దగ్గరకు వెళితే ద్వారపాలకుడు గేంటేశాడు. 'కృష్ణా' అంటూ మూలిగాడు. వెంటనే శ్రీ కృష్ణుడు వచ్చి కుచేలుని అలింగనం చేసుకుని సాధారంగా లోపలికి తీసుకుపోయి సమర్యలు చేశాడు. వస్త్రానికి కట్టిన అటుకులు మూట కుచేలుడు దాచి పెట్టడానికి ప్రయత్నిస్తే 'కృష్ణుడు అ మూట నా కోసమే కదా' అని లాక్కొని మూట విప్పి పిడికేడు అటుకులు నోట్లో వేసుకున్నాడు. అదే సమయానికి నారద మహర్షి నమస్కరిస్తూ నాకు కలహా భోజనుడు అనే పేరే కాదు. మంచి భోజనుడు అని పేరు వస్తుంది అన్నాడు. ఎప్పుడైతే శ్రీకృష్ణుడు అటుకులు నోట్లో పోసుకున్నాడో కుచేలుని జీవితం మారి పోయింది. త్రిలోక సంచారి నారదుడు చేసిన మంచి పని ఇది.

**- కనుమ ఎల్లారెడ్డి.**

# డిన్నర్ త్వరగా చేయాలి..!


**ఎంతోమందిని వేధించే ఆరోగ్య సమస్యల్లో మధుమేహం ఒకటి. అయితే దీని బారిన పడకుండా ఉండాలంటే ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లను దూరం చేసుకోవడం ఎంతో ముఖ్యమంటున్నారు నిపుణులు.**

**ఆ జీవనశైలికి దూరంగా..** కొంతమంది ఇల్లు, ఆఫీసు పనులతోనే రోజంతా గడిపేస్తుంటారు. ఈ క్రమంలో వ్యాయామానికి ఏ మాత్రం ప్రాధాన్యం ఇవ్వరు. ఇలాంటి జీవనశైలి వల్ల మదుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు. అందుకే రోజులో కనీసం 40 నిమిషాలు వ్యాయామానికి. 20 నిమిషాలు ప్రాణాయామం చేయడానికి కేటాయించాలని చెబుతున్నారు. వ్యాయామంలో భాగంగా వాకింగ్, సైక్లింగ్, కార్డియో, యోగా వంటి వాటిని ఎంచుకోవాలని సూచిసునతన్నారు. ఇలా శరీరానికి శ్రమ కలిగించడం వల్ల రక్తప్రసరణ మెరుగవ్వడంతో పాటు శరీరంలోని ప్రతి కణానికి సరిపడినంత ఆక్సిజన్ సరఫరా అవుతుందని చెబుతున్నారు. అలాగే ఇన్సులిన్ కూడా అవసరమైనంత మేరకు ఉత్పత్తి అవుతుందంటున్నారు. డిన్నర్ త్వరగా చేయాలి.. రక్తంలో చక్కెర స్థాయులు వల్లే మధుమేహం వస్తుందన్న విషయం తెలిసిందే. అయితే చక్కెర స్థాయులను తగ్గంచుకోవాలంటే రాత్రి భోజనాన్ని ఎంత తొందరగా ముగిస్తే అంత మంచిదంటున్నారు నిపుణులు. వెంటనే వద్దు.. చాలామంది తిన్న వెంటనే నిద్రపోవడానికి ప్రయత్నిస్తారు. లేదంటే గ్యాడ్జెట్లతో కాలక్షేపం చేస్తుంటారు. ఈ అలవాటు ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా మధు మేహం ఉన్నవారు తిన్న వెంటనే పడుకోవడం వల్ల చక్కెర స్థాయులు పెరుగుతాయంటున్నారు. అందుకే సాధ్యమైనంత వరకు తిన్న వెంటనే నిద్రపోకూడదని సూచిస్తున్నారు. రాత్రి భోజనం కూడా వీలైనంత త్వరగా తీసుకోవాలని చెప్పడానికి కూడా ఇదే కారణం.



**అవి. మాత్రమే సరిపోవు...** కొంతమంది ఎలాగూ మందులున్నాయని మధుమేహాని తేలిగ్గా తీసుకుంటారు. అయితే ఈ సమస్యకు కేవలం మందుల మీదే ఆధారపడడం మంచిది కాదు. మందులు ఎక్కువగా తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో దాని ప్రభావం కాలేయం, కిడ్నీలపై పడుతుందని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి, వీటతో పాటు పైన పేర్కొన్న జాగ్రత్తలను పాటించడం మర్చిపోవద్దని సూచిస్తున్నారు. □

# బాదం పేడా



**కావలసినవి** : బాదంపప్పు-రెండు కప్పులు, పంచదార-కప్పు, పాలపొడి, నెయ్యి- అరకప్పు చొప్పున, కుంకుమ పువ్వు- కొద్దిగా,

**తయారీ** : బాదంపప్పు రెండు నిమిషాలు ఉడికించాలి.పొట్టు తీసి మిక్సీ జార్‌లో వేసి, అరకప్పు పంచదార, రెండు చెంచాల నీళ్ల, కుంకుమ పువ్వు జతచేసి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని అడుగు భాగం మందంగా ఉన్న గిన్నెలో వేసి అరకప్పు పాల పొడి, చెంచా నెయ్యి వేసికలియతిప్పుతూ దగనగరపడేలా చేయాలి. చల్లారా, చిన్న ఉండులుగా తీసుకుని పేడాల్లా చేయాలి. వాటి మధ్యలో బాదంపప్పు అలంకరిస్తే సరి. మధురమైన బాదం పేడా రెడీ. □

# కోహ్లీ కంటే ముందే అరంగేట్రం



ఇషాంత్ శర్మ



చతేశ్వర్ పుజారా



జయదేవ్ ఉనద్కట్

## ఇంకా రిటైర్ కాని టీమిండియా క్రికెటర్లు
## జాబితాలో ఇషాంత్, చెతేశ్వర్, జయదేవ్

**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ కంటే ముందు టెస్ట్ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన పలువురు భారతీయ ఆటగాళ్లు ఉన్నారు. ఇందులో కొంతమంది ఇంకా రిటైర్మెంట్ ప్రకటించ లేదు. భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. కోహ్లీ 2011లో వెస్టిండీస్‌పై టెస్ట్ అరంగేట్రం చేశాడు. అలాగే ఈ ఏడాది జనవరిలో ఆస్ట్రేలియాపై తన చివరి టెస్ట్ ఆడాడు. గత 14 సంవత్సరాలలో, ఈ కుడిచేతి వాటం స్టార్ బ్యాట్స్‌మన్ 123 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. టెస్ట్ క్రికెటర్‌గా తన కెరీర్‌లో 30 సెంచరీలు, 31 అర్ధ సెంచరీలు సాధించాడు. అయితే కోహ్లీ కంటే ముందు టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేసి రిటైర్ కాని ముగ్గురు క్రికెటర్లు ఉన్నారు. విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో ఇషాంత్ శర్మ భారత టెస్ట్ జట్టులో కీలక పాత్ర పోషించాడు. ఈ కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ మొత్తం 105 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 311 వికెట్లు పడగొట్టాడు. ఈ కాలంలో, అతను 11 సార్లు 5 వికెట్లు, ఒక మ్యాచ్‌లో 10 వికెట్లు తీశాడు. ఇషాంత్ తన టెస్ట్ కెరీర్‌ను 2008లో ఆస్ట్రేలియాపై ప్రారంభించాడు. అతను తన చివరి టెస్ట్ మ్యాచ్‌ను నవంబర్ 2021లో న్యూజిలాండ్‌తో ఆడాడు. అప్పటి నుంచి అతను జట్టులోకి తిరిగి రాలేదు సరికదా రిటైర్మెంటూ ప్రకటించ లేదు. మరో అనుభవజ్ఞుడైన భారత క్రికెటర్ చతేశ్వర్ పుజారా కూడా ఉన్నారు. కోహ్లీ కెప్టెన్సీలో టీమిండియా సాధించిన విదేశీ విజయాలలో పుజారా కీలక పాత్ర పోషించాడు. పుజారా ఇప్పటివరకు భారత్ తరపున 103 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. అతను 3 డబుల్ సెంచరీలు, 19 సెంచరీలు, 35 అర్ధ సెంచరీలతో సహా 7,195 పరుగులు చేశాడు. తన తొలి టెస్ట్ మ్యాచ్‌ను 2010లో న్యూజిలాండ్‌తో ఆడాడు. అతని చివరి మ్యాచ్ 2023లో ఇంగ్లాండ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన డబ్ల్యూటిసి ఫైనల్ ఆడాడు. అతను ఇప్పటికీ రెడ్‌బాల్ టోర్నమెంట్‌లలో చురుగ్గా ఉన్నాడు. ఇక ం ఇప్పటివరకు 4 టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. కానీ, అతను విరాట్ కోహ్లీ కంటే ముందే టెస్ట్ అరంగేట్రం చేశాడు. 2010లో సూపర్ స్పోర్ట్ పార్క్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌కు ముందు ఉనద్కద్ తన తొలి టెస్ట్ క్యాప్‌ను అందుకున్నాడు. ఈ ఎడమచేతి వాటం పేసర్ తన తొలి మ్యాచ్‌లో పెద్దగా ఆకట్టుకోలేక పోయాడు. 2022 చివర్లో బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ కోసం ఉనద్కద్ భారత టెస్ట్ జట్టులోకి తిరిగి వచ్చాడు. 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో కూడా ఉనద్కద్ ఆడాడు. విరాట్ కంటే ముందే ఉనద్కట్ టెస్ట్ అరంగేట్రం చేశాడు. ఇంకా రిటైర్ కాలేదు. కానీ, విరాట్ కెప్టెన్సీలో అతనికి టెస్ట్ ఆడే అవకాశం ఎప్పుడూ రాలేదు.



## మహిళల టి20, వన్డే.. ఇంగ్లండ్‌తో పోరుకు భారత్ రెడీ

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనకు భారత్ మహిళా జట్టు సిద్ధమైంది. ఈ పర్యటనలో భారత్ 5 టి20లు, 3 వన్డేల్లో పాల్గోనుంది. ఈ మేరకు జట్టును సెలక్టర్లు ప్రకటించారు. టి20 కోటం 15 మందిని, వన్డేలకు 16 మందిని ఎంపిక చేయగా, రెండు టీమ్‌లకు హార్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మందాన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత్ జట్టు అడనున్న అఖరి వన్డే సిరీస్ ఇదే కానుంది. దూకుడైన అటతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ ఓపెనర్ షఫాలీ వర్మ భారత్ జట్టులో పునరాగమనం చేసింది. గత ఏడాది అక్టోబరు తర్వాత అమె స్థానం కోల్పోయింది. ఉమెన్ ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున 9 మ్యాచ్‌లలో 304 పరుగులు చేసి షఫాలీ సత్తా చాటింది. అయితే షఫాలీని టీ20లకు మాత్రమే ఎంపిక చేసిన సెలక్టర్లు వన్డే జుట్టులో స్థానం కల్పించ లేదు. ఇక వికెట్ కీపర్ బ్యాటర్ యస్తిక భాటియా కూడా తిరిగి జట్టులోకి వచ్చింది. గత ఏడాది నవంబరులో మణికట్టు గాయంతో అటకు అమె దూరమైంది. యస్తికకు వన్డే, టి20ల్లో రెండు టీమ్‌ల్లోనూ చోట లభించింది. ఇటీవల శ్రీలంకతో ముక్కోణపు టోర్నీలో ప్లేయర్ అఫ్ ద టోర్నీగా నిలిచిన స్నేహ్ రాణా కూడా టి20ల్లో మళ్లీ చోటు దక్కించుకుంది. ఇదే టోర్నీలో అకట్టుకుంటున్న అంధ్రప్రదేశ్ లోని వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన లెఫ్టార్మ్ స్పిన్నర్ శ్రీచరణి తొలిసారి టి20 టీమ్‌లోకి ఎంపికైంది. హైదరాబాద్ పేసర్ అరుంధతి కూడా టి20లోకి పునరాగమనం చేసింది. భారత్ మహిళల టి20 టీమ్‌లో హన్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మందాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్, యస్తిక భాటియా, హర్లీన్ డియోల్, దీప్తి శర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, శుచి ఉపాధ్యాయ్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి, క్రాంతిగౌడ్, సయాలీ సత్‌ఘరే ఉన్నారు.

## ఇటాలియన్ ఓపెన్‌లో.. సబలెంకకు షాక్



**న్యూఢిల్లీ:** మహిళల టెన్నిస్‌లో ప్రపంచ నంబర్‌వన్‌గా ఉన్న అరీనా సబలెంకకు ఇటాలియన్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న ఈ టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సబలెంక 4-6, 3-6తో కిన్వెన్ జెంగ్ (చైనా) చేతిలో పరాభవం పాలైంది. 22 ఏండ్ల ఈ చైనా అమ్మాయికి కెరీర్‌లో సబలెంకపై ఇదే తొలి విజయం. 2025 ఇటాలియన్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్ 1 అరినా సబలెంకా, ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ జెంగ్ క్విన్వెన్ చేతిలో షాక్ ఓటమి పాలైంది. తన సీజన్‌లో ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచి సబలెంకాను ఓడించింది. ఓటమి సమయంలో సెంటర్ కోర్టులోని రోగ్ హెక్లర్‌తో జరిగిన మ్యాచ్‌లో సబలెంకా తన సహనాన్ని కోల్పోయింది. సబలెంకా మరియు క్విన్వెన్ మధ్య ఇది ఏడవ పోరు. క్విన్వెన్‌పై సబలెంకా సాధించిన అతిపెద్ద విజయం 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో జరిగింది. అయితే, శుక్రవారం ప్రపంచ 8వ ర్యాంక్ క్రీడాకారిణి అద్భుత ప్రదర్శన చేసి హెడ్ టు హెడ్ రికార్డును 1-6కి స్వల్పంగా మెరుగు పరిచింది. కాగా ఎనిమిదో సీడ్ జెంగ్ సెమీస్‌లో అమెరికా సంచలనం కోకో గాఫ్‌తో తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో అల్కారజ్ 6 4-, 64-తో డ్రాపర్ (బ్రిటన్)ను ఓడించి సెమీస్‌కు దూసుకెళ్లాడు.

# నేటి నుండి ఐపిఎల్ మళ్లీ స్టార్ట్





**న్యూఢిల్లీ:** భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితి ముగిసిన తర్వాత, మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 నేటి నుంచి ప్రారంభమవుతుంది. కాగా, మే 8న, భద్రతా కారణాల దృష్ట్యా పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ అకస్మాత్తుగా మధ్యలో ఆగిపోయింది. దీంతో బిసిసిఐ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఐపిఎల్‌ని ఒక వారం పాటు వాయిదా వేసింది. ఇప్పుడు ఐపిఎల్ 2025 రెండవ దశలో, మొదటి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ వర్సెస్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరుగనుంది. ఇది రాత్రి 7:30 నుంచి ఎం చిన్నస్వామి స్టేడియంలో జరుగుతుంది. అజింక్య రహానే నేతృత్వంలోని కోల్‌కతా జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌తో తమ చివరి మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత ప్లేఆఫ్‌కు కోల్‌కతాకు మార్గం చాలా కష్టంగా మారింది. కెకెఆర్‌కి ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. రెండింటిలోనూ గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు ఉండొచ్చు.

### కోల్‌కతా-బెంగళూరు మధ్య కీలక పోరు
### కెకెఆర్ ప్లేయింగ్ ఎలెవెన్‌లో కీలక మార్పులు

ఈ రెండు గెలిస్తే, కోల్‌కతా 15 పాయింట్లను మాత్రమే చేరుకోగలదు. ఇటువంటి పరిస్థితిలో వారు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఈ క్లిష్ట పరిస్థితిలో, కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్ రౌండర్ మొయిన్ అలీ జట్టును విడిచిపెట్టి ఇంటికి తిరిగి వచ్చాడు. అయితే ఈ మ్యాచ కెకెఆర్‌కు కీలకం కానున్న దృష్ట్యా ప్రాబబుల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో కీలక మార్పులు చేసింది. అజింక్యా రహానే (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, సునీల్ నరైన్, వెంకటేష్ అయ్యర్, రింకూ సింగ్, ఆండ్రీ రస్సెల్, రోవ్‌మన్ పావెల్, వైభవ్ అరోరా, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి, అనుకూల్ రాయ్. ఇంపాక్ట్ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీగా మార్పులు చేసింది.

## బ్యాడ్మింటన్ టోర్నీలో.. భారత్ ఆలౌట్
## తరుణ్, ఉన్నతి, మాళవిక, ఆకర్షి ఓటమి



తరుణ్



ఉన్నతి



మాళవిక




ఆకర్షి

**న్యూఢిల్లీ:** సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్న మెంట్‌లో భారత్ క్రీడాకారులు ఘోర పరాజయం చెందారు. పురుషుల సింగిల్స్ విభాగంలో మన్నేపల్లి తరుణ్, మహిళల సింగిల్స్ విభాగంలో ఉన్నతి హుడా, మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయంత్రి- ట్రెసా జాలీ జంట ప్రీక్వార్టర్ ఫైనల్స్‌ను దాటలేకపోయారు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ డ్రాలో అడుగు పెట్టిన తరుణ్ బ్యాంకాక్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 14-21, 16-21తో ప్రపంచ మూడో ర్యాంకర్, డెన్మార్క్‌కు చెందిన అంటోన్‌సెన్ చేతిలో ఓడిపోయాడు. 42 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తరుణ్ రెండో గేమ్‌లో కాస్త పోటీనిచ్చాడు. ఇక మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉన్నతి హుడా 14-21, 11-21తో ప్రపంచ రెండో ర్యాంకర్ థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పవీ చోచువోంగ్ చేతిలో పోరాడి ఓటమి చెందింది. అలాగే 9-21, 14-21తో థాయ్‌లాండ్‌కు చెందని సుపనిద కటెథోంగ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఆకర్షి కశ్యప్ పరాజయం చెందింది. ఇక మాళవిక బన్సోద్ 12-21, 16-21తో ప్రపంచ మాజీ ఛాంపియన్ థాయ్‌లాండ్‌కు చెందిన ఇంతనోన్ రచనోక్ చేతిలో ఓటమి చవి చూసింది. కాగా మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 20-22, 14-21తో జపాన్‌కు చెందిన రుయ్ హిరోకామి-సయాకా హోబారా జోడీ చేతిలో ఓడిపోయింది.

# తుర్కియే సెలెబీకి ఈక్విటీ షాక్

**ముంబై, మే 17:** తుర్కియేకు చెందిన సెలెబీకి భారత్ కొట్టిన దెబ్బ కాస్త గట్టిగానే తాకినట్లుంది. మే 16న ఇస్తాంబుల్‌లో ఆ కంపెనీ షేరు ధర ఏకంగా 10శాతం పతనమైంది. గత నాలుగు సెషన్లలో ఈ షేరు విలువ 30శాతం ఆవిరైంది. సెలెబీ సబ్సిడరీ కంపెనీ ద్వారా భారతీయ విమానాశ్రయాలలో సరకుల రవాణాతోపాటు బహుళ సేవలను ఇన్నాళ్లూ అందించింది. కానీ, ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే ప్రభుత్వం పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడంతో పాటు తమ సైనికులను అక్కడకు పంపింది. దీంతో ఆగ్రహించిన భారత ప్రభుత్వం సెలెబీకి ఉన్న సెక్యూరిటీ క్లియరెన్స్‌లను రద్దు చేసింది. మరోవైపు అదానీ ఎయిర్ పోర్టు సంస్థ కూడా సెలెబీతో ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. దీంతో ముంబయి, అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచి అది బయటకు వెళ్లినట్లైంది. ఈ విషయాన్ని రెండు ఎయిర్ పోర్టులకు చెందిన ప్రతినిధి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అదానీఎయిర్ పోర్ట్స్ హోల్డింగ్‌కు ముంబయి, అహ్మదాబాద్, మంగళూరు, గువహటి, జైపుర్, లఖ్‌నవూ, తిరువనంతపురం విమానాశ్రయాలను నిర్వహిస్తోంది.



ప్రభుత్వ నిర్ణయం తర్వాత దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు లిమిటెడ్ కూడా తన ఒప్పందాన్ని రద్దు చేసుకొంది. ఆ స్థానంలో ఏఐఎస్‌ఏటీఎస్, బర్డ్‌గ్రూప్‌తో కలిసి పనిచేయనున్నట్లు తెలిపింది. ఇక తమది తుర్కియే కంపెనీయే కాదని తాజాగా సెలెబీ వివరణ ఇచ్చింది. ఆ దేశాధ్యక్షుడు ఎర్డోగాన్ కుటుంబంతో తమకు సంబంధం లేదని, ఆయన కుమార్తె తమకు బాస్ కాదని వివరణ ఇచ్చింది. తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ కుమార్తె సుమెయ్యి మా కంపెనీని నియంత్రిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. మా మాతృ సంస్థలో ఆ పేరుతో ఎవరికీ హక్కులు గానీ, వాటాలు గానీ లేవు. అసలు మాది తుర్కియే సంస్థే కాదు. మా కంపెనీ యాజమాన్య హక్కులన్నీ సెలెబీయోగ్లు కుటుంబానికే పరిమితం. వారికి ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు అని కంపెనీ తమ ప్రకటనలో వెల్లడించింది.

## ఎస్‌బిఐ డిపాజిట్ల వడ్డీరేట్లు సవరణ

**ముంబై, మే 16:** ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 20 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. శుక్రవారం నుంచే ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నాయి. రేట్ల కోతపై ఎస్‌బీఐ ఇప్పటికే బ్యాంకు సిబ్బందికి సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. అత్యధిక వడ్డీ ఇచ్చే 444 రోజుల స్పెషల్ డిపాజిట్ స్కీమ్ అమృత్ వృష్టితో పాటు అన్ని కాలావధి డిపాజిట్లపై ఈ కోత ఉంటుందని బ్యాంకు తెలిపింది. 444 రోజుల డిపాజిట్ స్కీమ్‌పై ఇప్పటివరకు 7.05 శాతం వడ్డీ ఇవ్వగా.. ఇప్పుడు దాన్ని 6.85కు తగ్గించింది. రూ.3 కోట్ల లోపు ఎఫ్‌డీలపై 12 ఏళ్ల వ్యవధికి వడ్డీ రేటును 6.50శాతానికి కుదించింది. డిపాజిట్లపై వడ్డీరేట్లను ఎస్‌బీఐ తగ్గించడం నెల వ్యవధిలో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్ లోనే వివిధ కాలావధి డిపాజిట్లపై వడ్డీని 1025 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కీలక వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండు సార్లు తగ్గించిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు రెపో రేటును 50బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో బ్యాంకులూ ఆ ప్రయోజనాన్ని రుణ గ్రహీతలు బదిలీ చేస్తున్నాయి. అదే సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపైమాత్రం వడ్డీరేట్లను తగ్గించడం మొదలుపెట్టాయి. హెచ్‌డీఎఫ్‌సీ వంటి ఇతర బ్యాంకులూ ఇటీవల డిపాజిట్ రేట్లలో కోత పెట్టాయి.




## స్విగ్గీ, జొమాటో షేర్ల ర్యాలీ..

**ముంబై, మే 16:** ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్స్ అయిన స్విగ్గీ, జొమాటో షేర్లు రాణిస్తున్నాయి. శుక్రవారం ఇంట్రాడేలో ఇరు కంపెనీ షేర్లు దాదాపు 3.3 శాతం మేర లాభపడ్డాయి. రెయిన్ సర్‌ఛార్జ్ మినహాయింపును తొలగిస్తుండటమే ఇందుక్కారణం. అంటే ఇకపై స్విగ్గీ వన్, జొమాటో గోల్డ్ చందాదారులు కూడా ఈఅదనపు రుసుము భరించాల్సి ఉంటుందన్నమాట. అయితే ఈ అంశాన్ని ఇరు సంస్థలు అధికారికంగా వెల్లడించలేదు. స్విగ్గీ తన కస్టమర్లకు మెరుగైన సేవలు, సౌలభ్యం కోరుకొనే వినియోగదారుల కోసం స్విగ్గీ 'స్విగ్గీ వన్' పేరిట, జొమాటో జొమాటో గోల్డ్ పేరిట సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను అందిస్తోంది. వీటిని కొనుగోలు చేసిన వారికి ఇరు సంస్థలు పలు ప్రత్యేక ప్రయోజనాల్సి అందిస్తున్నాయి. వాటిలో రెయిన్ సర్‌ఛార్జ్ కూడా ఒకటి. అయితే తాజాగా ఈ సదుపాయాన్ని చందా దారులకు తొలగించినట్లు తెలుస్తోంది. అంటే ఇకపై సాధారణ యూజర్లు మాదిరిగానే వీళ్లు కూడా ఈ రుసుము కట్టా ల్సిందే. భారీగా వర్షం పడే సమయంలో ఈ సర్‌ఛార్జ్ రూ.15 నుంచి రూ.30 వరకు ఉంటుంది. ఇప్పటికే ఈఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు క్విక్ కామర్స్ విభాగంలో పెద్దఎత్తున నష్టాల్ని మూటగట్టుకుంటున్న విషయం తెలిసిందే. మరోవైపు తమ నష్టాలను తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది.




# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

## వాణిజ్యం

**ముంబై, మే 16:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీలు నష్టాలను చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ 200 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ మాత్రం 25 వేల పాయింట్ల పైనే కొనసాగుతోంది. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచి 0.94 శాతం మేర లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచి 1.86 శాతం మేర లాభపడింది. సెన్సెక్స్ ఉదయం 82,392.63 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,146.95 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 200.15 పాయింట్ల నష్టంతో 82,330.59 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 42.30 పాయింట్ల నష్టంతో 25,019.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 3 పైసలు బలపడి 85.51గా ఉంది. ఎటెర్నల్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, టాటా మోటార్స్ షేర్లు రాణించాయి. భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.44 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు మళ్లీ 3200 మార్కు దాటి 3205 డాలర్ల వద్ద ట్రేడయింది.



## వరల్డ్ టాప్ 50 బ్రాండ్లలో టిసిఎస్

**న్యూఢిల్లీ, మే 16:** ప్రముఖ ఐటి దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కాంటర్ బ్రాండ్‌జెడ్ మోస్ట్ వాల్యూయబుల్ గ్లోబల్ బ్రాండ్స్ 2025 నివేదికలో ప్రపంచవ్యాప్తంగా 100 అత్యంత విలువైన బ్రాండ్లలో ఒకటిగా నిలిచింది. న్యూయార్క్‌లో కాంటార్ నిర్వహించిన స్పెషల్ 20వ ఎడిషన్ వేడుకలో టిసిఎస్ బ్రాండ్ విలువ 57.3 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది గత యేడాది కంటే 28శాతం ఎక్కువని తెలుస్తోంది. మెమెంటమ్ ఐటిఎస్‌ఎంఎ నిర్వహించిన స్వతంత్ర బ్రాండ్ ఆడిట్లో ప్రపంచ వ్యాప్తంగా 95శాతం మంది బిజిఎస్ ఎగ్జిక్యూటివ్‌లు టిసిఎస్ బ్రాండ్‌ను గుర్తించారని తేలింది. పరిశ్రమరంగాలలో ప్రపంచంలోని ప్రముఖ బ్రాండ్‌లను కలిగి ఉననన జాబితాలో టిసిఎస్ ప్రపంచవ్యాప్తంగా 45వ స్థానంలో ఉంది. ఇది కంపెనీ వేగవంతమైన వృద్ధిని సూచిస్తుంది. బ్రాండ్ విలువ,




ఈక్విటీలో ఈ పెరుగుదల కంపెనీ నిరంతర బ్రాండ్ నిర్మాణ ప్రయత్నాలను హైలైట్ చేస్తుంది. ఈ సందర్భంగా కాంటర్ బ్రాండ్‌జెడ్ హెడ్ మార్టిన్ గెరిరియా అధిపతి మాట్లాడుతూ, సరైన పెట్టుబడి, వ్యూహాత్మకదృష్టితో బ్రాండ్లు తమ యజమానులకు మంచి వృద్ధిని అందించగలవు. టిసిఎస్ ఈ యేడాది చూపిన పని తీరు, ఎఐ సామర్థ్యాలను విస్తృతంగా వినియోగించుకోవడం వంటివి దీని వృద్ధికిదోహదపడ్డాయి. టిసిఎస్ చేపడుతున్న కార్యక్రమాలే సంస్థ బలమైన గుర్తింపుకు కారణమైంది.

## ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు డౌన్..

**ముంబై, మే 16:** ప్రముఖ ప్రైవేటురంగ ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో క్షీణించాయి. బ్యాంకులో అకౌంటింగ్ లోపాలు వెలుగుచూసిన నేపథ్యంలో ఇవి ఒత్తిడికి గురవుతున్నాయి. దీంతో ఇంట్రాడేలో షేర్లు 5 శాతానికి పైగా క్షీణించాయి. 202425 ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాల్లో రూ.674 కోట్ల మొత్తం వడ్డీ ఆదాయాన్ని తప్పుగా నమోదు చేసింది. ఈ విషయం అంతర్గత ఆడిట్ నివేదికలో బయటపడింది. అయితే ఆ లోపాల్ని 2025 జనవరి 10 నాటికే సరిదిద్దామని నిన్న స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో కంపెనీ స్పష్టంచేసింది. అయినా క్రమంగా బ్యాంకులో వెలుగుచూస్తున్న అకౌంటింగ్ లోపాలు షేర్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇంట్రాడేలో బీఎస్‌ఈలో 5.68 శాతం నష్టంతో రూ.735.95 వద్ద కనిష్ఠాన్ని తాకిన షేర్లు ఇంట్రాడేలో రూ.760.15 వద్ద ట్రేడవుతున్నాయి. ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ షేర్లు శుక్రవారం నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో దాదాపు 3 శాతం మేర షేర్లు కుంగాయి. సింగపూర్ సంస్థ సింగటెల్‌కు ఎయిర్‌టెల్‌లో 1.4 శాతం వాటాను విక్రయించనుందని వార్తలు వచ్చిన నేపథ్యంలో షేర్లపై ఒత్తిడి పెరిగింది. బ్లాక్ డీల్ ద్వారా షేర్లను విక్రయించనుందని తెలుస్తోంది. దీని ఫ్లోర్ ప్రైజ్ రూ.1800గా నిర్ణయించినట్లు సమాచారం. అంటే ప్రస్తుతం స్టాక్స్ ట్రేడవుతున్న ధర కంటే డిస్కౌంట్‌కే ఈ డీల్ జరగనుంది. అయితే ఇప్పటివరకు ఈ విషయంపై టెలికాం సంస్థ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటనా రాలేదు. ఎయిర్‌టెల్ షేర్లు ఎన్‌ఎస్‌ఈలో 2.81 శాతం నష్టంతో రూ.1,814 వద్ద ట్రేడయ్యాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.